ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

హైదరాబాద్ fb.com/vaartha

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

21-2-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 20 పేజీలు: 10+4 వెల: 6.50

మహారాష్ట్ర మంత్రికి రెండేళ్ల జైలు

శ్రీలంకలో రైలు ఢీకొని ఆరు ఏనుగులు మృతి

5



గురువారం రామ్‌లీలా మైదాన్‌లో ఢిల్లీ సిఎంగా రేఖాగుప్తాచే ప్రమాణం చేయిస్తున్న లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా

## ఢిల్లీ పీఠంపై రేఖా గుప్తా

**రామ్‌లీలా మైదాన్‌లో అట్టహాసంగా జరిగిన ప్రమాణ స్వీకారం**

**డి.సిఎం పర్వేష్ సింగ్ వర్మ, మరో ఐదుగురు మంత్రులు ప్రమాణం**

**హాజరైన ప్రధాని మోడీ, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయె సిఎంలు, ఎపి సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్**

**మంత్రులకు వెంటనే శాఖల కేటాయింపు**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** రెండున్నరదశాబ్దాలు దాటిన తర్వాత దేశరాజధాని ఢిల్లీలో బిజెపి ప్రభుత్వం కొలువుదీరింది. గురువారం మధ్యాహ్నం రామ్‌లీలామైదాన్‌లో జరిగిన భారీ సభలో ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా ప్రమాణస్వీకారంచేసారు. లెఫ్టినెంట్ గవర్నర్ వికెసక్సేనా ఆమెతో ప్రమాణం చేయించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, హోంమంత్రి అమిత్‌షా,

>>2

## రాజలింగమూర్తి హత్యపై సిఐడి విచారణ

**ఆదేశించిన సిఎం రేవంత్**



**హత్యకు బిఆర్ఎస్ నేతలే కారణమంటున్న హతుడి భార్య**

**ఐదుగురిపై పోలీసు కేసు నమోదు**

**భూతగాదాలే కారణమంటున్న పోలీసులు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి20:** మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీ కుంగుబాటుపై కోర్టుకెక్కిన రాజలింగ మూర్తి దారుణ హత్యకు గురైన విషయం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది జయశంకర్ భూపాలపల్లిలో సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్య ఘటనను తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. రాజలింగమూర్తి దారుణ హత్యపై సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు. ఉన్నతాధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై సీఐడీ విచారణకు సీఎం ఆదేశించారు. కాళేశ్వరం అక్రమాలపై పోరాడుతున్నందుకే లింగమూర్తిని హత్య చేసారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. మరోవైపు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఆయన అనుచరులే రాజలింగమూర్తిని చంపారని మృతుడి భార్య, కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే తన అనుచరుల ద్వారా నడిరోడ్డు మీద తన భర్తను హత్య చేయించారన్న రాజలింగమూర్తి భార్య సరళ చెబుతూ రోదించారు. రాజలింగమూర్తి హత్యకు బీఆర్ఎస్ నేత గండ్ర వెంకటరమణా రెడ్డి కారణమని తొలుత ఆరోపణలు రాగా.. భూ వివాదాల నేపథ్యంలో ఆయన హత్య జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు హత్యకేసులో నిందితులుగా ఉన్న ఐదుగురిపై మృతురాలి భార్య ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. హత్య కేసులో నిందితులైన రేణుకుంట్ల సంజీవ్, పింగళి శ్రీమంత్, మోరే కుమార్, కొత్తూరి కుమార్, రేణుకుంట్ల కొమురయ్యపై కేసు నమోదు చేసిన పోలీసులు తెలిపారు. కేసును విచారిస్తున్నామని

>>2



## 8 మంది ఐఎఎస్‌ల బదలీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి20:** తెలంగాణలో ఎనిమిది మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా ఉన్న కె.సురేంద్రమోహన్‌కు సహకార కమిషనర్, మార్కెటింగ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆరోగ్యశ్రీ సీఈవో ఎల్. శివకుమార్‌ను జిఏడీలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ ఆర్.వి.కర్ణన్‌కు ఆరోగ్యశ్రీ సీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు.ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శిగా ఉన్న కె.హరిత వాణిజ్య పన్నుల డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఇక్కడ ఎఫ్ ఏసిగా ఉన్న సయ్య అలీ ముర్తాజా రిజ్వీ రిలీవ్ అయ్యారు.

>>2



## ఎమ్మెల్సీ ఎన్నికలపై గాంధీ భవన్‌లో కంట్రోల్ రూమ్

**మన సీటు మనమే గెలుచుకోవాలి: మీనాక్షి నటరాజన్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి20:** తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ అధిష్ఠానం నజర్ పెట్టింది. సిట్టింగ్ ఎమ్మెల్సీ సీటును తిరిగి గెలుచుకునేందుకు పకడ్బందీ వ్యూహంతో వెళ్లాలని అధిష్ఠానం ఆదేశించింది. ఈ మేరకు గురువారం సాయంత్రం టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్... మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, జూపల్లి కృష్ణారావు, కొండ సురేఖ పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల పరిధిలో 42 అసెంబ్లీ నియోజక వర్గాల బాద్యులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇంచార్జ్‌లు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ సేవాదల్, మహిళ కాంగ్రెస్ అధ్యక్షులు పాల్గొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ పకడ్బందీగా ప్రచార వ్యూహం రూపొందించాలని ఆదేశించారు.50 మంది

>>2

## పన్నులు, పథకాల కింద రూ.1.08 లక్షల కోట్లు



**తెలంగాణ కోసం కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు**

**కాంగ్రెస్ ప్రభుత్వంపై సొంత ఎమ్మెల్యేల్లోనే అసంతృప్తి**

**-కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** కేంద్ర బడ్జెట్‌లో పన్నులు, పథకాల రూపంలో తెలంగాణకు రూ. 1.08 లక్షల కోట్లు కేటాయించిందని, బడ్జెట్‌లో అన్యాయం జరిగిందనడం పచ్చి అబద్ధం అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండిసంజయ్‌కుమార్ అన్నారు. గురువారం నగరంలోని ఒక హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. బడ్జెట్ విషయంలో కళ్లుండి చూడలేని, చెవులుండి వినలేని కబోధులు కాంగ్రెస్ నేతలు అన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా వాటి నుంచి దృష్టి మరల్చేందుకు కేంద్రంపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. బిఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తుందన్నారు. తెలంగాణలోని గ్రామాలు, పట్టణాల వారీగా కేంద్రం ఏం చేసిందో, రాష్ట్రం ఏం చేసిందో చర్చించడానికి సిద్ధమా? అంటూ ప్రశ్నించారు. తెలంగాణకు కేంద్రం ఏమిచ్చిందో? ఎవరు అన్యాయం చేశారో బహిరంగ చర్చకు మేం సిద్దం అన్నారు. ప్రధాని హోదాకు గౌరవం ఇవ్వకుండా అవాకులు పేలడం సరికాదన్నారు. ట్యాక్స్ డివల్యూషన్ రూపంలో 29 వేల 899 కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. గత యేడాదితో పోలిస్తే 10 శాతం నిధులు పెంచామని, గ్రాంట్ల రూపంలో రూ.21075 కోట్లు కేటాయించిందన్నారు. రైల్వేల అభివృద్ధికి రూ.5 వేల 336 కోట్లు కేటాయించిందని, యూపిఏ హయాంతో పోలిస్తే 20 రెట్లు ఎక్కువ మౌలికసదుపాయాల అభివృద్ధి కోసం ఈ యేడాది బడ్జెట్‌లో రూ.2500 కోట్ల మేరకు రుణాలివ్వబోతున్నామని అన్నారు. రోడ్లు, రైళ్లు, విమానయాన రంగాల అభివృద్ధి కోసం రూ.28302 కోట్లు కేటాయించామని, ఇందులో జాతీయ రహదారుల విస్తరణ కోసం రూ.15640 కోట్లు కేటాయించిందన్నారు. విద్యుత్, ఇంధన, నీటిపారుదల రంగాల అభివృద్ధి కోసం రూ.10285 కోట్లు కేటాయించిందని, గ్రామాల, పట్టణాల అభివృద్ధి కోసం ఈ యేడాది మొత్తం రూ.6320 కోట్లు ఖర్చు చేయబోతున్నామని వివరించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో భాగంగా ఇండ్ల నిర్మాణం కోసం రూ.2,120 కోట్లు కేటాయించామని, వ్యవసాయం, సహకార, పశుసంవర్ధక శాఖల ద్వారా రైతులకు మేలు చేసేందుకు రూ.5,920 కోట్లు ఖర్చు చేయబోతున్నామని అన్నారు. ఆరోగ్యం, పారిశుధ్య రంగాల కోసం ఈ ఏడాది మొత్తం 5790 కోట్లు కేటాయించినట్లు, విద్యా, క్రీడా రంగాల అభివృద్ధి కోసం ఈ యేడాది 4930 కోట్లు ఖర్చు చేయబోతున్నామని, ఎంఎస్ ఎంఈ పథకాలు, రుణసబ్సిడీల కోసం 2150 కోట్లు, స్కిల్ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్స్

>>2

## నేడు వికారాబాద్, నారాయణపేటలో సిఎం పర్యటన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి20:** వికారాబాద్, నారాయణ పేట జిల్లాల్లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుక్రవారం పర్యటన చేయనున్నారు.పలు అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు.ముఖ్యమంత్రి పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం మధ్నాహ్నం 12 గంటలకు ముఖ్యమంత్రి వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలం పోలేపల్లి గ్రామానికి చేరుకుంటారు. పోలేపల్లి లో రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయంలో జరిగే పూజా కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత నారాయణ పేట మండలం అప్పక్ పల్లి చేరుకుంటారు. అక్కడ జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పెట్రోల్ బంక్ ను ప్రారంభిస్తారు. బీపీసీఎల్ కంపెనీ సహకారంతో పూర్తిగా మహిళలచే నడిపే పెట్రోల్ బంక్ ఇది. రాష్ట్రంలోనే మొదటి సారి ఈ తరహా బంక్‌ను

>>2

## ఎపి జలదోపిడికి కెసిఆర్ వత్తాసు

**కృష్ణా నీటి వాటాలో అంతా అన్యాయమే**

**జగన్‌తో స్నేహం చేస్తూ దోపిడిని అడ్డుకోని కెసిఆర్**

**తెలంగాణ హక్కుల పరిరక్షణే మా లక్ష్యం**

**మీడియాతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



గురువారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న నీటిపారుదల మంత్రి ఉత్తమ్. చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం ప్రభాకర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి20:** ఏపీ ప్రభుత్వం చేస్తున్న జలదోపిడీకి గత బీఆర్ఎస్ ప్రభుత్వం సహకరించిందని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు కేవలం 200 టీఎంసీలు సరిపోతాయని చెప్పిన ఘనత బీఆర్ఎస్‌దేనని తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కృష్ణా నది నీటిలో తెలంగాణకు 500 టీఎంసీలు కావాలనే వాదన ప్రారంభించామన్నారు. కృష్ణా నది జలాలు ఆంధ్రపాలకులు ఉల్లంఘనలను అతిక్రమించి దోచుకపోతుంటే సహకరించిన బి.ఆర్.ఎస్ పాలకులు ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రదిష్ట పాలు చేసెందుకు తప్పుడు ప్రచారానికి దిగుతున్నారని ఆయన మండిపడ్డారు. కృష్ణా నది జలాల వివాదంపై గురువారం రోజున జలసౌధలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలతో కలసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అద్భుతంగా ఉండేదని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వల్లే తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. జగన్‌తో స్నేహంగా ఉంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఏపీ చేస్తున్న జలదోపిడీకి సహకరించారన్నారు. జగన్ పోతిరెడ్డిపాడు కెపాసిటీ పెంచుతున్నా, అక్రమంగా ముచ్చుమర్రి నిర్మాణం చేపట్టినా కేసీఆర్ నోరెత్తలేదని మండిపడ్డారు. "పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం టెలిమెట్రీల ఏర్పాటు కూడా చేయలేదు. కృష్ణా జలాలను ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం బేసిన్ అవతలకు తరలిస్తుంటే అస్సలు పట్టించుకోలేదు. కృష్ణా జలాల్లో 299 టీఎంసీలు తెలంగాణ హక్కు అయితే 190 టీఎంసీల కంటే ఎక్కువగా ఎన్నడూ వాడలేదు. కృష్ణా బేసిన్‌లో నిర్మిస్తున్న ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే తెలంగాణ వాటా పూర్తిగా వాడుకునేవాళ్లం. ఏదుల, డిండి ప్రాజెక్టులను కూడా పదేళ్లలో గత ప్రభుత్వం పూర్తి చేయలేదు" ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై రూ.25 వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదని ఆరోపించారు. కృష్ణా జలాలను ఏపీ ప్రభుత్వం అధికంగా వాడుకుంటున్న విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. సీతారామ ప్రాజెక్టుకు 67 టీఎంసీల అనుమతిని తామే సాధించినట్లు స్పష్టం చేశారు. సమ్మక్క సారక్క ప్రాజెక్టుకు కూడా అనుమతులు సాధించామన్నారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం, కుంగిపోవటం బీఆర్ఎస్ పాలన కాలంలోనే జరిగిందని, మేడిగడ్డ బ్యారేజీ కుంగడంపై కేసీఆర్ ఎప్పుడూ నోరు కూడా విప్పలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. మేడిగడ్డ డిజైన్, నిర్మాణంలో లోపాలు ఉన్నాయని జాతీయ డ్యామ్ సేఫ్టీ కమిటీ చెప్పిందని, ఎవరైనా ప్రాజెక్టుల కోసం దీర్ఘకాలిక, తక్కువ వడ్డీకి రుణాలు తెస్తారా అని ప్రశ్నించారు.

>>2

## 25న పిఎం కిసాన్ పెట్టుబడి సాయం

**మొత్తం రూ. 9 కోట్ల మంది రైతులకు లబ్ధి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** రైతులకు కేంద్ర సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. 19వ విడత పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన నిధుల విడుదలకు సంబంధించిన తేదీని ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 25వ తేదీన రైతుల ఖాతాల్లో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధులను జమ చేయనున్నట్లు ప్రకటించింది. ఈ స్కీమ్ ద్వారా మొత్తం 9 కోట్ల మంది పైగా రైతులకు లబ్ధి చేకూరనుంది. కాగా కేంద్ర ప్రభుత్వం రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. 2019 ఫిబ్రవరిలో ఈ పథకాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ఈ

>>2



## 25, 26న హైదరాబాద్‌లో బయో ఆసియా సదస్సు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి20:** హెల్త్ టెక్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో తెలంగాణను ప్రపంచంలో అగ్రగామిగా నిలిపేందుకు ఈ నెల 25, 26వ తేదీల్లో 'బయో ఆసియా-2025' సదస్సును హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది ఏఐ ఆధారిత ఆరోగ్య సంరక్షణ పరివర్తన, లైఫ్ సైన్సెస్‌లో ఆవిష్కరణలు, డేటా ఇంటర్ ఆపరేబిలిటీ, క్లినికల్ ట్రయల్స్‌లో భారత్ పాత్ర తదితర అంశాలపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. ఈ వేదిక ద్వారా జీవవైద్య, ఫార్మా రంగాలకు చెందిన జాతీయ, అంతర్జాతీయ నిపుణులు, ఆవిష్కర్తలను ఒకే చోటు చేర్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. దేశీయ, విదేశీ మార్కెట్లలో లైఫ్ సైన్సెస్ రంగంలో ఉన్న అవకాశాలు,

>>2

## కొండెక్కుతున్న ఇంజినీరింగ్!



**ట్యూషన్ ఫీజు రూ. 2.94 లక్షలు చేయాలంటున్న సిబిఐటి!**

**వందశాతం పెంచాలంటున్న ప్రైవేటు కాలేజీలు**

**వచ్చే ఏడాది నుంచి భారీగా పెరిగే అవకాశం**

**ఫీజు నిర్ధారణ కోసం ఎఎఫ్ఆర్‌సికి 157 కాలేజీలు దరఖాస్తు**

**మే చివరికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పణ**

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు తమ ట్యూషన్ ఫీజులను పెంచాలని తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజ్ రెగ్యులేటరీ కమిటీ(ఏఎఫ్ఆర్‌సీ)కి దరఖాస్తు చేసుకున్నాయి. దరఖాస్తు చేసుకున్న వాటిలో మంచి పేరున్న కాలేజీలు.. టాప్-20లో ఉన్న కాలేజీలు.. ఇప్పటికే రూ.లక్షకిపైగా ఫీజు ఉన్న కాలేజీలు తమ ట్యూషన్ ఫీజును వంద శాతం పెంచాలని పేర్కొన్నాయి. కొన్ని కాలేజీలు 50 శాతం వరకు పెంచాలని పేర్కొంటుతమ ప్రతిపాదనలను ఏఎఫ్ఆర్‌సీకి సమర్పించాయి. రాష్ట్రంలోని ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు భారీగా ఫీజుల పెంపును ప్రతిపాదించాయి. 2025-26 విద్యా సంవత్సరం నుండి ప్రారంభమయ్యే తదుపరి మూడు సంవత్సరాల బ్లాక్ పీరియడ్‌కు 50శాతం నుండి 100 శాతం వరకు ఫీజుల పెంపును కోరుతూ కాలేజీ యాజమాన్యాలు ఏఎఫ్ఆర్‌సీకి ప్రతిపాదనలు సమర్పించాయి. అందులో భాగంగా సీబీఐటీ కాలేజీ తన ఫీజును సంవత్సరానికి రూ.1.65 లక్షల నుండి రూ.2.94 లక్షలకు పెంచాలని ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న ఫీజుకి ఇంది దాదాపు రెట్టింపు ప్రతిపాదన. ఏఎఫ్ఆర్‌సీకి ప్రతిపాదించిన ఫీజుల్లో ఇదే అత్యధిక ఫీజు. వీజేఐఈటీ ప్రస్తుతం సంవత్సరానికి రూ.1.35 లక్షల ఫీజు ఉండగా.. దానిని కాస్త రూ.2.84 లక్షలకు

>>2



గురువారం మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ డిసిపి వినీత్

## 'డ్రగ్స్' లేడీ!

**కార్పొరేట్ సంస్థలో ఉద్యోగం**

**మత్తు మందులతో వ్యాపారం**

**ఓ యువతిని అరెస్టు చేసిన పోలీసులు**

**భారీగా మాదకద్రవ్యాలు స్వాధీనం**

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** బెంగళూరులో ఏ కార్పొరేట్ సంస్థలో మంచి ఉద్యోగం చేస్తున్న యువతి తనకు పరిచయమైన ఆఫ్రికా వ్యక్తి కారణంగా డ్రగ్స్ సరఫరాదారుగా మారింది. మొదట కేవలం తాను ఉంటున్న గదిలో డ్రగ్స్ నిల్వ ఉంచుకున్న యువతి అనంతరం డబ్బు కోసం ఆఫ్రికా వ్యక్తి చెప్పిన వ్యక్తులకు డ్రగ్స్ సరఫరా చేయడం ప్రారంభించింది. ఇదే తరహాలో నగరానికి నిషేదిత ఎండిఎంఏ డ్రగ్స్‌ను తసుకొని వచ్చి, ఇక్కడి కొంతమందికి డ్రగ్స్ అందజేసే క్రమంలో పోలీసులకు పట్టుబడింది. మియాపూర్ పోలసులు, టిజినాబ్ పోలీసులతో కలిసి మియాపూర్‌లో యువతిని వలపన్ని పట్టుకోగా, యువతి వద్ద నుంచి 60 గ్రాముల నిషేదిత ఎండిఎంఏ డ్రగ్స్‌ను స్వాధనం చేసుకున్నారు. సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలోని మియాపూర్‌లో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను గురువారం మాదాపూర్ డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిసిపి వినీత్, టిజినాబ్ డిఎస్‌పి హరిచంద్రరెడ్డిలు వెల్లడించారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన శతాబ్ది మన్నా(28) 2019లో తన బిబిఏ గ్రాడ్యుయేషన్ చేసేందుకు కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు వెళ్లింది. అక్కడే చదువు పూర్తి చేసిన శతాబ్ది ఒకార్పొరేట్‌సంస్థలో ఉద్యోగం చేస్తూ బెంగళూరులోని

>>2



న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో గురువారం ఢిల్లీ సిఎం ప్రమాణ కార్యక్రమంలో ఎపి డి.సిఎం పవన్‌తో ముచ్చటిస్తున్న ప్రధాని మోడీ

# హిమాలయాలకు వెళ్తున్నారా?

## ఎపి డి.సిఎం పవన్‌తో ప్రధాని మోడీ ఛలోక్తి

## ఢిల్లీ సిఎం ప్రమాణ స్వీకారోత్సవంలో అందరిని ఆకట్టుకున్న పవన్ ఆహార్యం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఓ సరదా సన్నివేశం చోటుచేసుకుంది. ప్రధాని మోడీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సరదాగా మాట్లాడుకున్నారు. ఎపి డిప్యూటీ సిఎం ఆహార్యాన్ని చూసిన మోడీ హిమాలయాలకు వెళుతున్నారా పవన్? అని ప్రశ్నించారు. దాంతో అక్కడున్న నేతలంతా చిరునవ్వులు చిందించారు. ఈ సంభాషణ గురించి పవన్ తర్వాత మీడియాకు వెల్లడించారు. ఈ రోజు ఢిల్లీలో జరిగిన రేఖా గుప్తా ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధాని మోడీ, బిజెపి అగ్రనేతలు, ఎన్డీయే కూటమి నాయకులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మహారాష్ట్ర డిప్యూటీ సిఎం ఏక్‌నాథ్ షిండే సహా పలువురు నాయకులను మోడీ పలకరించారు. ఈ కార్యక్రమానికి గంధం రంగులో ఉన్న సంప్రదాయ దుస్తుల్లో పవన్ కల్యాణ్ వచ్చారు. వాటి గురించి మోడీకి తనకు మధ్య జరిగిన సంభాషణను ఆయన వెల్లడించారు. 'నాతో ప్రధాని ఎప్పుడు మాట్లాడినా సరదాగా జోకులేస్తుంటారు. ఈ రోజు నా ఆహార్యం గురించి మాట్లాడారు. అన్నీ వదిలేసి హిమాలయాలకు వెళుతున్నారా? అని అడిగారు. ఎక్కడికీ వెళ్లడం లేదని, చేయాల్సిన పని చాలా ఉందని తాను వెంటనే బదులిచ్చినట్లు చెప్పారు. హిమాలయాలకు ఇంకా సమయం ఉందన్నట్లుగా మీడియాతో సరదాగా మాట్లాడారు. ప్రధాని గతంలోనూ పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి ప్రత్యేకంగా మాట్లాడారు. గత ఏడాది సార్వత్రిక, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల విజయాలతో కూటమి లోక్‌సభా పక్షనేతగా ఎన్నికైన అనంతరం మోడీ మాట్లాడుతూ ఎపిలో దక్కిన విజయం ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టింది. చంద్రబాబుతో కలిసి చరిత్రాత్మక విజయం సాధించాం. ఇక్కడ కూర్చున్న వ్యక్తి పవన్ కాదు తుఫాన్' అని కొనియాడారు.

# జలదోపిడికి కెసిఆర్ వత్తాసు

>> కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం కమీషన్ల కక్కుర్తి కోసం అడ్డగోలుగా ఎక్కువ వడ్డీకి అప్పులు తెచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వల్లే కృష్ణా జలాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగినట్లు ఆయన ఆరోపించారు. పదేళ్లపాటు కనీసం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ నిర్మాణాన్ని కేసీఆర్ పట్టించుకోలేదని, కృష్ణా జలాలను జగన్ ప్రభుత్వం బేసిన్ అవతలకు తరలిస్తుంటే చూస్తు ఉన్నారని మంత్రి ఉత్తమ్ అన్నారు. కృష్ణా జలాల్లో కేటాయింపులు చెరో సగం చేయాలని వాదన తానే మొదలుపెట్టినట్లు తెలిపారు. తెలంగాణకు 299 టీఎంసీలు సరిపోతాయని గతంలో కేసీఆర్ ఒప్పుకుని వచ్చారని ఆరోపించారు. గతంలో శ్రీశైలం ప్రాజెక్టు అట్టడుగు నుంచి కూడా రోజుకో టీఎంసీని ఏపీ తరలించుకుపోతుంటే కేసీఆర్ నోరెత్తలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 'కాళేశ్వరం హృదయం'గా పేర్కొన్న మెడిగడ్డ బ్యారేజ్ వారి స్వంత పాలనలో కూలిపోయిందని అటువంటి వైఫల్యాన్ని ఒప్పుకోకుండా, కేసీఆర్, హరీష్ రావు, ఇతర బీఆర్ఎస్ నేతలు ఒకే ఒక స్తంభం కూలిపోయిందని నిర్లజ్జగా చెబుతుండడం హాస్యాస్పదంగా మారిందన్నారు. ఆ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం వెచ్చించిన నిధులు అధిక వడ్డీ, స్వల్పకాలిక రుణాల ద్వారా పొందబడ్డాయని, ఇది తెలంగాణపై భారీ ఆర్థిక భారం మోపిందన్నారు. దేవాదుల, కల్వకుర్తి, నెట్టంపాడు, భీమా, కోయల్ సాగర్, ఎస్ఎల్‌బీసీ దిండి వంటి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చెయ్యలేక పోయారో బిఆర్ఎస్ నేతలు తేల్చిచెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి చేయడం ద్వారా తెలంగాణ జల హక్కులను కాపాడడంతో పాటి నీటిపారుదల రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన తెలిపారు.

# రాజలింగమూర్తి హత్యపై సిఐడి విచారణ

>> పోలీసులు తెలిపారు. 2023లో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి బిఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని రాజలింగమూర్తి న్యాయ పోరాటానికి దిగారు. ఈ మేరకు కేసులో కెసిఆర్, హరీష్‌రావులకు కోర్టు నోటీసులు ఇచ్చింది. అయితే, అనూహ్యంగా రాజలింగమూర్తి బుధవారం సాయంత్రం దారుణ హత్యకు గురయ్యారు. గుర్తు తెలియని దుండగులు కత్తులతో దాడి చేసి అతి కిరాతకంగా హతమార్చారు. రాజలింగమూర్తి 2 దశాబ్దాలుగా వరంగల్‌కు చెందిన ఓ ప్రముఖ న్యాయవాది ద్వారా భూ సమస్యలను పరిష్కరించేవారు. రాజలింగమూర్తిపై గతంలో పలు కేసులు కూడా నమోదయ్యాయి. ఓపెన్‌కాస్ట్ గనుల తవ్వకాలతో పర్యావరణం దెబ్బతింటోందని సింగరేణిపై ఎన్‌జీటీ(నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్)లో ఆయన ఫిర్యాదు చేశారు. తన భర్త దారుణహత్యకు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్ బుర్ర చంద్రయ్య, వార్డు మాజీ కౌన్సిలర్ కొత్త హరిబాబు కారణమని, వారిపై చర్యలు తీసుకోవాలని రాజలింగమూర్తి భార్య సరళ, కుటుంబ సభ్యులతో కలిసి పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో నేషనల్ హైవేపై బుధవారం రాత్రి బైఠాయించారు.

**రాజలింగమూర్తి హత్యపై అన్ని కోణాల్లో దర్యాప్తు - డీఎస్‌పీ సంపత్‌రావు**

రాష్ట్రంలో తీవ్ర సంచలనం సృష్టించిన సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్యపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ సంపత్‌అవు తెలిపారు. ఈ హత్య కేసులో ఇంకా ఎవరినీ కస్టడీలోకి తీసుకోలేదని చెప్పారు. హత్య వెనుక ఎవరు ఉన్నా వదిలిపెట్టమని స్పష్టం చేశారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు. రాజలింగమూర్తితో హంతకులకు భూతగాదాలు ఉన్నాయని, హత్యకు ఇతర కారణాల కోణంలోనూ దర్యాప్తు జరుగుతోందని చెప్పారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి విచారణ జరుపుతున్నామన్నారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి భారాస ప్రభుత్వమే కారణమంటూ కేసు వేసిన రాజలింగమూర్తి (47) హత్యకు గురయ్యారు. ఈ హత్యపై తెలంగాణ సీఎం కార్యాలయం (సీఎంవో) ఆరా తీశారు.

# యాదగిరిగుట్ట సంప్రోక్షణ మహోత్సవం.. సిఎం రేవంత్‌కు ఆహ్వానం!

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి20:** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం బంగారు విమాన గోపుర మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవంలో పాల్గొనాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆహ్వానం అందింది. ఈ మేరకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, కార్యదర్శి శైలజా రామయ్యర్‌తో పాటు ఆలయ ఈఓ, అర్చకులు జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ నెల 23న నిర్వహించనున్న స్వామి వారి బంగారు విమాన గోపుర మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవ కార్యక్రమానికి ఆహ్వాన పత్రికను అందజేశారు.

# జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ గడువు పెంపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి20:** కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజి నిర్మాణాల అక్రమాలపై న్యాయ విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గడువును ఏప్రిల్ 30వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. వాస్తవానికి కమిషన్ గడువు ఈనెలాఖరుతో ముగుస్తుంది. ఇదిలా ఉండగా ఈనెల 23న జస్టిస్ పీసీ ఘోష్ హైదరాబాద్‌కు రానున్నారు. వచ్చే వారంలో చివరి విచారణలో భాగంగా రాజకీయ ప్రముఖులను, గత ప్రభుత్వ పెద్దలను విచారణకు పిలిచే అవకాశాలు ఉన్నాయి.

# అటు ప్రమాణ స్వీకారాలు.. ఇటు మంత్రులకు శాఖల కేటాయింపులు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** న్యూఢిల్లీ అసెంబ్లీకి నాలుగోమహిళా ముఖ్యమంత్రిగా భారీ బహిరంగసభలోప్రమాణస్వీకారంచేసిన రేఖాగుప్తా వెనువెంటనే సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా మంత్రులకు వివిధ శాఖలను కూడా కేటాయించారు. మంత్రులుగా పర్వేష్ సింగ్ వర్మ, రవీందర్‌కుమార్,మంజిందర్‌సింగ్ షిర్సా, ఆశిష్‌సూద్, కపిల్‌మిశ్రా, పంకజ్ కుమార్‌సింగ్‌లు ప్రమాణంచేసారు. సాయంత్రానికల్లా మంత్రులు, ముఖ్యమంత్రులకు శాఖల కేటాయింపులు జరిగిపోయాయి. సీఎం రేఖగుప్తా వద్ద హోం, ఫైనాన్స్, విజిలెన్స్ ప్లానింగ్ ఉంటాయి. డిప్యూటి సీఎం పర్వేష్ వర్మకు విద్య, రవాణా, ప్రజాపనుల విభాగం, మంజీందర్‌సింగ్ సిర్సాకు వైద్యం, పట్టణా భివృద్ధి, పరిశ్రమలు కేటాయించారు. ఇక రవీందర్‌కుమార్‌కు సామాజిక సంక్షేమం, కార్మికశాఖలు ఇవ్వగా కపిల్‌మిశ్రాకు పర్యాటకశాఖ, సంస్కృతి సాంప్రదాయాలు, జలవనరుల శాఖను ఇచ్చారు. ఆశిష్‌సూద్‌కు పర్యావరణం, రెవెన్యూ, ఆహార పౌరసరఫరాలు కేటా యించగా పంకజ్‌కుమార్‌సింగ్‌కు న్యాయశాఖ, గృహనిర్మాణశాఖలు కేటాయించారు.

## వారం - వర్జ్యం

తేది : 21-02-2025, శుక్రవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
అష్టమి ఉ.11.59
అనూరాధ ప.3.53
వర్జ్యం : రా.9.54-11.37
దు.ఉ.9.00-9.47
2) మ.12.53-1.40
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం :** పనులలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. చికాకులు ఎక్కువ అవుతాయి.

**వృషభం :** మీ ఊహలు నిజమయ్యే సూచనలు లేవు. ప్రయాణాలు వద్దు.

**మిథునం:** శ్రమపడ్డా ఫలితం దక్కదు. వ్యాపారాలు నిరాశ పరుస్తాయి.

**కర్కాటకం:** కొత్త పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. వాహనసౌఖ్యం.

**సింహం:** సంఘంలో ఆదరణ పొందుతారు. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

**కన్య :** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. దైవదర్శనాలు.

**తుల :** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. శుభవార్తలు వింటారు.

**వృశ్చికం:**ముఖ్యమైన నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. ప్రయాణాలు.

**ధనుస్సు:** చిన్ననాటి మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు.

**మకరం:** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. వాహనయోగం.

**కుంభం :** కుటుంబంలో బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. శుభవార్తలు.

**మీనం :** వృత్తి వ్యాపారాలలో ఆటుపోట్లు ఎదురైన పట్టుదలతో అధిగమిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 'డ్రగ్స్ లేడీ!

>> సోలా దేవనహళ్లి ప్రాంతంలో ఓ ఇళ్లు అద్దెకు తీసుకొని నివవాం ఉంటుంది. కాగా ఆఫ్రికా నుంచి చదువు కోసం భారత్‌కు వచ్చి బెంగళూరులో ఉంటూ అంతరాష్ట్ర డ్రగ్స్ సరఫరాదారుడిగా మారిన వారెన్ కొకరాంగతో 2024లో శతాబ్దికి పరిచయం ఏర్పడింది. శతాబ్దికి ఉన్న ఆర్థిక సమస్యల కారణంగా కాకరాంగ ఇచ్చిన డ్రగ్స్‌ను తన ఇంట్లో భద్రపరిచేందుకు అంగీకరించింది. ఇదే క్రమంలో కొకరాంగ చెప్పిన వ్యక్తులకు 100,200 గ్రాముల చొప్పున డ్రగ్స్‌ను సరఫరా చేసేది. అనంతరం కొకరాంగో ఆదేశాలతో బెంగళూరు, చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో డ్రగ్స్ సరఫరా చేయడం ప్రారంభించింది. ఇదే తరహాలో బెంగళూరులో మారుతి మనోహర్ అనే డ్రగ్స్ వ్యాపారికి సైతం పలుమార్లు ఎండిఎంఏ సరఫరా చేసింది. కాగా తెలంగాణలో డ్రగ్స్ పరఫరా మీద పోలీసులు ఉక్కుపాదం మోపుతుండడంతో నగరానికి చెందిన కొందరు ఎండిఎంఏ డ్రగ్స్ కోసం కొకరాంగను సంప్రదించారు. అదే సమయంలో బెంగళూరు పోలీసుల దృష్టి వీరి కదలికల మీద పడడంతో హైదరాబాద్ నగరానికి మకాం మార్చాలని పథకం వేశారు. వీరి పథకంలో భాగంగా నగరంలో డ్రగ్స్ కోసం వీరిని సంప్రదించిన వారికి డ్రగ్స్ అందజేసేందుకు శతాబ్ది నగరానికి వచ్చింది. ఈ క్రమంలో మియాపూర్‌లో డ్రగ్స్‌తో ఉన్న శతాబ్ది సమాచారం టిజినాబ్ అధికారులకు తెలియడంతో వారు మియాపూర్ పోలీసులతో కలిసి బుధవారం దాడి చేశారు. డ్రగ్స్ సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్న శతాబ్ది మన్నాను అదుపులోకి తీసుకొని గాలించగా, ఆమె వద్ద 6 లక్షల రూపాయల విలువైన 60 గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్ లభించింది. ఈమేరకు శతాబ్దిని అరెస్టు చేసిన పోలీసులు ఆమె వద్ద నుంచి 60 గ్రాముల ఎండిఎంఏను, ఓ సెల్‌ఫోన్‌ను స్వాధనం చేసుకున్నారు. మేరకు నిందితురాలిని రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడైన కొకరాంగో పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. డ్రగ్స్ సరఫరాదారుల పట్ల నగరవాసులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలు డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

# 25న పిఎం కిసాన్ పెట్టుబడి సాయం

>> పథకం ద్వారా రైతులకు పంట సాయంగా ఎకరానికి సంవత్సరానికి 6 వేల రూపాయలు అందిస్తోంది. ఈ 6 వేల రూపాయలను ప్రతి సంవత్సరం 2 వేల రూపాయల చొప్పున మూడు దఫాలుగా నేరుగా రైతుల అకౌంట్స్‌లో జమ చేస్తూ వస్తోంది. తొలి విడతగా ఏప్రిల్-జులై, రెండో విడతగా ఆగస్టు-నవంబర్, మూడో విడతగా డిసెంబర్-మార్చిలో రూ.2 వేల చొప్పున కేంద్ర సర్కార్ ఈ ఆర్థిక సాయాన్ని అందిస్తోంది.

ఇప్పటి వరకు పీఎం కిసాన్ పథకం ద్వారా కేంద్ర సర్కార్ 18 సార్లు రైతుల ఖాతాల్లో నిధులు విడుదల చేసింది. ఇప్పుడు 19వ దఫా నిధులు విడుదల కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఈ నెల 25న జమ చేయనున్నట్లు వెల్లడించింది. ఈ 19వ విడత పీఎం కిసాన్ పెట్టుబడి సాయాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రిలీజ్ చేస్తారని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

# బంగ్లాపై భారత్ విజయం

## ఆరువికెట్ల తేడాతో బంగ్లా జట్టు ఓటమి

**దుబాయ్, ఫిబ్రవరి 20:** ఐసిసి ఛాంపియన్స్‌ట్రోఫీలో భారత్‌బోణి కొట్టింది. దుబాయ్ వేదికగా బంగ్లాదేశ్‌తోజరిగిన మ్యాచ్‌లో టీమిండియా ఆరువికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌చేసిన బంగ్లా 49.4 ఓవర్లలో 228 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం లక్ష్యఛేదనలో భారత్ 46.3 ఓవర్లలో నాలుగు వికెట్లను కోల్పోయి 231 పరుగులుచేసి విజయం సాధించింది. భారత ఓపెనర్ శుభ్‌మన్‌గిల్ 101 పరుగులుచేసి సెంచరీ వీరుడుగా నిలిచాడు. ఐసిసి ఛాంపియన్స్‌ట్రోఫీలో తొలిసెంచరీ నమోదయింది. ఇంగ్లండ్‌పై సెంచరీ సాధించి దూకుడుపై ఉన్న కెప్టెన్ రోహిత్‌శర్మ 41పరుగులుచేసాడు. తొలి వికెట్‌కు ఓపెనర్ గిల్‌తోకలిసి పది ఓవర్లలోపే 69 పరుగులుజోడించాడు. రోహిత్ ఔట్ అయ్యా క్రీజులోకి వచ్చిన విరాట్ ఆచితూచి ఆడుతూ 22 పరుగులుచేసాడు. స్పిన్నర్ రిషద్ బౌలింగ్‌లోనే కోహ్లీ వికెట్ పడిపోయింది,

శ్రేయస్ అయ్యర్ 15పరుగులేచేసి నిరాశపరిచాడు. అక్షర్‌పటేల్ 8 పరుగులుమాత్రమేచేసి నిరాశకు గురిచేసాడు. వికెట్లు పడుతున్నా ఏకాగ్రతకోల్పోకుండా శుభ్‌మన్‌గిల్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కెఎల్‌రాహుల్ 40 పరుగులుచేసి జట్టును గెలిపించాడు. కెఎల్‌రాహుల్; శుభ్‌మన్‌గిల్ ఇద్దరూ కలిసి జట్టును విజయం వైపు నడిపించారు. గిల్128 బంతుల్లో తొమ్మిదిఫోర్లు, రెండు సిక్సరలతో 101 పరుగులుచేస్తే కెఎల్‌రాహుల్ 47 బంతుల్లో ఒకఫోరు, రెండుసిక్సర్లతో నాటౌట్‌గా నిలిచారు. బంగ్లా బౌలర్లలో రషీద్‌కు రెండు, తక్సిన్ అహ్మద్,రెహమాన్‌కు చెరోవికెట్ లభించింది.



గురువారం రామ్‌లీలా మైదాన్‌లో ఢిల్లీ సిఎంగా ప్రమాణం అనంతరం ప్రధాని మోడీకి అభివాదం చేస్తున్న రేఖాగుప్తా

# ఢిల్లీ పీఠంపై రేఖా గుప్తా

>> పలువురు కేంద్రమంత్రులు, ఎన్డీయేపాలిత రాష్ట్రాలముఖ్యమంత్రులు, బిజెపినేతలు హాజరయ్యారు. ఎపినుంచి సీఎం చంద్రబాబు, డిప్యూటిసిఎం పవన్‌కళ్యాణ్‌లతోపాటు ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా పాల్గొన్నారు. ఉదయం ఇంటినుంచి బయలుదేరిన రేఖాగుప్తా హనుమాన్ ఆలయంలో పూజలుచేసారు తర్వాత ఆమె రామ్‌లీలామైదానానికి చేరుకుని అందరినీ పలకరించారు. సుమారు 25వేలమంది భద్రతాసిబ్బంది బందోబస్తుతో ఉన్న రామ్‌లీలామైదాన్‌లో ఆమె ముఖ్యమంత్రిగా ప్రమాణంచేసారు. సుమారు 50వేలమందికిపైగా హాజరయిన అభిమానులు, బిజెపి కేడర్‌లమధ్య గుప్తాసీఎంగాను, పర్వేష్‌సింగ్ వర్మ డిప్యూటిసిఎంగాను ప్రమాణాలుచేసారు. రేఖాతోపాటు బిజెపి ఎమ్మెల్యేలు పర్వేశ్‌వర్మ, ఆశీస్‌సూద్,మజీందర్‌సింగ్ సిర్సా, రవీందర్ ఇంద్రజ్‌సింగ్, కపిల్‌మిశ్రా, పంకజ్‌కుమార్‌లు మంత్రులుగా ప్రమాణంచేసారు. కొత్తసీఎంకు జడ్‌కేటగిరీ సెక్యూరిటీని కేటాయించారు. ఇదిలా ఉండగాప్రమాణస్వీకారంచేసిన తర్వాత రేఖాగుప్తా మాట్లాడుతూ మహిళలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నామన్నారు. మార్చి 8వ తేదీన రూ.2500 నగదును వారి ఖాతాల్లోకి బదలాయిస్తామని చెప్పారు. ఎన్నికల్లోప్రజలకిచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామని అన్నారు. ప్రధానిమోడీ కలలను సాకారంచేయడం అనేది ఢిల్లీలోని 48 మ ంది బిజెపి ఎమ్మెల్యేల బాధ్యత అని అన్నారు. మహిళలకు ఆర్థికంగా సాయం అందించే హామీలన్నీ మేం ఖచ్చితంగానెరవేరుస్తామని, మార్చి 8 నాటికి సొమ్ములు వారి ఖాతాల్లో ఉంటాయని అన్నారు. ఇదిలా ఉంటే ప్రమాణస్వీకారంచేసిన తర్వాత మధ్యాహ్నం 3 గంటలప్రాంతంలో కేంద్ర మంత్రి జెపినడ్డాతోకలిసి సిఎం రేఖాగుప్తా ఢిల్లీ సచివాలయానికి చేరారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు ఎమ్మెల్యేలు ఎంపిలు అధికారులు ఘనస్వాగతం పలికారు. సీఎం ఛాంబర్‌లోకి వెళ్లిన రేఖాగుప్తా ముఖ్యమంత్రిగా బాధ్యతలుచేపట్టారు. ఢిల్లీకి నాలుగో మహిళాసీఎంగాను, రెండో బిజెపి మహిళా ముఖ్యమంత్రిగా ఆమె రికార్డు నెలకొల్పారు. సాయంత్రం ఐదు గంటలకు వాసుదేవ్‌ఘాట్, యమునాబజార్‌ను సీఎం సందర్శించారు. తన మొదటి కేబినెట్ సమావేశం ఢిల్లీలోని సచివాలయంలోనే నిర్వహిస్తారు. ఈమేరకు అధికారులు సీఎం షెడ్యూలును సైతం విడుదలచేసారు.

# రూ.1.08 లక్షల కోట్లు

>>కోసం రూ.880కోట్లు, మహిళా, శిశుసంక్షేమ రంగాల అభివృద్ధి కోసం 3560 కోట్లు, హోం, జాతీయ విపత్తు నిర్వహణ, రక్షణ కార్యక్రమాల అమలుకు 3290 కోట్లు, పర్యాటక, సాంస్కృతిక రంగాల అభివృద్ధి కోసం 1210 కోట్లు, స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి ఈసారి ఏకంగా 10 వేల కోట్ల రూపాయలతో ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తొలిసారిగా వ్యాపారాన్ని, పరిశ్రమలను ప్రారంభించబోయే 5 లక్షలమంది మహిళలకు ఒక్కొక్కరికి రూ.2కోట్ల రూపాయల చొప్పున టర్మ్ రుణాలందించబోతున్నామని, దేశానికి సంబంధించిన బడ్జెట్‌లో ఒక రాష్ట్రం పేరు లేనంత మాత్రాన ఆ రాష్ట్రానికి నిధులివ్వలేదని సరికాదు అన్నారు. కృష్ణా జలాలు వాటాలో తెలంగాణకు అన్యాయం చేసింది కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలే అన్నారు. ఏపితో కుమ్మక్కై తెలంగాణకు అన్యాయం చేసిన మొట్టమొదటి ద్రోహి కెసిఆర్ అన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ చీకటి మిత్రులు అన్నారు. కాళేశ్వరం, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్ కేసు, ఫార్ములా ఈ రేస్ కేసులు ఏమయ్యాయని ప్రశ్నించారు. మాపై కేసులు పెట్టొద్దు కాంగ్రెస్, బిఆర్ఎస్ కలిసి బిజెపిని అడ్డుకుందామని కెసిఆర్ ప్రతిపాదించారు, కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండేందుకే అభ్యర్థులను నిలబెట్టకుండా కెసిఆర్ లోపాయికారీ ఒప్పందం చేసుకున్నారన్నారు. భూపాలపల్లి రాజలింగమూర్తి హత్యపై విచారణ జరిపి నిజాయితీ నిరూపించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. ఒక వ్యక్తిని ప్రాణం తీయడమంటే అంతకంటే దుర్మార్గం ఇంకోటి లేదన్నారు. హతుడి భార్య చేస్తున్న ఆరోపణలపై లోతైన విచారణ జరపాలని, విచారణ కాకముందే ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం సరికాదన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చి, అందులో 10 శాతం ముస్లింలకు కేటాయిస్తే ఏం న్యాయం చేసినట్లు అన్నారు. దీనిపై సిఎం క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కుల గుణన తప్పుల తడకగా ఉందని, జనాభా లెక్కలే తప్పు అన్నారు. 3.95 కోట్ల ఆధార్ కార్డులుంటే, జనాభా 3.7 కోట్లు ఎట్లా ఉంటారు? అన్నారు. మతపరమైన రిజర్వేషన్లకు మేం పూర్తిగా వ్యతిరేకం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై సొంత పార్టీ ఎమ్మెల్యేలే అసంతృప్తితో ఉన్నారని, వాళ్లు రహస్య సమావేశాలు నిర్వహించుకుంటున్నారని బండి సంజయ్ అన్నారు.

# నేడు వికారాబాద్, నారాయణపేటలో సిఎం పర్యటన

>> ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. అనంతరం అప్పక్ పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. నారాయణ పేట మెడికల్ కాలేజీలో అకడమిక్ బ్లాక్ తో పాటు, ఇతర భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు గురుకుల హాస్టల్ ఆవరణలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు.

# బయోా ఆసియా సదస్సు

>> సవాళ్లను ఈ సదస్సులో ప్రత్యేకంగా చర్చిస్తామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, క్వీన్స్‌ల్యాండ్ గవర్నర్ డాక్టర్ జెన్నెట్ యంగ్, జీ 20 షెర్పా అమితాబ్ కాంత్, అమ్జెన్ ఛైర్మన్, సీఈవో రాబర్ట్ ఎ. బ్రాడ్‌వే, జీనోమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సింగపూర్ ఈడీ ప్రొ. పాట్రిక్ టాన్, మెడ్ ట్రానిక్ సీటీవో డా. కెన్ వాషింగ్టన్, మిల్టెని బయోటెక్ ఎండీ డా. బోరిస్ తదితరులు పాల్గొంటారన్నారు. ఈ నెల 25న జరుగబోయే సీఈవో కాన్ క్లేవ్ లో ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ ఎస్. సోమనాథ్, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ఛైర్మన్ సతీష్ రెడ్డి, భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఛైర్మన్, ఎండీ డా. కృష్ణ ఎల్లా, లారస్ ల్యాబ్స్ సీఈవో డా.సత్యనారాయణ చావా, నోవార్టిస్ అప్మా ప్రాంతం చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ సీజర్ కాన్సెప్షన్, లిల్లీ ఇండియా అధ్యక్షుడు, జీఎం విన్సెల్ టక్కర్ తదితరులు పాల్గొంటారని వివరించారు.

# గాంధీభవన్‌లో కంట్రోల్ రూమ్

>> ఓటర్లకు ఒక ఇంచార్జ్ ఉండాలని, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు గ్రామ స్థాయి నుంచి వ్యూహాలు రచించాలని సూచించారు. ఓటర్లకు మన మీద మంచి అభిప్రాయం ఉన్న కూడా వాళ్ళను ఓటు వేయించేలా బాధ్యత తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. మనం చేసిన అభివృద్ధి, సంక్షేమ పనులకు విస్తారంగా ప్రచారం చేయాలని చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇంఛార్జీలు పూర్తి స్థాయిలో ఎన్నికల వ్యూహంతో పని చేయాలని స్పష్టం చేశారు. మొదటి, రెండో ప్రాధాన్యత ఓట్లను కూడా ప్రధాన్యతగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఎలిమినేట్ సిస్టమ్‌లో ఓట్ల లెక్కింపు ఉన్నందున ప్రతి ఓటును చాలా ముక్యంగా తీసుకోవాలని నిర్దేశించారు. ఓటర్ మ్యాపింగ్, ఓటర్లను ప్రత్యేకంగా కలవడం, వాళ్ళను గ్రామ స్థాయి నుంచి బూత్‌కు తీసుకెళ్లడం లాంటి అంశాలు చాలా కీలకం స్పష్టం చేశారు. ఎక్కడ నిర్లక్ష్యం ఉండకూడదని, గాంధీ భవన్ నుంచి కంట్రోల్ రూమ్ పెట్టి నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఏఐసీసీ ఇంచార్జ మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ ఈ ఎమ్మెల్సీ ఎన్నిక చాలా కీలకమైనది, ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. మన సిట్టింగ్ ఎమ్మెల్సీ సీటు మనం గెలుచుకోవాలని చెప్పారు. మనం రాష్ట్రంలో అధికారంలో ఉన్నామని, ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ఇవన్నీ యువకుల్లో బాగా ప్రచారంలోకి తీసుకెళ్లి విజయం సాధించేలా చేయాలని చెప్పారు.

# 8 మంది ఐఎఎస్‌ల బదలీ

>> ఉద్యావన శాఖ డైరెక్టర్‌గా ఉన్న యాస్మిన్ భాషాకు విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. హాకా డైరెక్టర్‌గా ఉన్న కె.చంద్రశేఖర్‌రెడ్డికి తెలంగాణ ఫుడ్స్ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ ఉన్న బి.శ్రీనివాస్‌రెడ్డి టెక్స్‌టైల్స్, హ్యాండ్లూమ్స్ డైరెక్టర్ మాత్ర సంస్థకు బదిలీ అయ్యారు. వనపర్తి అదనపు గా ఉన్న కలెక్టర్ సంచిత్ గంగ్వార్ నారాయణపేట అదనపు కలెక్టర్‌గా బదిలీ అయ్యారు.

# కొండెక్కుతున్న ఇంజినీరింగ్!

>> పెంపును ప్రతిపాదించింది. రాష్ట్రంలోని టాప్ 15 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల ప్రతిపాదనల ప్రకారం.. 5 కాలేజీలు ట్యూషన్ ఫీజును రూ.2 లక్షలకు పైగా ప్రతిపాదించగా.. మిగిలిన సంస్థలు సంవత్సరానికి రూ.1.50 లక్షల కంటే ఎక్కువ ఫీజును ప్రతిపాదించాయి. సుమారు 60 కళాశాలలు రూ.1 లక్ష నుండి రూ.2 లక్షల మధ్య ఫీజును కోరినట్టు తెలిసింది. ప్రస్తుతం 35 కళాశాలలకు మాత్రమే రూ.1 లక్ష మరియు అంతకంటే ఎక్కువ ఫీజును కలిగి ఉన్నాయి. రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకి ట్యూషన్ ఫీజును నిర్ణయిస్తూ 2022-23 విద్యా సంవత్సరంలో ఏఎఫ్ఆర్‌సీ ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించగా.. ప్రభుత్వం 2022-25 మూడు సంవత్సరాల బ్లాక్ పిరియడ్ కాలానికి ఫీజులను నిర్ణయించింది. ఇప్పుడు 2025-26 విద్యా సంవత్సరం నుంచి 2027-28 వరకు కొత్త బ్లాక్ పిరియడ్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల నుంచి ఫీజుల నిర్ధారణ కోసం ఏఎఫ్ఆర్‌సీ ప్రతిపాదనలు కోరింది. కొత్త బ్లాక్ పిరియడ్‌లో ఫీజుల పెంపు ప్రతిపాదన కోసం 157 కళాశాలలు దరఖాస్తు చేసుకున్నాయి. అయితే గత 2022-25 బ్లాక్ పీరియడ్‌లో 176 కాలేజీ దరఖాస్తు చేసుకోగా.. ఈ ఏడాది 19 కాలేజీలు తక్కువగా దరఖాస్తు చేసుకున్నాయి. కాలేజీ యాజమాన్యాలు సమర్పించిన ఆదాయం, వ్యయాల తుది ఆడిట్ స్టేట్‌మెంట్‌లు, బ్యాలెన్స్ షీట్‌లతోపాటు.. గత సంవత్సరాల అభివృద్ధి అవసరాలు, జీతాలు మరియు మౌలిక సదుపాయాలపై చేసిన ఖర్చు వివరాల ఆధారంగా కాలేజీలకు ట్యూషన్ ఫీజులను ఏఎఫ్ఆర్‌సీ ప్రతిపాదించనుంది. కాలేజీలకు ట్యూషన్ ఫీజులను ప్రతిపాదించడం కోసం ఏఎఫ్ఆర్‌సీ ఈ నెల 25 నుంచి ముఖాముఖి సమావేశాలను నిర్వహించనుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను నేడు(శుక్రవారం) జారీ చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. కాలేజీలతో ఏఎఫ్ఆర్‌సీ ముఖాముకి సమావేశాలు ముగిసిన అనంతరం ఆయా కాలేజీలకు ఎంత వరకు ఫీజులను పెంచడానికి అవకాశం ఉంటుందనేది పరిశీలించి ప్రతిపాదనలు చేయనుంది. ఏఎఫ్ఆర్‌సీ ప్రతిపాదించిన ఫీజులను పరిశీలించిన అనంతరం ప్రభుత్వం ఫీజులను నిర్ధారించి ఉత్తర్వులు(జీవో) జారీ చేస్తుంది. కాలేజీలు పెట్టిన ప్రతిపాదనల మేరకు చూస్తే.. వచ్చే ఏడాది నుంచి ఇంజనీరింగ్ ఫీజులు పెరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# ఏఐజి ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించుకున్న మాజీ సిఎం కెసిఆర్

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ గురువారం గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఉదయం కెసిఆర్ తన సతీమణి శోభతో కలిసి ఏఐజీ ఆసుపత్రికి వచ్చి పలు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అనంతరం కెసిఆర్ తిరిగి తన ఇంటికి వెళ్లిపోయారు. ఆసుపత్రికి వచ్చిన కెసిఆర్ ఆరోగ్యంపై పూర్తివివరాలు సేకరించిన ఆసుపత్రి డాక్టర్లు అవసరమైన పరీక్షలు నిర్వహించారు. గత అసెంబ్లీ ఎన్నికల అనంతరం బిఆర్ఎస్ అధినేత తన ఎర్రవెల్లి ఫామ్‌హౌజ్‌లో కాలుజారి పడిపోవడంతో తుంటిఎముక విరిగి గాయ పడిన విషయం తెలిసిందే. ఈ మేరకు తుంటి ఎముక శస్త్రచికిత్స చేయించు కున్న కెసిఆర్ కొన్ని నెలలుగా తన ఫామ్‌హౌజ్‌లోనే విశ్రాంతి తీసుకుం టున్నారు. బిఆర్ఎస్ పార్టీ కార్యాకలాపాలపై ఫామ్‌హౌజ్ నుంచే పర్య వేక్షించడంతోపాటు ఫామ్‌హౌజ్ కేంద్రంగా పార్టీ నేతలతో సమావే శమవుతున్నారు. కాగా కొన్నినెలల అనంతరం ఫామ్‌హౌజ్ నుంచి బయటకు వచ్చిన కెసిఆర్ బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ 25 వసంతాల వేడుకలో పాల్గొని కార్యకర్తలతో సమావేశమయ్యారు. కాగా గురువారం కెసిఆర్ ఏఐజీ ఆసుపత్రికి వెళ్లినట్లు తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందగా, సాధారణ వైద్య పరీక్షల కోసమే కెసిఆర్ ఏఐజీ ఆసుపత్రికి వెళ్లినట్లు బిఆర్ఎస్ వర్గాలు ప్రకటించాయి. కాగా తన మనవడు, మాజీమంత్రి కెటిఆర్ కుమారుడు హిమాన్షును చూసేందుకు కెసిఆర్ త్వరలో విదేశాలకు వెళ్లనున్నారని, అందులో భాగంగానే తన ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ముందు జాగ్రత్త కోసం ఏఐజీ ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించుకున్నారని సమాచారం అందుతుంది. ఇందులో భాగంగానే కెసిఆర్ తన పాస్‌పోర్టు రిన్యూవల్ కోసం బుధవారం సికిందరాబాద్ పాస్‌పోర్టు కార్యాలయాన్ని సందర్శించారని అంటున్నారు. గురువారం వైద్య పరీక్షల అనంతరం కెసిఆర్ తన కుటుంబసభ్యులతో కలిసి నందిహిల్స్‌లోని తన నివాసానికి వెళ్లారు.

# ఎన్నికల్లో ఓడిపోతే నా పరిస్థితి ఘోరంగా మారేది!

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** అధ్యక్ష న్నికల్లో ఓటమి పాలయి ఉంటే తన జీవితం మరింత దారు ణంగా ఉండేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ అన్నారు. గత ప్రభుత్వం తనతో అత్యంత దారుణంగా వ్యవహరించిందని ఆరోపించారు. మియామిలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోయి ఉంటే తన జీవితం చాలాఘోరంగా మారిపోయేదని అన్నారు. న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొంటూ జీవితంగడిసపే పరిస్థితి వచ్చుండేదన్నారు. అధ్యక్షుడుగా ఎన్నికైనందుకు సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల్లో ఓటమి పాలయితే తర్వాత పోటీచేసేందుకు చాలా ధైర్యం అవసరం అయ్యేదన్నారు. గత ప్రభుత్వం తనపై అత్యంత దారుణంగా ప్రవర్తించిందంటూ ఆరోపించారు. 2024లో అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రాట్ అభ్యర్థి కమలా హ్యారిస్‌పై ట్రంప్ ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికలకు ముందు ట్రంప్ పోర్న్‌స్టార్‌కు హష్‌మనీ కేసుతో సహా పలు క్రిమినల్, సివిల్‌కేసులు ఎదుర్కొన్నారు. అధ్యక్షుడుగా ఎన్నికైన అనంతరం ఆయనపై ఉన్న రెండు ఫెడరల్‌కేసులనుంచి ఊరట లభించింది. హష్‌మనీకేసులో న్యూయార్క్ న్యాయమూర్తి షరతులులేని డిశ్చార్జిని వర్తింపచేసారు.

# అంగన్‌వాడీ సరకుల నాణ్యతను తనిఖీ చేయండి

## అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** అంగన్‌వాడీలకు సరఫరా అవుతున్న సరుకుల నాణ్యతపై ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించాలని మహిళా శిశు సంక్షేమ, పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. అంగన్వాడీలకు అందే సరుకుల నాణ్యతపై రాజీ పడోద్దని స్పష్టం చేసిన మంత్రి సీతక్క సరైన సరుకులు సరఫరా చేయక పోతే వాటిని సరఫరా చేసేవారిని బ్లాక్ లిస్ట్‌లో పెడతామని హెచ్చరించారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు అప్రమత్తమైన అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిచేందుకు ప్రణాళికలను సిద్దం చేసుకుంటున్నారు.

## విహారయాత్రలో విషాదం

# ఈత కొట్టడానికి తుంగభద్ర నదిలో దూకి హైదరాబాద్ మహిళా డాక్టర్ మృతి



డాక్టర్ అనన్యరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** విహారయాత్ర విషాదంగా మారింది. సరదాగా స్నేహితులో కలసి విహార యాత్రకు వెళ్లిన హైదరాబాద్‌కు చెందిన యువవైద్యురాలు తుంగభద్ర నదిలో ఈత కొట్టాలని నదిలో దూకడంతో కొట్టుకుపోయారు. నదిలో నుంచి రెస్క్యూ టీమ్ ఆమె మృతదేహాన్ని బయ టకు తీశారు. కర్ణాటకలోని హంపిలో ఈ ఘటన చోటు చేసుకుంది. కర్ణాటక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ అనన్యరావు(27), మరో ఇద్దరు స్నేహితులు సాత్విన్, హాషితలతో కలిసి హంపీ టూర్‌కి వచ్చారని, స్మారకాలను వీక్షించి మంగళవారం రాత్రి సణాపురలోని ఓ అతిథి గృహంలో బస చేశారని తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఈత కొట్టడానికి తుంగభద్ర నది వద్దకు వెళ్లారని, అనంతరం, 25 అడుగుల ఎత్తుగల బండరాయి నుంచి అనన్యరావు నీటిలో దూకి ఈత కొట్టాలనుకున్నారని, ఎత్తు నుంచి కిందకు దూకిన అనన్య..కాసేపు స్విమ్మింగ్ చేశారు. అయితే కొద్దిసేపటికే మరోవైపు నుంచి అలలు రావడంతో నీటి ప్రవాహంలో ఆమె కొట్టుకుపోయారు. ఈ విషయాన్ని గుర్తించిన స్నేహితులు ఆమెను కాపాడేందుకు తీవ్రంగా ప్రయ త్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న గంగావతి గ్రామీణ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. స్థానిక గజ ఈతగాళ్లు, అగ్ని మాపకదళం సాయంత్రం వరకు ప్రయత్నించినా ఆమె జాడ కనిపించలేదు. గురువారం ఉదయం గజఈతగాళ్ల అనన్యరావు మృతదేహాన్ని బయటకు తీశారు. దీంతో, అనన్య కుటుంబ సభ్యులు, స్నేహితులు బోరున విలపించారు. సరదాగా స్నేహితులతో కలిసి ట్రిప్‌కు వెళ్లిన తమ కుమార్తె విగతజీవిగా రావడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

# ఇప్పటివరకు సర్వేలో పాల్గొన్న మొత్తం 4,625 కుటుంబాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి 20:** ఈ నెల 16వ తేదీ నుంచి.. సామాజిక ఆర్థిక విద్య ఉద్యోగ రాజకీయ కుల గణన సర్వేలో మిగిలిపోయిన ఇంటింటి సర్వేకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇప్పటి వరకు మొత్తం 4,625 కుటుంబాలు సర్వేలో తమ వివరాల నమోదు చేసుకున్నాయి. ఇప్పటి వరకు టోల్ ఫ్రీ నెంబర్ 040-2111111కు వచ్చిన మొత్తం కాల్స్: 6,415, ప్రజా పాలన సేవా కేంద్రాల్లో నమోదు చేసుకున్న సర్వే ఫారాలు: 4,227,వెబ్ సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్న సర్వే ఫారాలు: 398,ఎన్యుమరేషన్ పూర్తయిన గృహాలు: 2,254 సామాజిక ఆర్థిక విద్య ఉద్యోగ రాజకీయ కులగణన సర్వేలో మిగిలిపోయిన ఇంటింటి సర్వే ఇంకా కొనసాగుతోంది. మిగిలిపోయిన సర్వే ఈనెల 28 వరకు కొనసాగనుంది.

# మంత్రులపైనా క్రిమినల్ కేసులు

## ఇద్దరు ఢిల్లీ మంత్రులు బిలియనీర్లు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** దేశరాజధాని ఢిల్లీలో కొత్త సీఎంగా బాధ్యతలుచేపట్టిన రేఖాగుప్తా కేబినెట్ మంత్రులపై తీవ్రస్థాయి క్రిమినల్‌కేసులు కూడా ఉన్నాయి. మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసినవారిపై క్రిమినల్‌కేసులు నమోదయి ఉన్నాయి. మంత్రి ఆశిష్‌సూద్‌పై తీవ్రమైన నేరారోపణలున్నట్లు ప్రజాస్వామ్య సంస్కరణల వేదిక (ఎడిఆర్) ప్రకటించింది. ఎన్నికల్లో వారిచ్చిన అఫిడవిట్ల ఆధారంగానే వీటిని ప్రకటించింది. షాలిమార్‌బాగ్‌నుంచి తొలిసారి బిజెపి ఎమ్మెల్యే అయిన రేఖ గుప్తా ఢిల్లీ 9వ సీఎంగా గురువారంబాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. కేబినెట్‌మంత్రుల్లో ఇద్దరు బిలియనీర్లు ఉన్నారు. రాజౌరి గార్డెన్‌నియోజకవర్గంనుంచి బిజెపి ఎమ్మెల్యే మంజీందర్‌సింగ్ సిర్సాకు 248.85 కోట్ల ఆస్తులున్నాయి. కరావాల్ నగర్‌నియోజకవర్గానికి చెందిన మంత్రి కపిల్‌మిశ్రా అతితక్కువగా 1.06 కోట్లఆస్తులున్నట్లుప్రకటించారు. ఏడుగురు మంత్రుల సగటు ఆస్తులు రూ.56.03 కోట్లుగా ఉంది. న్యూఢిల్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే డిప్యూటీ సీఎం తనకు అత్యధికంగా రూ.74.36 కోట్ల అప్పులున్నట్లు చెప్పారు. ఏడుగురు మంత్రుల్లో ఆరుగురు గ్రాడ్యుయేట్ లేదా అంతకంటే ఎక్కువస్థాయి విద్యార్హతలున్నవారు అయితేఒక మంత్రి మాత్రం 12వ తరగతి మాత్రమే పూర్తిచేసారు.

# కలుషితాహారంతో 28 మంది విద్యార్థులకు అస్వస్థత

## మూడు రోజులుగా వర్సిటీలోనే చికిత్స

## యాజమాన్యంపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఫైర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లోనీ ఎన్ఎంఐఎంఎస్ యూనివర్సి టీలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయిన సంఘటన చోటుచేసుకున్నది. పోలేపల్లి సెజ్‌లోనీ ఎస్‌వీకేఎం ఎన్ఎంఐఎంఎస్ యూనివర్సిటీలో కలుషిత, నాణ్యతలేని ఆహారం తీసుకోవడం వల్ల సుమారు 28మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు, విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయ్యి మూడు రోజులు కావడంతో సమాచారం బయటకు రాకుండా చర్యలు తీసుకున్నారు. యూనివర్సిటీలోనే బెడ్లపై, మంచాలు వేసి సెలైన్లు పెట్టి చికిత్స అందిస్తూ వచ్చారు. విషయం బయటకు వస్తే తమ యూనివర్సిటీకి చెడ్డపేరు వస్తుందని గుట్టుగా చికిత్స అందించారు. ఎన్ఎంఐఎంఎస్ యూనివర్సిటీలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ విషయం తెలుసుకున్న జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి హుటాహుటీగా యూనివర్సిటీని సందర్శించారు. యూనివర్సిటీ యాజమాన్యానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఏమైనా జరగితే ఎవరు బాధ్యత వహిస్తారంటూ ఫైర్ అయ్యారు. ఫుడ్ పాయిజన్ అయిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని యూనివర్సిటీ యాజమాన్యానికి సూచించారు. యాజమాన్యం నిర్లక్ష్యానికి తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ ఘటనపై మాజీ మంత్రి లక్ష్మారెడ్డి స్పందించారు. విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. యూనివర్సిటీలోనే ఆహారం కల్తీ జరగడం విద్యార్థులు అస్వస్థకు గురికావడం బాధాకరమన్నారు. యాజమాన్యం మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

# అమృత తుల్యమైన మన తెలుగును కాపాడుకుందాం

## అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మనం తల్లి గర్భంలో ఉన్నప్పటి నుంచే మనకు అలవడే భాష మాతృభాష, ఇదే మన అస్తిత్వం, ఇదే మన సంస్కృతి, సంప్రదాయాలకు మూలం అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. భాష, సంస్కృతులకు అవినాభావ సంబంధముందని, భాష మన సంస్కృతికి జీవనాడి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఉన్నతమైన సంస్కృతి, ఉన్నతమైన సమాజానికి బాటలు వేస్తుందన్నారు. భారతదేశపు భాషా వైవిధ్యతే, మన గొప్ప నాగరికతకు పునాది. మన ఆటలు, మాటలు, పాటలు, సంగీతం, కళలు, పండుగలు, పబ్బాలు, వ్యాపార సంబంధాలు భాష లేకుండా పెంపొందలేవు అన్నారు. వీటన్నింటినీ కాపాడుకుని భవిష్యత్ తరాలకు అనుగుణంగా పరిస్థితులు కల్పించాలంటే మన మాతృభాషను మనం కాపాడుకోవాలని అన్నారు. మన దైనందిన జీవితంలో మాతృభాష వినియోగం పెరగాలన్నారు. మన మాతృభాష అయిన తెలుగు ప్రాశస్తం గురించి ఎంత చెప్పినా తక్కువే. మన భాష చాలా గొప్పది. ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. దేశభాషలందు తెలుగు లెస్స అని కృష్ణ దేవరాయలు అన్నా, ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్‌గా ప్రశంసలందుకున్నా విశ్వనాథ సత్యనారాయణ అమర భాష అని కీర్తించినా సినారె, శ్రీశ్రీ వంటి ప్రముఖులెందరో తమ జీవిత సర్వస్వం తెలుగే అని ఎలుగెత్తి చాటినా తమిళ కవి సుబ్రమణ్య భారతి, తెలుగు వంటి సుందరమైన భాష మరొకటి లేదని పొగడినా, నికోలో కోంటీ, అబ్దుల్ అల్ హాసన్ బహమనీ వంటి విదేశీయులు, తెలుగును స్వర్గపు భాషగా పేర్కొన్నా ఇదంతా తెలుగు భాష గొప్పదనమే అన్నారు. ఎన్నో యాసలు, మరెన్నో మాండలికాలు. ఒక్కో దాంట్లో, ఒక్కో అందమైన భావన అన్నారు. ఇవేవీ ఇతర భాషల్లో అంతగా కనిపించవు అన్నారు. అవధానం వంటి అద్భుతమైన ప్రక్రియ ఒక్క తెలుగు భాషకే సాధ్యం అన్నారు. ఇదీ మన తెలుగుభాష గొప్పదనం. అందుకే మన అమృతపు భాషను కాపాడుకోవడానికి మనమంతా పునరంకితం అవుదామని కేంద్ర మంత్రి అన్నారు.

# న్యాయం గెలిచిందంటూ బిజెపి నేతల సంబురాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** బిజెపి మాజీ అధ్యక్షులు, ప్రస్తుత కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌పై 2021 నవంబర్ నెలలో బిఆర్ఎస్ నేతలు తప్పుడు ఆరోపణలతోపాటు అసభ్యమైన వ్యాఖ్యలు చేయడం, బిఆర్ఎస్ నాయకుల తీరును నిరసిస్తూ బిజెపి నాయకులు జూబ్లీహిల్స్‌లో శాంతియుతంగా నిరసన తెలిపారు. ఈ క్రమంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రాజకీయ కక్షతో బిజెపి నేతలపై కేసులు నమోదు చేసిందని బిజెపి నేతలు ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపిన బిజెపి నాయకులు, కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేసి, జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసులు పెట్టారు. ఈ కేసులో బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్, లంకల దీపక్‌రెడ్డి, రాహుల్ చంద్ర, ప్రేమ్‌కుమార్, చంద్రమోహన్, స్వామి, చంద్రశేఖర్ తదితరులపై కేసులు నమోదు చేసింది. అయితే మూడేళ్ల న్యాయపోరాటం చేసిన అనంతరం, నాంపల్లి కోర్టు గురువారం రోజు బిజెపి నాయకులపై ఉన్న అన్ని ఆరోపణలను కొట్టివేస్తూ, వారిని నిర్దోషులుగా ప్రకటించింది. గత కెసిఆర్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కేలా చేసిన కుట్రలను బహిర్గతం చేసేలా కోర్టులో బిజెపి తరఫున కరుణ సాగర్ వాదోపవాదనలు వినిపించారని బిజెపి నేతలు పేర్కొన్నారు. ఈ తీర్పుతో బిఆర్ఎస్ ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి ప్రతి పక్ష నేతలను ఎలా వేధించిందో ఇప్పుడు మరోసారి బహిర్గతమైందని అన్నారు. భారతీయ జనతా పార్టీ ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు, బిఆర్ఎస్ హయాంలో జరిగిన అక్రమ అరెస్టులు, నిరసన హక్కులను హరించిన ఘటనలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు అహర్నిశలు కృషి చేస్తుందని బిజెపి నాయకులు తెలిపారు.

# లింగమూర్తి హత్య కేసులో పోలీసుల అదుపులో ముగ్గురు

## పరారీలో ఉన్న ఇద్దరి కోసం గాలింపు

**భూపాలపల్లి క్రైమ్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన తాజా మాజీ కౌన్సిలర్ భర్త హత్య అనేక అనుమానాలకు తావిస్తోంది. అతని హత్య రాజకీయ కక్షలేక భూతగదాల కారణమా అనే చర్చ జోరుగా సాగుతోంది. మొత్తంగా హత్యకు కారకులైన ముగ్గురి వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. హత్యలో భాగమైన మరో ఇద్దరూ ఆచూకీ కోసం పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపడుతున్నట్లు తెలిసింది. రాజలింగమూర్తి జిల్లా కేంద్రం నడిబొడ్డున హత్యకు గురి కావడం సంచలనంగా మారింది. తన భర్త హత్య వెనుక బీఆర్ఎస్ నాయకుల ప్రమేయమన్నట్లు హతుని భార్య సరళ ఆరోపిస్తున్నారు. దరిమిలా ఇప్పుడీ ఘటన రాజకీయంగానూ ప్రకంపనలు రేపుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మండిపడ్డ మంత్రి కోమటిరెడ్డి గాంధీ భవన్ లో గురువారం మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి రాజలింగమూర్తి హత్యకు దారి తీసిన పరిస్థితులపై, పరిణామాలపై సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆరా తీస్తున్నారు. ఇందులో భాగంగానే ఇంటలిజెన్స్ వర్గాల నుంచి సమాచార సేకరణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ హత్యపై గురువారం కీలక వ్యాఖ్యలు చేశారు. గాంధీ భవన్ లో మంత్రి మీడియాతో మాట్లాడుతూ, రాజలింగమూర్తి హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని, కోర్టుల్లో కేసులు వేస్తే న్యాయపరంగా కొట్లాడాలేగాని, చంపేస్తారా? అని ప్రశ్నించారు. అంతేకాదు భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి రాజలింగమూర్తిని చంపించినట్లు మృతుని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారని ఆయన అన్నారు. హత్యతో సంబంధం లేదన్నా మాజీ ఎమ్మెల్యే.. రాజలింగమూర్తి హత్యతో తనకెటువంటి సంబంధం లేదని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి అన్నారు. ఈ హత్యను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని, రాజలింగమూర్తి హత్యపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఘటనపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యలు బాధాకరమని, హత్య కేసును ప్రభావితం చేసే యోచన కనిపిస్తోందని వెంకట రమణారెడ్డి అన్నారు. స్థానిక పోలీసు అధికారులకు ఈ హత్యపై వాస్తవాలు తెలుసని, హతుడు లిటిగెంట్ వ్యక్తిగా గండ్ర వెంకట రమణారెడ్డి పేర్కొన్నారు. సిబిసిఐడితో విచారణ జరిపించాలి..ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు.. భూపాలపల్లి హత్య కేసు విచారణ సిబిసిఐడికి అప్పగించాలని ఇంతటివారైనా వదిలిపెట్టిదీ లేదని రాజా దీనిపై సీఎం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పేర్కొన్నారు.

# కాంగ్రెస్ ఎంపిపై క్రికెట్ బ్యాట్‌తో దాడి



**గువాహతి, ఫిబ్రవరి 20:** రాష్ట్రంలోని నాగాంవ్ జిల్లాలో కాంగ్రెస్‌ఎంపి రకీబుల్ హుస్సేన్‌పై గుర్తుతెలీని దుండగులు క్రికెట్‌బాట్‌తో దాడిచేసారు. ధుబ్రి లోక్‌సభ నియోజకవర్గంనుంచి హుస్సేన్ ఎంపిగా ఉన్నారు. అయితే ఎలాంటిప్రాణహానిలేకుండా ఆయన వ్యక్తిగత భద్రత సిబ్బంది ఆయన్ను రక్షించారు. రూపాహిహాత్‌లోని నాతున్‌బజార్‌లో ఈసంఘటన జరిగింది. ద్విచక్రవాహనంపై పార్టీకార్యకర్తల సమావేశానికి వెళుతున్న ఎంపిపై ఈ దాడులుచేసారు. ఆగంతకుల్లో ఒకరిచేతిలో ఉన్న క్రికెట్ బ్యాట్‌తో హుస్సేన్‌పై దాడిచేసినట్లు తెలుస్తోంది. మిగిలినవారు నల్లటి గుడ్డలను ముఖానికి కప్పుకుని కప్పుకుని ఉండటంతో వారు ఎవరైందన్నది తెలియరాలేదు. ఎంపికి నియమించిన పిఎస్ఒలు గాలిలోకి కాల్పులుజరపడంతో దుండగులు పరారయ్యారు. అయితే ఈ దాడికి గల కారణాలుమాత్రం తెలియరాలేదు. కాంగ్రెస్ పార్టీ ఈ సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని, భద్రతా వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించింది. అస్సాం అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు కాంగ్రెస్ ఎమ్మెల్యే దేబబ్రత సైకియా మాట్లాడుతూ ముఖ్య మంత్రి రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిస్తాయిలో అమలవు తున్నాయని చెపుతున్నారని, సాక్షాత్తూ ఎన్నికైన ఎంపికే రాష్ట్రంలో భద్రత కొరవడిందని ఆరోపించారు. అసోం డిజిపి హార్మీత్‌సింగ్ మాట్లా డుతూ ఎంపి హుస్సేన్ సురక్షితంగా ఉన్నారని, ఒక అల్లరి గుంపు ఆయనపై దాడిచేసిందని ఆయన వ్యక్తిగత భద్రతాసిబ్బంది ధుబ్రి లోక్‌సభ నియోజకవర్గంనుంచి సుమారు పదిలక్షల ఓట్ల ఆధిక్యంతో హుస్సేన్ గెలుపొందారు. ఆయన కుమారుడు సంమాగురి అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికలో పోటీచేసారు. హుస్సేన్ ఇదే నియోజకవర్గంనుంచి ఐదుసార్లు గెలిచారు. చివరిలో బిజెపి అభ్యర్థి డిప్లూ రంజన్‌శర్మచేతిలో ఓటమి చవిచూసారు. నియోజకవర్గం లోను, పరిసరాల్లోను ఈ సంఘటనతో భారీ ఎత్తున ఉద్రిక్తతలు చెలరేగాయి.

# నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో రిజర్వే షన్లపై మాట్లాడిన కేసులో కోర్టుకు రేవంత్‌రెడ్డి కోర్టుకు హాజర య్యారు. ఎన్నికల ప్రచార సమయంలో రేవంత్‌రెడ్డిపై బేగంబజార్ పీఎస్‌లో, నల్గొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో, మెదక్ జిల్లా కౌడిపల్లి పీఎస్ పరిధిలో మొత్తం 3 కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల విచారణ నిమిత్తం ఆయన కోర్టుకు హాజరయ్యారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ ప్రభు త్వం ఉద్దేశపూర్వకంగా కేసులు నమోదు చేసిందని టీపీసీసీ లీగల్‌సెల్ వైస్‌చైర్మన్ తిరుపతి వర్మ అన్నారు. తదుపరి విచారణను ప్రజాప్రతినిధుల కోర్టు వచ్చే నెల 23కి వాయిదా వేసింది.

# గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

## 300 కిలోల సరకు, కంటైనర్ వ్యాను స్వాధీనం

**హైదరాబాద్ (అబ్దుల్లాపూర్‌మెట్), ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** డ్రగ్స్ విక్రేతను పట్టు కున్న ఎస్ఓటీ, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు నిందితుడి నుంచి 300 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్ర పూణెకి చెందిన అహ్మద్ గులాబ్ షేక్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. విలాసాలకు అలవాటు పడిన నిందితుడు సులు వుగా డబ్బు సంపాదించేందుకు గంజాయి రవాణా మార్గాన్ని ఎంచుకున్నాడు. ఈ క్రమంలో అరకు నుంచి మహారాష్ట్రకు డిసిఎం కంటైనర్ వ్యానులో స్క్రాప్ మధ్యలో గంజాయిని తరలిస్తుండగా... విశ్వ సనీయ సమాచారం మేరకు మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు అబ్దుల్లా పూర్‌మెట్ పోలీసుల సహకారంతో రామోజీ ఫిల్మ్‌సిటీ వద్ద డీసీఎం కంటైనర్ వాహనాన్ని(ఎంహెచ్ 16 సీడీ 2076)పట్టుకుని తనిఖీ చేసి గంజాయిను గుర్తించారు. విశాఖపట్నం నుంచి గంజాయిని మహారాష్ట్రకు తర లించి అక్కడ వైభవ్, దేవలకు అందించేవాడని, వారు స్థానికంగా గంజాయిని విక్రయిస్తారని పోలీసులు తెలిపారు. ఈమేరకు అహ్మద్ గులాబ్‌షేక్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.


తెలంగాణ ప్రభుత్వం
(ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్‌లు)
ప్రకటన

హైదరాబాద్, నాచారం వద్ద పున్న సనత్‌నగర్, ESI హాస్పిటల్ నం. 5467/ESIH/SNR(NCHRM) రిఫరల్/2025 తేదీ: 18.02.2025. 1) కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ/PSU/పబ్లిక్ సెక్టార్ ఆసుపత్రులు 2) PM JAY జాబితాలోవున్న కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ/PSU/పబ్లిక్ సెక్టార్ ఆసుపత్రులు. 3) CGHs జాబితా ఆసుపత్రులు/సంస్థలు సవరించబడిన రిఫరల్ పాలసీ యొక్క (17.1) పాయింట్ ప్రకారం హైదరాబాద్, నాచారం వద్ద వున్న సనత్‌నగర్, ESI ఆసుపత్రి యొక్క ESI లబ్ధిదారులకు సెకండరీ మెడికల్ మరియు హెల్త్ కేర్ సర్వీస్‌లు అందించడానికి, CGHS లేదా రాష్ట్ర ప్రభుత్వం లేదా 15% డిస్కౌంట్‌తో సహా హాస్పిటల్ రేట్ ఏది తక్కువ వర్తించబడుతుందో ఆ ప్రాతిపదికన దరఖాస్తులు కోరబడుతున్నవి. దరఖాస్తులు ఈ కార్యాలయానికి 10.03.2025న లేదా ముందు (సమయం-సా.5.00గం.) అందచేయవలెను. చిరునామా: మెడికల్ సూపరింటెండెంట్ యొక్క కార్యాలయం ESI హాస్పిటల్, సనత్‌నగర్, నాచారం వద్ద పున్నది. హైదరాబాద్, తెలంగాణ-500076. మెయిల్ చిరునామా : superesi63@gmail.com
DIPR.NO. 10449-PP/CL/ADVT/1/2024-25 తేదీ: 20.02.2025 సం/-. మెడికల్ సూపరింటెండెంట్.

శ్రీ హనుమాన్ దేవస్థానం, అమీర్‌పేట్, హైదరాబాద్
దేవాదాయ - ధర్మాదాయ శాఖ
సీల్డ్ టెండర్ / ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా శ్రీ హనుమాన్ దేవస్థానము, అమీర్‌పేట్, హైదరాబాద్ నందు (1) విద్యుత్ అలంకరణ (2) పూల అలంకరణ (3) సెక్యూరిటీ సర్వీసెస్ (4) ప్రొవిజన్స్ సప్లయ్ చేయుటకుగాను ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరడమైనది. మరియు ప్రింటింగ్, దేవుళ్ల స్టాండ్స్, కొబ్బరి చిప్పలు కొరకు సీల్డ్ టెండర్లు నిర్వహించబడును. 1 నుండి 4 వరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వివరములకు http://tender.telangana.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు. షెడ్యూల్ జారీచేయు తేది: 20.02.2025. కొటేషన్స్ సమర్పించు చివరి తేది : 03.03.2025. మ.12.00గం.లలోపు కొటేషన్స్ విప్పు తేది: 03.03.2025 మ.1.00గం.లకు. మిగతా వివరములకు దేవస్థాన కార్యాలయమునందు సంప్రదించగలరు.
సం/-. కార్యనిర్వహణాధికారి, శ్రీహనుమాన్ దేవస్థానము, అమీర్‌పేట్, హైదరాబాద్.
DIPR.NO. 10455-PP/CL/ADVT/1/2024-25 తేదీ: 20.02.2025

ఫారం నం. URC-2
చట్టం యొక్క ఛాప్టర్ XXI యొక్క పార్ట్ I క్రింద రిజిస్ట్రేషన్ గురించి నోటీస్ ఇస్తూ ప్రకటన
(2014, నిబంధనలు (రిజిస్టర్‌కు అధీకృతమైనది) కంపెనీల యొక్క నిబంధన 4(1) మరియు 2013, కంపెనీల చట్టం యొక్క సెక్షన్ 374(b)కు అనుసరిస్తూ)

1. 2013, కంపెనీల చట్టం యొక్క సెక్షన్ 366 యొక్క ఉప-సెక్షన్ (2) అనుసరిస్తూ ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా M/s. సన్‌షైన్ ఏజెన్సీస్ (ఇండియా) LLP, ఒక లిమిటెడ్ లయబిలిటీ భాగస్వామ్య సంస్థ, 2013 కంపెనీల చట్టం యొక్క ఛాప్టర్ XXI యొక్క పార్ట్ I క్రింద, షేర్స్‌చే ఒక లిమిటెడ్ కంపెనీ సన్‌షైన్ ఏజెన్సీస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌గా రిజిస్టర్డ్ చేయవచ్చునని రిజిస్ట్రార్, 2వ అంతస్తు వద్ద, కార్పొరేట్ భవన్, GSI పోస్ట్, నాగోల్, బండ్లగూడ, హైదరాబాద్, తెలంగాణ వారికి ఇకపై నుండి 30 రోజుల గడువు ముగింపు ముందుగా, కాని ఇక నుండి పదిహేను రోజులు తర్వాత వేయడానికి ఒక దరఖాస్తును ప్రతిపాదన చేసినట్టు ప్రకటించడమైనది.
2. కంపెనీ యొక్క ప్రధానమైన లక్ష్యాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.
"ఏజెంట్‌లుగా వ్యాపారం నిర్వర్తించడానికి, ఫ్యాక్టర్, కమిషన్ ఏజెంట్‌లు, కొనడం మరియు అమ్మే ఏజెంట్‌లు, పంపిణీదారులు, లేదా ఏ రకమైన ఏజెంట్‌లు, లేదా వివరణ మరియు అమ్మకానికి, పంపిణీ, ఎగుమతి మరియు దిగుమతి, ఉత్పత్తిదారుల ప్రతినిధిగా వ్యవహరించడానికి, అన్ని రకాల పెయింట్స్ మరియు హార్డ్‌వేర్ వస్తువుల డీల్, మరియు పరస్పరం ఇద్దరికీ ఆమోదయోగ్యమైన ఏ ఇతర వ్యాపారమైనా".
3. ప్రతిపాదిత కంపెనీ యొక్క అసోసియేషన్ యొక్క ఆర్టికల్స్ మరియు డ్రాఫ్ట్ మెమొరాండం యొక్క కాపీని రిజిస్టర్డ్ కార్యాలయం 10-11-70/G/8, G. P. కాంప్లెక్స్, శివాలయం రోడ్, ఫతేనగర్, ఫతేనగర్ కాలనీ, కె.వి.రంగారెడ్డి, బాలానగర్, హైదరాబాద్-500018, తెలంగాణ, ఇండియా వద్ద తనిఖీ చేసుకొనవచ్చును.
4. ఈ ప్రకటనలో ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా ఈ దరఖాస్తుకు ఏ వ్యక్తి అయినా అభ్యంతరం తెలియచేసే వారు ఎవరైనా వారి అభ్యంతరాన్ని రాతపూర్వకంగా ఈ నోటీస్ యొక్క ప్రచురణ తేదీ నుండి ఇరవై ఒక్క రోజులలో రిజిస్ట్రార్ వారికి సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్ (CRC), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ ఎఫైర్స్ (IICA), ప్లాట్ నం. 6,7,8 సెక్టార్ 5, IMT మనేసార్, గుర్‌గావ్ జిల్లా, (హర్యానా) పిన్ కోడ్-122050 చిరునామాకు, కంపెనీకి దాని రిజిస్టర్డ్ కార్యాలయం వద్ద ఒక కాపీతో కమ్యూనికేట్ చేయవచ్చును.

దరఖాస్తుదారుని యొక్క పేరు(లు)
1. సునీల్ సైనీ
2. మోనికా సైనీ
తేదీ 20వ ఫిబ్రవరి, 2025

राष्ट्रीय परीक्षा एजेंसी
National Testing Agency
Excellence in Assessment
IIM BODH GAYA
IIM JAMMU
(उच्चतर शिक्षा विभाग, शिक्षा मंत्रालय, भारत सरकार के तहत एक स्वायत्त संगठन)
(An Autonomous Organization under the Department of Higher Education, Ministry of Education, Government of India)

2025 మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్‌లో, జాయింట్ ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం కొరకు
ఆన్‌లైన్ దరఖాస్తుల ఫారం

ది నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) 2025-26 విద్యా సంవత్సరం కొరకు IIM బోధ్‌గయ మరియు IIM జమ్ము వద్ద 5-సంవత్సర ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ ప్రవేశం కొరకు JIPMAT 2025 క్రింది వివరాల ప్రకారం నిర్వహిస్తోంది.

| | |
|---|---|
| ఆన్‌లైన్ దరఖాస్తుల ఫారం యొక్క దాఖలు | 11వ ఫిబ్రవరి, 2025 నుండి 10వ మార్చి, 2025కు (మ.11.50 గం. వరకు) |
| ఆన్‌లైన్ దరఖాస్తుల యొక్క ఫీజు దాఖలు | 11వ ఫిబ్రవరి, 2025 నుండి 11వ మార్చి, 2025కు (మ.11.50 గం. వరకు) |
| ప్రత్యేక వివరాలలో కరెక్షన్ | 13వ మార్చి, 2025 నుండి 15వ మార్చి 2025కు |
| పరీక్ష యొక్క తేదీ | 26వ ఏప్రిల్, 2025 (శనివారం) |
| పరీక్ష యొక్క సమయం | మ.03.00 గం. నుండి సా.05.30 గం.కు |
| పరీక్షా విధానం | కంప్యూటర్ బేస్ట్ టెస్ట్ (CBT) |
| పేపర్ రకం | మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలు |

స్కీమ్/వ్యవధి/మీడియం/పరీక్ష యొక్క సిలబస్, అర్హతా ప్రమాణం, తాత్కాలికంగా ఇన్‌టేక్, సీట్ల రిజర్వేషన్, పరీక్షా నగరాలు, ముఖ్యమైన తేదీలు వగైరాలు https://exams.nta.ac.in/JIPMAT/ పై ఉంచిన సమాచార బులెటిన్‌లో పేర్కొనబడ్డాయి. పరీక్షలో హాజరు కావటానికి ఆసక్తి గల అభ్యర్థులు, JIPMAT 2025 కొరకు సవివర సమాచార బులెటిన్ చదవవచ్చు మరియు https://exams.nta.ac.in/JIPMAT/ వద్ద ఆన్‌లైన్ మాత్రమే దరఖాస్తు చేయాలి. పరీక్ష ఫీజు SBI & HDFC బ్యాంక్ చెల్లింపు గేట్‌వేను ఉపయోగించి నెట్ బ్యాంకింగ్/డెబిట్ కార్డ్/క్రెడిట్ కార్డ్/UPI ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించవలసి ఉంది. సంబంధిత IIMs యొక్క అర్హతా ప్రమాణాన్ని దరఖాస్తుదారులు చెక్ చేసుకోవాలి. అభ్యర్థులు NTA వెబ్‌సైట్ https://exams.nta.ac.in/JIPMAT/ తో టచ్‌లో ఉండవలసినదిగా సూచించడమైనది. అభ్యర్థులు jipmat@nta.ac.in వద్ద NTAకు రాయవచ్చును లేదా 011-40759000 వద్ద NTAకు పిలుపు ఇవ్వవచ్చును.

సం/-
డైరెక్టర్ (పరీక్షలు)
CBC 21354/12/0007/2425

వార్త

జీవితంలో విజయం సాధించడానికి మనిషికి తెలివితేటలు ఉండీ అవకాశాలు వచ్చినంత మాత్రాన చాలదు. ఏకాగ్రత, లక్ష్యసిద్ధి అవసరం.

న-సి.డబ్ల్యు.వెండైట్

# 'ప్రక్షాళన' మొదలు!

దేశంలో నదులన్నీ జీవనదులే. నదీ స్నానాలకు విశేష ప్రాధాన్యత ఉంది. పర్వదినాలప్పుడు భక్తులు ఎంతో పవిత్రంగా భావించే ఆ నదుల్లో పుణ్యస్నానాలాచరిస్తుంటారు. పన్నెండేళ్లకోసారి ఆయా నదులకు పుష్కరాలూ జరుపుతుంటారు. ప్రస్తుతం మహాకుంభమేళాలో పవిత్ర స్నానాల కోసం జనం తండోపదండాలుగా వచ్చి వెళ్తున్నారు. ఒకరోఇద్దరో కాదు తాజా లెక్కల్ని బట్టి 57కోట్ల మంది స్నానం చేసి వెళ్లారు. అంతటి అమృత స్నానాలు కారణంగా గంగా, యమున, సరస్వతి నదులను త్రివేణి సంగమ పవిత్ర భూమిగానే కొలుస్తాం. కానీ నదీ జలాలు అనేక కారణాల చేత కాలుష్యంతో నిండిపోయాయి. పర్యావరణ శాస్త్రజ్ఞులు వీటి విషయంలో జాగ్రత్తలు చెబుతూనే ఉంటారు. నదులు తమ సహజ స్వరూపస్వభావాలను కోల్పోవడం తెలిశాక వాటి సంరక్షణ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సంకల్పించిన ప్రభుత్వాలు వాటి మీద పలు కారణాల వలన శ్రద్ధ చూపించలేకపోయాయి. నదుల్లో కాలుష్యం నియంత్రించలేని స్థాయికి చేరుకున్నదని ఏనాడో గుర్తించారు. ఒక అడుగు ముందుకు పడలేదు. ఆయా నదుల్లో మురుగు నీటి ప్రవాహాల వలన కశ్మల కాసారాలుగా పేరుకుపోతున్నాయి. ఇదే పరిస్థితి దేశ వ్యాప్తంగా తారసిల్లుతోంది. పారిశ్రామిక వ్యర్థజలాలే కాదు, ప్లాస్టిక్‌తో కూడిన చెత్తకూడా చివరకు చేరేది ఈ నదీ తీరానికే. నదుల్లో కాలుష్య నియంత్రణకు కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ ప్రత్యేకించి నడుం కట్టిన సందర్భాలు లేవు. జాతీయ హరిత ట్రిబ్యునల్ కూడా అనేక కేసుల్లో వీటి విషయాన్ని ప్రస్తావిస్తూనే ఉన్నది. గోదావరి, కృష్ణా జలాల్లో సైతం తీసుకున్న జలనమూనాలన్నీ విష లోహాలతో నిండిఉన్నట్లు నివేదికలొచ్చాయి. ఆర్సెనిక్, నికిల్, కాడ్మియ, క్రోమియం వంటి రసాయనిక పదార్థాలు కలిసి ఉన్న ఈ జలాల వలన వాటిని తాగునీరుగా వాడే జనానికి అనారోగ్యహేతువవుతున్నాయి. దేశంలోని 187 నదుల్లో నీరు అత్యంత కాలుష్యాన్ని మోసుకెళ్తున్నట్లు చెప్పుకుంటారు. గంగానదిలోకి ఉత్తరాదిన దాదాపు అన్ని ప్రధాన పట్టణాల నుంచి రోజూ 300కోట్ల లీటర్లకు పైగా మురుగునీరు వచ్చి చేరుతోందని అంచనా. విష రసాయనాలు, క్రిమిసంహారక మందులు, ఇవిగాక పశు కళేబరాలు, మృతదేహాలు కూడా ఈ నదుల్లో కలిసిపోతుండడం వల్ల పవిత్ర నదులుగా భావించే మనం తీరా స్నానం చేస్తే ఎలాంటి అనారోగ్యాలు దరిచేరతాయో ననే భయం పట్టుకుంటోంది. అందుకే నదీజలాలు తాగునీటిగా ఉపయోగపడవనే అభిప్రాయం ప్రజల్లోకి బలంగా వచ్చేసింది. నదీ కాలుష్యం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ఇటీవలనే చేసిన అధ్యయనాన్ని బట్టి గంగానది ఇప్పుడు నీటిలో మలసంబంధిత బ్యాక్టీరియా నిండిపోయింది. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు ఈ నెల 3న సమర్పించిన నివేదికను బట్టి ఈ నది నీటి నాణ్యత స్నానానికి పనికిరాదు. హరిద్వార్‌లోనూ గంగానది కలుషితమైంది. 1986లో కేంద్రప్రభుత్వం గంగానది శుద్ధికోసం 'నమామి గంగే' ప్రాజెక్టు ప్రారంభించింది. వేలాది కోట్లు ఖర్చుచేసినా సత్ఫలితాలు సాధించ లేకపోయారు. అమెరికా, యూరప్ వంటి పశ్చిమదేశాల్లో నదులను అత్యంత శుభ్రంగా ఉంచుకోవడం మనకు తెలిసిన విషయమే. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం బాగా పెరిగిన రోజుల్లో కూడా మురుగునీటి శుద్ధి పారిశుధ్య సంరక్షణ వంటి విషయాల్లో వెనుకబడి ఉన్నామనే మన కార్యాచరణలో లోపముందన్నది తేటతెల్లం. ఆ నేపథ్యంలోనే యమునా నదీ కాలుష్యస్థాయిలు నానాటికీ పెరిగిపోయా యని పెద్ద చర్చేసాగుతోంది. నిన్నమొన్నటి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కూడాయమునా నది కాలుష్యం గురించిప్రచారంజరిగింది. ప్రధాన పోటీ లో ఉన్న ఆప్, భారతీయ జనతాపార్టీలు యమునా నదీ జలాలు ప్రక్షాళనపై విసుర్లు కూడా విసురుకున్నాయి. కానీ చివరకు 'యమునా నది ప్రక్షాళన' తాము చేస్తామంటే తాము చేస్తామని హామీలు ఇచ్చాయి. కేంద్ర ప్రభుత్వం అండదండలు లేకుండా ఇలాంటి మహత్తర కార్యక్రమాలు చేయడం కష్టసాధ్యం. అయినా 'ఆప్' కూడా ఆ పాటే పాడింది. 2020లోనే ఆమ్ ఆద్మీపార్టీ ఢిల్లీ పీఠం ఎక్కినా కేంద్రప్రభుత్వంతో వైరంతో యమునా నదిప్రక్షాళన ఊసేఎత్తలేదు. ఏమైతేనే పాలకులుఎవరైనా, ఏపార్టీ వారైనా ప్రక్షాళన అవసరమేనని ఒప్పుకున్నారు. అనుకున్నట్లుగానే ఈ నెల 16 నుంచి యమునా నది శుద్ధిపనులను కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. నిత్యం పారిశ్రామిక వ్యర్థాలు, 3 కోట్లకుపైగా జనాభా ఉన్న ఢిల్లీ ప్రాంతాల నుంచివస్తున్న మురుగు కూడా దీనిలోనే కలుస్తాయి. 4అంచెల ప్రణాళిక తో ముందుకు వెళ్తోంది. కొత్త ప్రభుత్వం ఏర్పడకుండానే ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో పనులు మొదలయ్యాయి. యమునా నది ఉత్తరాఖండ్ హిమాల యాలను దాటి హర్యానా, యుపి సరిహద్దుల మీదుగా ప్రవహించి ఢిల్లీకి చేరుకుంటుంది. ప్రస్తుతానికి ఈ 57 కిలో మీటర్ల మేర పనులు పూర్తి చేస్తారు. ఢిల్లీని దాటితే మధుర ఆగ్రాల ప్రాంతంలో కూడా నదీజలాలు కాలుష్యమే. నదిశుభ్రం కోసం క్లీనింగ్ ఆపరే షన్ మొదలెట్టారు. ట్రాష్ స్కిమ్మర్లు, వీడ్ హార్వెస్టర్‌లు, డ్రెడ్జి యుటిలిటీ యూనిట్లతో నదిని శుభ్రం చేస్తున్నారు. సుందరీకరణ, కాలుష్యం కలిగించే వ్యర్థాల తొలగింపు జరుగుతోంది. మురుగునీటితో పేరుకుపోయిన మేటలను డ్రెడ్జింగ్ యంత్రాలు తొలగిస్తాయి. ఆ తర్వాత సీవరేజి ట్రీట్‌మెంట్ ప్లాంటులను ఏర్పాటుచేయిస్తారు. ఏమయితేనేం ఢిల్లీ విషయంలో కేంద్రం ఓ ముందడుగు వేసింది. దేశవ్యాప్తంగా ఉన్న ఇతర నదుల్లో కాలుష్యం తొలగించేందుకు కూడా యుద్ధప్రాతిపదికపై నడుం కట్టాల్సి న ఆవశ్యకత ఉంది.



కష్టతరమైన పనిని చేసే వ్యక్తి, అప్పగించబడిన పనిని చాలా బాగా చేసే వ్యక్తి ఎన్నటికీ తన ఆత్మగౌరవాన్ని కోల్పోడు.

జార్జి బెర్నార్డ్ షా



మీరు గౌరవాన్ని కోరుకుంటే, ముందు మిమ్మల్ని మీరు గౌరవించుకోవాలి. మీ అనుమతి లేనిదే మిమ్మల్నెవరూ చిన్నచూపు చూడరు.

శామ్యూల్ జాన్సన్

## ప్రజావాక్కు



### కుల భావజాలానికి కాలం చెల్లింది!

వైకాపానేత, పులివెందుల శాసనసభ్యులు జగన్ మోహన్ రెడ్డి తన విజయవాడ పర్యటనలో చంద్రబాబు నాయుడుకి తన సామాజిక వర్గానికి చెందిన వారు ఎదగటం ఇష్టం ఉండదంటూ ఒక వ్యర్థప్రేలాపన చేశారు. వల్లభనేని వంశీని అరెస్టు చేస్తే న్యాయ పోరాటం చేయవచ్చు. జగన్ అందుకు అన్నివిధాలా సహాయ పడవచ్చు. ఇక్కడ కుల ప్రస్తావన అసంబద్ధం, దివాళా కోరు రాజకీయాలకు పరాకాష్ట! గతంలో కులాలమధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందారు. వైకాపా పాలనలో బిటెక్ రవి గారిని కూడా వేధింపులకు గురిచేశారు. మరి ఇదే నీతిసూత్రం అప్పుడు కూడా వర్తించాలి కదా? ఇదే భావజాలం కొనసాగితే వచ్చే ఎన్నికల్లో ఆ పదకొండు స్థానాలు కూడా రావు.

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### ఎస్జీటీ ఉపాధ్యాయులకు పరీక్షల విధులు వద్దు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాల్లో అధిక భాగం స్కూళ్లలోఒకరు లేక ఇద్దరుఎస్జీటీ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఈఎస్జీటీ ఉపాధ్యాయులకు మార్చి, ఏప్రిల్ నెలల్లోఇంటర్మీడియట్ పరీక్షలఇన్విజిలేషన్ డ్యూటీలు, పదవ తరగతి పరీక్షల ఇన్విజిలేటర్ స్పాట్ వాల్యూయేషన్ విధులు కేటాయిస్తున్నారు. అందువల్ల ప్రాథమిక పాఠశాలలు సింగిల్ టీచర్స్ స్కూల్స్ అవుతున్నాయి. దీంతో ఆయా ప్రాథమిక పాఠశాలల్లో విద్యా బోధనకు ఆటంకం కలుగుతున్నది. రాబోవురోజుల్లో ఎస్జీటీ ఉపాధ్యాయులను పదవ తరగతి పబ్లిక్ పరీక్షల విధులకు ఉపయోగించడం వల్ల ఆయా ప్రాథమిక పాఠశాలల్లో విద్యాబోధనకు ఆటంకం కలుగుతుంది. కాబట్టి పదవ తరగతి పరీక్షల ఇన్విజిలేటర్ డ్యూటీ, స్పాట్‌వాల్యూయే షన్ డ్యూటీల నుంచి ఎస్జీటీ ఉపాధ్యాయులను మినహాయించాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### మాదకద్రవ్యాల నియంత్రణ ఎక్కడ?

మాదకద్రవ్యాల సమస్య రోజురోజుకు తీవ్రతరమై యువతరాన్ని నిర్వీర్యం చేస్తుంది. మాదకద్రవ్యాల మత్తులో పడి నిండు నూరేళ్ల జీవితాలను చిత్తు చేసుకుంటున్నారు. వీటిని సేవించడంవల్ల కలిగేదుష్ఫలితాలను చిన్నవయసు నుంచే పసిపిల్లలకు వివరించి చెప్పాలి. పాఠశాలలో వీటి దుష్ఫలితాలను గురించి స్పష్టంగా బోధించాలి.

- తూలుగు రమణారావు, అక్కరాపల్లి

### కుంభమేళా భక్తుల జేబుకు చిల్లు

మహా కుంభమేళా ఫిబ్రవరి 26న వచ్చే శివరాత్రితో ముగియనుంది. ఈ క్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు ప్రయాగ్ రాజ్ తరలివెళ్తారు. విమాన మార్గంలోనూ పెద్ద సంఖ్యలో భక్తులు వెళుతున్నారు. ఈడిమాండ్‌ను ఆసరాగాచేసుకుని విమానయాన సంస్థలు భక్తుల జేబుకు చిల్లులు పెడుతున్నాయి. సాధారణ రోజుల్లో రూ.5000 నుండి రూ. 10,000 లోపు ఉండే చార్జీలను ఏకంగా రూ.30 వేలకు పైనే వసూలు చేస్తున్నాయి. ఈ వారం ఆరంభంలో ప్రయోగ్ రాజ్ నుండి బెంగుళూరు ప్రయాణానికి ఓ ప్రయివేటు విమాన కంపెనీ ఒక్కొక్కరికి రూ. 39,146 వసూలు చేసింది. సాధారణంగా రూ.10 వేల లోపు ఉన్న విమాన చార్జీలను కుంభమేళా సమయంలో బెంగుళూరుకు రూ.22వేల వరకు వసూలు చేశాయి. తాజాగా ఈ చార్జీలు మరింత దంచుకోవడం పై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో వెంటనే కేంద్ర విమాన మంత్రిత్వ శాఖ ట్రావెల్స్ ఏజెన్సీలపై చర్యలు తీసుకొని విమాన చార్జీలను తగ్గించే విధంగా చేయాలని ప్రయాణికుల విన్నపం.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### భారత్,బంగ్లా సంబంధాలు

షేక్ హసీనాకు ఆశ్రయం ఇవ్వడం వల్ల బంగ్లా కొంత మనకు దూరం జరిగిన పాకిస్థాన్‌తో అంటకాగడం వల్ల వచ్చే లాభం ఏమి ఉండదు భారత్‌లోద్వారా స్కింతయారీలో అమర్త్యసేన్‌తో పాలుపంచుకున్న మహమ్మద్ యూనిస్ పాలకుడుగా బంగ్లాలో నివసించే మైనారిటీలకు ముఖ్యంగా హిందువులకు ఏమాత్రం విశ్వాసం కలిగించిన దాఖలాలు లేవు అదే అతి పెద్ద విషాదం. అయితే భారత్‌కు బంగ్లాకు సాంస్కృతిక సంబంధాలు కూడా ఉన్నాయి. అంత మాత్రమే కాదు భారత్ బంగ్లా మధ్య కుషియారానది రహీంపూర్ కాలువ సంబంధాలు కూడా ఉన్నాయి. కావున ఆ దిశగా భారత్ బంగ్లా అడుగులు పటిష్టంగా ఉండాలి.

-భారత అవినాష్, జనగామ

### ప్రజల అవసరాలు పట్టించుకోండి

గ్రామాల్లో పాఠశాల, వైద్య శాల, పార్కు, గ్రంథాలయం, పబ్లిక్ టాయిలెట్స్ వంటి మౌలిక వసతులు ఉన్నప్పుడే గ్రామం సమగ్రా భివృద్ధి చెందుతుంది. ప్రభుత్వాలు ఇంటి పన్ను వసూలు చేస్తూ కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. రాజకీయ పార్టీలు ఓట్ల కోసం ఉచితబియ్యం, బస్సు, రైతుబంధు వంటి పథకాలు ప్రకటిస్తూ ప్రజల అవసరాలను మాత్రం విస్మరిస్తున్నాయి.

- పుట్లూరి రాంనర్సింహారెడ్డి, నల్లగొండ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# తెలుగు భాషా సంస్కృతులను పరిరక్షించాలి

**ఈ తరం విద్యార్థులకు తెలుగు ప్రాచీన వైభవం, సంస్కృతి సంప్రదాయాల పట్ల కనీస అవగాహన లేకుండా పోతున్నది. దేశ భాషలందు "తెలుగు లెస్స" అన్న నానుడి దేశ భాష లందు "తెలుగు లెస్" అనే దురవస్థకు రాబోతోంది. తెలుగు ప్రజలు తమ మాతృభాషను కాపాడుకుంటూ ప్రపంచమంతా విస్తరించారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు మాట్లాడేవారు 15 కోట్ల దాకా ఉంటారని ఒక అంచనా. 2011 జనాభాలెక్కల ప్రకారం భారతదేశంలో దాదాపు 9కోట్లమంది తెలుగు మాట్లాడే వారున్నారు. వాస్తవానికి తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా నిర్వీ ర్యంచేస్తున్నది తెలుగుజాతి. తెలుగుకు పట్టిన ఈ 'తెగులు' ఈనాటిది కాదు. కాలక్రమేణ, అవిభక్త ఆంధ్రదేశం పూర్తిగా మారిపోయి ప్రస్తుతం ఆంగ్ల దేశంగా రూపుదిద్దుకుంటోంది. అజంతాలతో ఉండటం వలన ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని సంబోధించబడిన, అద్భుత భాష అంతరించి పోకుండా మరల జవసత్వాలని అందించాల్సి న అవసరం ఉంది.**

రామ కిష్టయ్య సంగన భట్ల

ఒక సమాజపు సంపూర్ణ జీవన విధానమే ఆ సమాజపు సంస్కృతి. సంస్కృతి అంటే సంస్కరించినది అని అర్థం. ఆ సమాజంలో పాటించే ఆచారాలు, పద్ధతు లు, సంప్రదాయాలు, వస్త్రధారణ, భాష, మతం, ఆటలు, విశ్వాసాలు, కళలు, జీవన విధానం, అన్నీ సంస్కృతిలోని భాగాలే. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు వేలాది ఏళ్ల చరిత్ర ఉంది. ప్రాచీన అర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు ఆలవాలమైన భారతావనిలో తెలుగు సంస్కృతికి విడదీయ రానిది బంధం అనుబంధం ఉన్నాయి. తెలుగు సంస్కృతి లో భాగమై నానాటికీ అనాదరణకు గురవుతున్న తెలుగు భాష పునర్ వైభవానికి కృషి సల్పాల్సి న సమయం ఆసన్న మైంది. విదేశాల్లో తెలుగు వికాసానికి ఎనలేని కృషి జరుగు తుంటే, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కనుమరుగయ్యే ప్రమా దంలో పడింది. బతుకు తెరువు కోసం ఆంధ్ర ప్రాంతం నుంచి మారిషస్‌కు వెళ్లినవ్యవసాయ కూలీలు 185 సంవ త్సరాలుగా తమ మాతృభాష అయిన తెలుగు భాషను పరిరక్షిస్తూనే ఉన్నారు. 12.5 లక్షలకు పైగా జనాభాలో లక్ష మందికి పైగా తెలుగువాళ్లు ఉండగా తమ వారసు లకు, భావితరాల వారికి, తెలుగు భాషలో సాధికారికతను సాధించి పెట్టేందుకు కృతనిశ్చయంతో, తెలుగుభాషా మాధ్యమంలో పాఠశాలలు నిర్వహింప చేసుకుంటూ తమ పిల్లల్ని తమ మాతృభాషలోనే చదివించడం గొప్పలలో కెల్లా గొప్ప. అక్కడ తెలుగు వారికోసం చాలా సంస్థలున్నాయి. ఉత్స వాల్లో అందరూ తెలుగులోనే మాట్లాడే ప్రయత్నం చేస్తారు. మారిషస్ అధికారిక టీవీ ఛానెల్లో కూడా వారానికి ఒక తెలుగు సినిమా వేస్తారు. డీడీ యాదగిరి ఛానెల్ మారిషస్‌లో వస్తుంది. ప్రాథమిక స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకూ తెలుగు నేర్చుకునే అవకాశాలు ఉన్నాయి. మారిషస్ యూనివర్సిటీ లో తెలుగులో డిప్లొమా, డిగ్రీ కోర్సు లున్నాయి. అంతేకాకుండా, మారిషస్ తెలుగు మహాసభ, తెలుగు సాంస్కృతిక కళానిలయం, తెలుగు సాంస్కృతిక నిలయం, తెలుగు భాషా సంఘం వంటి సంస్థలు అక్కడ తెలుగు భాషను, సంస్కృతిని కాపాడటానికి ప్రయత్నిస్తున్నాయి. ఆస్ట్రేలియాలో తెలుగు భాషా వికాసం కోసం చాలాకాలంగా అనేక సాహిత్య, సాంస్కృతిక సంస్థలు కృషి చేస్తూ భావితరాలకు బాటలు వేస్తున్నాయి. 'తెలుగుమల్లి' సాహిత్య మాసపత్రిక, 'భువన విజయం' వంటి సాంస్కృతిక సంస్థలు ఈక్రమంలో తెలుగు ప్రజల అస్తిత్వానికి ప్రతీకలుగా నిలిచాయి. తెలుగు భాషకు ఆస్ట్రేలి యాలో అరుదైన గౌరవం లభించింది. అక్కడి పాఠశాలల్లో తెలుగును ఐచ్ఛిక అంశంగా చేరుస్తూ ఆస్ట్రేలియా ప్రభుత్వం కీలక ఆదేశాలిచ్చింది. దీంతో ప్రాథమిక, మాధ్యమిక పాఠ శాలల్లో ఇకపై పన్నెండో తరగతి వరకు తెలుగు భాషను నేర్చుకునే అవకాశం కలిగింది. ఇందుకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్, సిడ్నీ, విక్టోరియా, న్యూసౌత్ వేల్స్, క్వీన్స్ లాండ్, సౌత్ ఆస్ట్రేలియా మొదలైన రాష్ట్రాల్లోని తెలుగు వారి పిల్లలకు ఒకటో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు తెలుగు ఐచ్ఛికంగా ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో చదువుకొనే అవకాశం కలగనుంది. అమెరికాలో తెలుగు భాషకు గౌరవం దక్కింది. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అమెరికాలో ప్రజలకు సమాచారం అందించేందుకు అధికారిక భాషగా తెలుగు భాషను గుర్తించింది. యూఎస్ ఆధారిత ఇమ్మిగ్రేషన్ స్టడీస్ ఇటీవలి అధ్యయనం తెలుగును యుఎస్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న భాషగా చూపిస్తుంది. ఇది గత ఏడు సంవత్సరాలలో 86శాతం పెరిగింది. 2020లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు నవంబర్




3న జరగగా, ఆ ఎన్నికల్లో ఓటరు బ్యాలెట్ పేపర్‌లోని అధికారిక భాషల జాబితాలో తెలుగు భాష కూడా చేర్చారు. ఇటీవలే సద్గురు ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్, వంశీ ఇంటర్నేషనల్ ఇండియా, సాంస్కృతిక కళా సారథి సింగపూర్ సంయుక్త ఆధ్వర్యంలో తానా, వంగూరి ఫౌండేషన్, యునైటెడ్ కింగ్డ మ్ తెలుగు అసోసియేషన్, సీపీ బ్రౌన్ తెలుగు సమాఖ్య (లండన్), దక్షిణాఫ్రికా తెలుగు సాహిత్య వేదిక, తెలుగు మల్లి ఆస్ట్రేలియా, తెలుగు అసోసియేషన్ సిడ్నీ, న్యూజిలాండ్ తెలుగు అసోసియేషన్, హాంగ్ కాంగ్ తెలుగు సమాఖ్య, వేగేశ్న ఫౌండేషన్ వారి సంయుక్త నిర్వహణలో కళాప్రపూర్ణ, పద్మభూషణ్, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత దేవులపల్లి కృష్ణశాస్త్రి 123వ జయంతి సందర్భంగా మొట్టమొదటి ప్రపంచ సంగీత సాహిత్య సమ్మేళనం అత్యంత వైభవంగా నిర్వహించారు. అంతేకాదు మొట్టమొదటి ప్రపంచ సంగీత సాహిత్యసమ్మేళనం కార్యక్రమానికి వండర్ బుక్ ఆఫ్‌రికార్డ్స్, తెలుగు బుక్ఆఫ్ రికార్డ్స్ లో గౌరవ స్థానం దక్కింది. 12 గంటల ఈ నిర్విరామ సంగీత కార్యక్రమాన్ని వేలాదిమంది వీక్షించి, ఆనందించడం సంగీత చరిత్రలో ఒక చెరిగిపోని సంఘటన. ప్రపంచ తెలుగు సాంస్కృతి మహోత్స వంలో దాదాపు 45 దేశాలనుంచి 64 తెలుగు సంఘాలు ఒకే తాటిపైకి వచ్చాయి. తెలుగు చరిత్రలో కనీవినీ ఎరుగని రికార్డ్అది. జయహో భారతీయం భారతదేశం, జిజ్ఞాస-భారతదేశం తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా, ఆంధ్రప్రదేశ్ అసోసియే షన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, ఫ్రాన్స్ తెలుగు అసోసియేషన్, సౌత్ ఆఫ్రికా తెలుగు కమ్యూనిటీ, జర్మనీ తెలుగు అసోసియేషన్, సింగపూర్ తెలుగు సమాజం, తెలుగుఅసోసియేషన్ ఆఫ్‌లండన్, బహరేన్ తెలుగు కళాపరిషత్, తెలుగు వెలుగు జర్మనీ, డెన్మార్క్ తెలుగు అసోసియేషన్, తెలుగు అసోసి యేషన్ ఆఫ్ ఆస్ట్రేలియా, తెలుగు అసోసియేషన్ ఆఫ్‌సౌత్ ఆస్ట్రేలియా, సింగపూర్ తెలుగు కమిటీ, చైనా తెలుగు అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ స్కాట్లాండ్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ కెన్ బెర్రా, కామన్ అసోసియేషన్ ఆఫ్ చైనా, యునైటెడ్ తెలుగు అసోసియేషన్ ఫోరమ్-కువైట్, తెలుగుకళా సమితి కువైట్, ఆస్ట్రేలియా తెలుగుసమితి, ఆస్ట్రేలియా తెలంగాణ స్టేట్ అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్‌సిడ్నీ, సౌదీ తెలుగు అసోసియేషన్, సౌత్‌ఆఫ్రికా తెలుగు కమ్యూనిటీ, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, తెలుగుకల్చరల్ సొసైటీ నార్తెన్ ఐర్లాండ్, తెలుగు కళాసమితి బహరెయిన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఇజ్లాండ్ - న్యూజి ల్యాండ్, తెలుగు బ్యాత్మెంటిన్ క్లబ్ ఆఫ్ కాంటెంబరి - న్యూజిల్యాండ్, తెలుగు కళాసమితి-ఒమాన్, దుబాయ్ తెలుగు అసోసియేషన్, ఖత్తర్ తెలుగు అసోసియేషన్, నార్వే తెలుగు అసోసియేషన్, అమెరికా తెలుగు మహిళ సంఘం లతోపాటు ఆయా దేశాలలో వివిధరాష్ట్రాల తెలుగు అసోసియేషన్స్ భాగస్వామ్యం అయ్యాయి. తెలుగు భాషనునికోలే కొంటి "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని 1402లోనే ప్రశంసించారు. మొగల్ చక్రవర్తి ఔరంగజేబు అరబ్బీభాషలో తనకు పాఠాలు బోధించి, తన బాల్యం అంతా వృధాపరిచారని, తన గురువుకు రాజ్య బహిష్కరణ లాంటి తీవ్రశిక్ష విధించిన విషయం చరిత్రచెప్తుంది. ఔరంగజేబు తన గురువుకు రాసిన నాటి చారిత్రాత్మక ఉత్తరాన్ని 1910లో కొమర్రాజు లక్ష్మణరావు తెలుగులోకి అనుమతించడమే కాక, తనకాలం నాటి ఆంగ్ల మాధ్యమం చదువుల వల్ల భవిష్యత్ తరాలు ఔరంగజేబులాగా మనలను తప్పు పడతాయని హెచ్చరించారు. ఈతరం విద్యార్థులకు తెలుగు ప్రాచీన వైభవం, సంస్కృతి సంప్రదాయాలపట్ల కనీస అవగాహన లేకుండా పోతున్నది. దేశ భాషలందు తెలుగులెస్స అన్న నానుడి దేశ భాషలందు తెలుగు లెస్ అనే దురవస్థకు రాబోతోంది. తెలుగు ప్రజలు తమ మాతృభాషను కాపాడుకుంటూ ప్రపంచమంతా విస్తరించారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగుమాట్లాడేవారు 15కోట్ల దాకా ఉంటారని ఒక అంచనా. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో దాదాపు 9కోట్ల మంది తెలుగు మాట్లాడే వారున్నారు. వాస్తవానికి తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా నిర్వీర్యంచేస్తున్నది తెలుగుజాతి. తెలుగుకు పట్టిన ఈ 'తెగులు' ఈనాటిది కాదు. కాలక్రమేణ, అవిభక్త ఆంధ్రదేశం పూర్తిగామారిపోయి ప్రస్తుతం ఆంగ్ల దేశంగా రూపుదిద్దుకుంటోంది. అజంతాలతో ఉండటం వలన ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని సంబోధించబడిన, అద్భుత భాష అంతరించి పోకుండా మరల జవసత్వాలని అందించాల్సి న అవసరం ఉంది. •

# పరీక్షల ఒత్తిడిని తగ్గించుకోవడం ఎలా?


బి.మధుపాళి

మార్చి, ఏప్రిల్ మాసాలు భారత్‌లో వార్షిక పరీక్షల సీజన్‌గా పరిగణించబడుతున్నది. విద్యార్థినీవిద్యార్థులు, తల్లితండ్రులు, పాఠశాల యాజమాన్యాలు మార్కులు, ర్యాంకుల వేటలో తమ కృషిని కొనసాగిస్తారు. పరీక్ష అంటేనే ఒక రకమైన ఒత్తిడి పెరుగుతుంది. మంచి ఫలితాలు సాధించాలనే ఆశావహ మానసిక ఒత్తిడి లేదా పాజిటివ్ స్ట్రెస్ ఉన్న యువత పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను పొందుతారు. పరీక్షలకు తయారు అవుతున్న విద్యార్థులు అతిగా ఆలోచిస్తూ, ఏమవుతుందో అనే అనవసర ఆందోళనలు, తీవ్రమైన నెగెటివ్ ఒత్తిడులు పరీక్షల్లో ఫలితాలను తారుమారు చేస్తాయని తెలుసుకోవాలి. విద్యార్థులపై తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, సహచర విద్యార్థుల ప్రభావం కూడా పరీక్షల ఒత్తిడిని పెంచుతుందని గమనించాలి. పరీక్షల్లో తాహత్తుకు మించి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని లక్ష్యం పెట్టుకున్నయువతలో 'పరీక్షల ఆందోళన' తారస్థాయికి చేరి ఫలితాలను మరింత ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయి. గత పరీక్షల్లో పొందిన మార్కులు లేదా ర్యాంకుల కన్న కొంతైనామెరుగైన ఫలితాలను సాధించాలనే ఆచరణయోగ్య లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. మన శక్తి సామర్థ్యాలకు మించి మార్కులు లేదా ర్యాంకులు రావాలని ఆశపడడం వల్ల మన చదువులపైప్రతికూల ప్రభావాలు పడడంతోపాటు గతంకన్న తక్కువ స్థాయిలో ఫలితాలు వస్తాయి. పరీక్షలంటే అనవసర ఆందోళనలు మన శారీరక, భావోద్వేగ ప్రతికూలతలకు దారి తీస్తాయి. ముఖ్యంగా తల్లితండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై అతిగా ఆశలు పెట్టుకోవడం, సహచరుల ఫలితాలను చూసి ఆత్మన్యూనతకు గురికావడం సాధారణంగా జరుగుతుంది. ప్రతికూల ఒత్తిడిపెరిగిన యువతలో ఏకాగ్రత సడలడం, ఆందోళనలు పెరిగి ఎక్కువ సమయం చదవకపోవడం జరుగుతుంది. పరీక్షలంటే భయం పెరిగిన యువతలో శారీరకంగా అతిగా చెమటలు పట్టడం, వాంతులు, జీర్ణసంబంధ సమస్యలు, గుండెవేగం పెరగడం, శ్వాస మందగించడం, తలనొప్పి, కోపం పెరగడం, అధిక బిపీ, ప్రతికూల ఆలోచనలు వెంటాడడం, భయదాడి (పానిక్ అటాక్) లాంటి అవలక్షణాలన్ని కనిపిస్తాయి. రాబోయే పరీక్షలకు ముందుగానే ప్రణాళికలు తయారు చేసుకొని చదవడం ప్రారంభించాలి. పరీక్షా ఫలితాలపట్ల అనవసర ఆలోచనలు మన ఏకాగ్రతను మింగేస్తాయి. సబ్జెక్టుల వారీగాప్రణాళికలు రాసుకొని ప్రాధాన్యతాక్రమంలో చదవడం మంచిది. చదివిన పాఠాలు ఎంతవరకు గుర్తున్నాయో తెలుసుకోవడానికి స్వయం పరీక్షలు రాయాలి. చదువుతున్న సమయంలో గంట లేదా రెండు గంటలకు ఒకసారి స్వల్ప విరామం తీసుకోవడం, దీర్ఘశ్వాసలు తీసుకోవడం ఏకాగ్రతను మెరుగుపరుస్తాయి. గత పరీక్షలో పొందిన మార్కులకన్న ఎక్కువరావాలనే లక్ష్యాలు మంచి ఫలితాలను ఇస్తాయి. నిన్నటికన్న నేడు మెరుగైతే మనం ప్రగతి బాటన నడిపినట్లే అని నమ్మాలి. మనం చదివేచదువుపై అనవసర ప్రతికూల ఆలోచనలకు స్వస్తిపలకాలి. నా శక్తి వంచన మేరకు చదువుతున్నాను, నేను మంచి ఫలితాలను సాధింగలను, నేను అనుకున్న ఫలితాలు పొందకపోయినా రానున్న పరీక్షల్లో మెరుగు పరుచుకోగలను లాంటి ఆత్మ విశ్వాసాన్ని పెంచే ఆశావహ ఆలోచనలు మన ప్రతిభను పెంచుతాయి. దినచర్యను నిర్ణయించుకొని, మధ్యమధ్య పాలు లేదా టీ లాంటివి తాగుతూ మానసిక ఆరోగ్య పరిరక్షణకు కృషిచేయాలి. చదవడాన్ని వాయిదా వేయవద్దు. చదువుతున్న పాఠంలోని ముఖ్యఅంశాలను అండర్‌లైన్ చేసుకోవడం మంచిది. గ్రాఫ్‌లు, లెక్కలు, డయా గ్రామ్స్, సూత్రాలు, సమీకరణాలు లాంటిఅంశాలను చదివే సందర్భంలో రాసుకుంటూ చదవడంమంచిది. ఒకసారిరాస్తే పదిసార్లు చదివినట్లే అని తెలుసుకోవాలి. ప్రతిరోజు కొన్ని నిమిషాలు శారీరక వ్యాయామానికి కేటాయించండి. పరీక్ష రోజునకనీసం 15, 30 నిమిషాల ముందు పరీక్ష కేంద్రానికి చేరే విధంగా ప్రణాళిక వేసుకోవాలి. పరీక్షకు వెళ్లే ముందు అతిగా తినడం మంచిది కాదు. పరీక్షకు ముందు రోజు సమయానికి నిద్రపోవాలి. సమయానికి చేరలేమేమో అనే ఆందోళనలు మన ఏకాగ్రతకు భంగంకలిగిస్తాయి. పరీక్ష హాలుకు తీసుకుపోవలసిన హాల్‌టికెట్, పెన్నులు, పెన్సిల్‌లు, ఇతర సామాగ్రినిముందుగానే సిద్ధం చేసుకోవాలి. ఒక్కనిమిషం ఆలస్యమైనా పరీక్ష హాల్‌లోకి అనుమతించరని గుర్తుంచుకోవాలి. •

# సామాజిక న్యాయదిశగా వర్గీకరణ అడుగులు

గురం రాంమోహన్ రెడ్డి

సామాజిక సమ న్యాయం దిశగా అడుగులు పడుతున్నాయి. మహోజ్వాలంగా సాగిన ఎం.ఆర్.పి.ఎస్. ఉద్యమం వర్గీకరణ రూపేణ ఫలితాలు అందేందుకు మార్గాలు సుగమవుతున్నాయి. ఎస్సీలకు, ఉపకులాలకు ఎ.బి.సి వర్గీకరణ రూపేణ విద్యా, ఉద్యోగ రంగాల్లో వాటను పొందనున్నారు. తెలంగాణ ప్రభుత్వం షెడ్యూల్డు కులాల రిజర్వేషన్ల వర్గీకరణకు కట్టుబడి వున్నామని అధికారికంగా ప్రకటించింది. ఇచ్చిన మాటకు కట్టుబడి వుండాలన్న సంకల్పంతో జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమీషన్ను నియమించింది. ఎస్సీలోని 59 కులాలు అభిప్రాయాలను ఆలోచనలను మనోగతాన్ని కమీషన్ సేకరించి, నివేదికి రూపొందించి ప్రభుత్వంకు అందజేసింది. ఏక సభ్య కమీషన్ అధ్యయనం చేసి రూపొందించిన నివేదికను రాష్ట్ర కేబినేట్ ఆమోదించి చట్ట సభలైన శాసనసభ, శాసన మండలలో ప్రవేశపెట్టి అధికారిక ప్రకటనను శాసన సభలో ముఖ్యమంత్రి శాసన మండలి ఆర్థికమంత్రి చేసి చర్చకు పెట్టారు. ఉభయ సభల్లో ప్రవేశ పెట్టిన జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికను అధికార పక్షంతోపాటు ప్రధాన రాజకీయ పక్షాలు బి.ఆర్.యస్., బి.జె.పి. ఎం.ఐ.ఎం, సి.పి.ఐ పార్టీల సభ్యులు ససమర్థించారు. ఎస్సీలకు, ఉపకులాలకు, మాలలకు సమన్యాయం దక్కే దిశగా అడుగులు పడటాన్ని అన్ని పార్టీలు స్వాగతించిన విషయం తెలిసిందే. తెలంగాణ ప్రభుత్వం వర్గీకరణ అమలు కోసం చట్టం చేయాలా, ఆర్డినెన్స్ తీసుకురావాలన్న యోచనలో నిమగ్నమైంది. గతంలో షెడ్యూల్డు కులాల రిజర్వేషన్లను ఎ.బి.సి.డిగా వర్గీకరణ చేసి విద్య ఉద్యోగ రంగాల్లో అమలు చేశారు. జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ రిజర్వేషన్ల ఎ.బి.సి. మాత్రమే అమలు చేయాలని సూచించింది. 9 శాతం ఎస్సీలకు ఉపకులాలకు (ఎ గ్రూప్) 5 శాతం మాలలు ఇతర ఉపకులాలకు "డి గ్రూప్), 1 శాతం ఉపకులాలకు (సి గ్రూపు) మొత్తం 15 శాతం అమలు చేయాలని సూచించింది. ఎస్సీ జాబితాల్లోని మొత్తం కులాలకు సమన్యాయం దక్కే అవకాశం ఉంది. రాష్ట్ర జనాభాల్లో ఎస్సీలు 61 లక్షల 84 వేల 319 శాతం జనాభా వున్నట్లుగా తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సామాజిక, ఆర్థిక విద్యా, ఉపాధి రాజకీయ సమగ్ర సర్వేలో వెల్లడైంది. మొత్తం తెలంగాణ జనాభలో ఎస్సీల శాతం 17.43 ఉన్నట్లు సర్వేలో తెలింది. సుప్రీమ్ కోర్టు భారత రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పునుఅమలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం చకచకగా నిర్ణయాలు తీసుకుంటుంది. ఎస్సీల (59 కులాల) జనాభా, అక్షరాస్యత ఉపాధి, విద్యా, ప్రభుత్వ ఉద్యోగాల నియమాకాలు, ఆర్థిక



స్థితిగతులను అధ్యాయనం చేసిన కమీషన్ రిజర్వేషన్ల వర్గీకరికరించి ప్రభుత్వంకు సిపార్సు చేసింది. కమీషన్ 199 పేజీల నివేదికలో ఎస్సీల్లోని 59 కులాలపై వివరణాత్మక అంశాలను పొందుపర్చి మూడు గ్రూపులుగా విభజించాలని సూచించిన నేపథ్యం వేగంగా ఆచరణ యోగ్యమైన నిర్ణయాలకు తెలంగాణ ప్రభుత్వం ఉపక్రమిస్తుంది. 2011 జనాభా గణన ప్రకారం గ్రూప్లో అత్యంత వెనుకబడి ఎవరు పట్టించుకోని ఎస్.సి. కులాలకు 1 శాతం, గ్రూపు 2లో మధ్యస్థంగా లబ్ధిపొందిన 18ఎస్.సి.కులాలకు 9 శాతం (జనాభాలో 62.748 శాతం) గ్రూపు 3లో మెరుగైన ప్రయోజనం పొందిన 26 ఎస్.సి. కులాలకు 5 శాతం (జనాభాలో 33,963 శాతం) రిజర్వేషన్లు కల్పించనున్నది. కమీషన్ గ్రూపు 1లో బావుర్, బుడజంగం, చలాటి, డక్కలి, జగ్గలి, పంబాద, పంబాలో, వంబండ, మాగ్, మన్నే, మస్తీ, మాంగ్ గరోడి, మాతంగి, మోహతర్, ముండాల, సంబన్, స్రప్తు కులాలకు 1 శాతం రిజర్వ్యుషన్లు వర్తించనున్నాయి. గ్రూపు 2లోని అరుందతీయ, బైడ్ల, చమర్, మోచి, మూని, చమర్, రవిదాస్, చమర్ రోహిదోస్, చంచర్, చండాల, డోమ్, ఓంబరా, పైడి, పానో, ఎల్లమ్మ వాడ్ల గోడార్, జాంబువులు, ఎస్సీ మాదిగదాసు, మస్తీక, పామిడి, పంచమ, పరియ ప్రమగర, చిందోల్లు, యాటల, వల్లువన్, ఎస్.సి. కులాలకు 9శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం అడుగులు వేస్తుంది. గ్రుపు3లోని ఆది ఆంధ్ర, ఆది ద్రావిడ, అనాముక్, అరేమాల, అర్వమాల, బ్యాగర, చలవాడి, డోర్, ఘాసి, చండి, శల్లీ, గోసంగి, హెలియా, హెలియాదాసరి, మాదాసి కురవ, మదారి కురవ, మహర్, మాల, మాలదాసరి, మాలదాసు, మాల హన్యాయ్ మాల జంగం, మాల మస్తీ, నేతకాని, మాలసన్యాసి, మిత అయ్యల్వార్, పాక్, మోత, రేల్లి కులాలకు 5 శాతం రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం ఉంది. రిజర్వేషన్ల పరిధి నుండి క్రిమిలేయర్ను మినహాయించడానికి వర్గీకరణలోని 4వ నంబర్ (డి గ్రూపు) ను సిఫార్సు నుంచి తొలగించేలాని కమీషన్ సిపార్సు చేసిన క్రమమంలో ప్రస్తుతం గ్రూపు1, గ్రూప్2, గ్రూప్3 వర్గాలకు రిజర్వేషన్లు అమలు కానున్నాయి. 1999లో ప్రారంభమైన ఉద్యమ ఆకాంక్షలు నేరవేరడానికి బాటలు పడ్డాయి. ప్రకాశం జిల్లా ఇది మూడిలో ఎం.ఆర్.పి.ఎస్. ఉద్యమం ఆరంభమై మహాజ్వాలంగా గల్లి నుంచి హస్తిన వరకు 32 ఏళ్లపాటు కొనసాగి విజయ తీరాలకు చేరుకోబోతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కదిలించి, మెప్పించి ఒప్పించి ఎం.ఆర్.పి. ఎస్.ఉద్యమం దళిత బహుజనుల్లో శ్రామికు కులాల్లో ఉద్వేగాన్ని నింపి జయగీతం పాడనున్నది. ఇప్పటికే హర్యానా రాష్ట్ర ప్రభుత్వం గత అక్టోబర్ 19 నుంచి విద్యా ఉద్యోగ రంగాల్లో ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తుంది. సుప్రీమ్ కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు మేరకు అన్ని రాష్ట్రాల్లో వర్గీకరణ అమలు కొరకు ఎం.ఆర్.పి.ఎస్. ఉద్యమబేరిమోగించనున్నది. •

वित्त मंत्रालय
भारत सरकार

# వ్యవసాయ రంగానికి ఊతం

केन्द्रीय बजट 2025-2026



## అభివృద్ధికి కేంద్ర బిందువుగా అన్నదాత

స్వయం సమృద్ధి, అభివృద్ధి చెందిన భారత్ దిశగా సాగేందుకు రైతుల సంక్షేమానికి ప్రత్యేక కార్యక్రమాలు

100 జిల్లాల్లో పంట దిగుబడిని పెంచి, 1.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూర్చే పీఎం ధన్-ధాన్య కృషి యోజన

7.7 కోట్ల మంది మత్స్యకారులు, రైతులు, పాడి రైతులకు ప్రయోజనం చేకూర్చేలా కిసాన్ క్రెడిట్ కార్డు (కేసీసీ) రుణ పరిమితి రూ.5 లక్షలకు పెంపు

భారత సముద్ర ఆహార వ్యాపారాలను అభివృద్ధి చేసేందుకు, మత్స్య రైతులను ప్రోత్సహించేందుకు దిగుమతి పన్నులు తగ్గించారు. ఘనీభవించిన చేపల పేస్టుపై కస్టమ్ సుంకాన్ని 30 శాతం నుంచి 5 శాతానికి, ఫిష్ హైడ్రోలైజేట్‌పై సుంకం 15 శాతం నుంచి 5 శాతానికి తగ్గింపు.

స్థానికంగా వ్యవసాయాన్ని ప్రోత్సహించి, ఉద్యోగావకాశాలను పెంపొందించేందుకు సమగ్ర గ్రామీణ సంక్షేమం, అభ్యున్నతి కార్యక్రమం. తద్వారా వలసలు తగ్గించడమే లక్ష్యం (100 వ్యవసాయ జిల్లాలతో ఈ కార్యక్రమం మొదలు)

గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక బృందాలు, ప్రజల రుణావసరాలను తీర్చేలా 'గ్రామీణ క్రెడిట్ స్కోర్' కార్యక్రమం

కందులు, మినుములు, ఎర్రకందులపై ప్రధాన దృష్టి సారిస్తూ పప్పు ధాన్యాల్లో ఆత్మ నిర్భరత మిషన్ ప్రారంభం

CBC 15201/13/0011/2425

# ముగిసిన పెద్దగట్టు జాతర

## సూర్యాపేటకు చేరిన మకర తోరణం

## స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన పూజారులు

## చివరిరోజు కూడా దైవదర్శనం చేసుకున్న భక్తులు

## హుండీలోని కానుకల లెక్కింపు





**ప్రభాతవార్త, నడిగూడెం(సూర్యాపేట):** సూర్యాపేట జిల్లా దురాజ్పల్లిలో జరిగిన పెద్దగట్టు జాతర గురువారం ముగిసింది. ఈనెల 16న జాతర గంపల ప్రదక్షణతో ప్రారంభించారు. రోజు ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తూ 5వ రోజు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. లక్షలాదిమంది భక్తులు పెద్దగట్టుకు వచ్చి లింగమంతుల స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జాతర ముగింపు సందర్భంగా సూర్యాపేట యాదవ బజార్ నుండి పెద్దగట్టుకు తెచ్చిన మకర తోరణాన్ని తిరిగి స్వస్థలానికి చేర్చారు. దీంతో జాతర ముగిసిందని యాదవ పూజారులు పేర్కొన్నారు. నాలుగో రోజు నెలవారం సందర్భంగా చౌడమ్మ లింగమంతుల విగ్రహాలు ఉన్న దేవర పెట్టెను తీసుకొని మెంత బోయిన గొర్ల వంశీయులు సూర్యాపేట మండలం కేసారం వెళ్లారు. చివరి రోజు మకర తోరణాన్ని సూర్యాపేటకు చెందిన వల్లపు కోడి వంశస్థులు స్వామివారికి ధరింపజేసిన మకర తోరణాన్ని తిరిగి స్వస్థలానికి తరలించి జాతర ముగిసినట్టుగా పేర్కొన్నారు. హుండీలో వేసిన కానుకలను గురువారం ఉదయం నుండి లెక్కిస్తున్నారు. ఉండే ఆదాయం ఎంత వచ్చిందో తెలియాలంటే కొంత సమయం పట్టనుంది. లెక్కింపు కొనసాగుతుంది. అధికార యంత్రాంగం, పోలీసు సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించి జాతరను విజయవంతం చేశారు. ఎక్కడ కూడా జాతీయ రహదారి 65 ట్రాఫిక్ జామ్ కాకుండా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పటిష్టమైన చర్యలు తీసుకున్నారు. పెద్దగా దొంగతనాలు జరిగిన దాఖలాలు లేవు. పలువురు తప్పిపోగా వెంటనే గుర్తించి సంబంధించిన వారికి అప్పగించారు. జాతీయ రహదారిపై వాహనాలను మళ్ళించే విషయంలో కూడా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంది. మేరకు ఐజి సత్యనారాయణ ఎస్పి, పోలీస్ సిబ్బందిని అభినందించారు.

పెద్దగట్టును సందర్శించిన ఐజి పోలీసులు నిర్వహిస్తున్న విధులను ప్రత్యేకంగా పరిశీలించి అభినందించిన సంగతి తెలిసిందే. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ఎప్పటికప్పుడు జాతరను పర్యవేక్షిస్తూ అధికారులకు సూచనలు సలహాలు ఇస్తూ విజయవంతంగా జాతర ముగిసేలా చర్యలు తీసుకున్నారు. మున్సిపల్ సిబ్బంది షిఫ్టులవారీగా పారిశుధ్ధ్య నివారణ చర్యలు చేపట్టి భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూశారు. సౌకర్యాలు కల్పించడంలో కూడా సూర్యాపేట మున్సిపల్ అధికారులు యంత్రాంగము సఫలీకృతమయ్యారు. ఐదు రోజులపాటు జాతర నిర్వహించగా ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. దీన్నిబట్టే అధికార యంత్రాంగము ఎంత పకడ్బందీగా విధులను నిర్వహించి జాతరను విజయవంతం చేసిందో అర్థమవుతుంది. గురువారం టిఎస్పిఎస్సి సభ్యురాలు పాల్వాయి రజిని కుమారి జాతరను సందర్శించి స్వామి వారిని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. చివరి రోజు జాతరకొచ్చిన భక్తులంతా ఇంటి ముఖం పట్టారు.

# కమ్యూనిస్టులపై కెసిఆర్ వ్యాఖ్యలకు వామపక్షాల మండిపాటు

## నోరు అదుపులో పెట్టుకోవాలని సిపిఎం వార్నింగ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** కమ్యూనిస్టులపై బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు వ్యాఖ్యలపై సీపీఐ, సీపీఎం పార్టీలు మండిపడ్డాయి. కమ్యూనిస్టుల గురించి మాట్లాడేటప్పుడు కేసీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ హెచ్చరించారు. కేసీఆర్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ(ఎం), కమ్యూనిస్టులు నిరంతరం స్పందించి ఉద్యమాలు నిర్మిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జానెవెస్లీ అన్నారు. కమ్యూనిస్టులు కాంగ్రెసుకి తొత్తులుగా మారారని కేసీఆర్ వ్యాఖ్యానించడాన్ని ఆయన బుధవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. కమ్యూనిస్టుల గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవాలని కేసీఆర్‌ను హెచ్చరించారు. రాష్ట్ర ప్రయోజనాలకు భిన్నంగా, శ్రామిక వర్గం, అణగారిన వర్గాలకు వ్యతిరేకంగా, విద్యా, వైద్యం, ఉపాధి అవకాశాల్లేకుండా సంపదను కార్పొరేట్ సంస్థలకు ధారాదాత్తం చేసే పద్ధతిలో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌నను ప్రవేశపెట్టిందని విమర్శించారు. దానిపై కేసీఆర్ ఎందుకు మాట్లాడ్డం లేదనీ.. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎందుకు పోరాటాలు చేయడం లేదని ప్రశ్నించారు. అలా వ్యవహరించడం లేదంటే బీజేపీకి బీఆర్ఎస్ తొత్తుగా వ్యవహరిస్తున్నట్టేనా? అని ప్రశ్నించారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా బీజేపీకి ఓట్లు వేయించి ఆ పార్టీ ఎంపీ సీట్లు గెలవడానికి.. రాష్ట్రంలో బలపడటానికి కేసీఆర్ వైఖరి తీసుకున్నారని జాన్ వెస్లీ విమర్శించారు. బీఆర్ఎస్ అనుసరించిన ఈ వైఖరి వల్ల బీజేపీకి ఆ పార్టీ తొత్తుగా వ్యవహరిస్తున్నట్టే కదా? అని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు భిన్నంగా బీజేపీ వ్యవహరిస్తున్నా కేసీఆర్ ప్రశ్నించకుండా.. కేంద్ర ప్రభుత్వానికి, మోడీకి కేసీఆర్ భయపడుతున్నారా? అందుకే కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించడం లేదా? ఈ విషయంపై బీఆర్ఎస్ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ రాష్ట్రాల హక్కులను హరిస్తుంటే, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన సాగిస్తుంటే రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ, గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్, ఆపార్టీ అధినేత కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

### కెసిఆర్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి: కూనంనేని

కమ్యూనిస్టులు కాంగ్రెస్‌కు తొత్తులని కెసిఆర్ వ్యాఖ్యలు చేసినట్లు వస్తున్న వార్తలను సీపీఐఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తీవ్రంగా ఖండించారు. పత్రికల్లో వచ్చిన వార్తలు నిజమైతే వెంటనే కెసిఆర్ వాటిని వెనక్కు తీసుకోవాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. కమ్యూనిస్టులు త్యాగధనులని, కమ్యూనిస్టులు లేకుంటే పేద వాడి గురించి పోరాడే వారు లేరన్నారు. కమ్యూనిస్టులు, మావోయిస్టుల విధానమే మా విధానమని అనేక సార్లు చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కమ్యూనిస్టులు పోరాటం చేయడం లేదని, బిఆర్ఎస్ పోరాటం చేస్తున్నట్లు కేసీఆర్ వ్యాఖ్యలు చేయడం తప్పుడు సంకేతాలకు దారితీస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి పదవి లేకుండా కేసీఆర్ ఉండలేరా అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుడుగా ఆయన ప్రజా సమస్యలపై పోరాటం చేయాలన్నారు. ఎక్కడో వుండి మాట్లాడకుండా.. ప్రతి పక్ష నాయకుడుగా అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని హితవు పలికారు.

# ఇంద్రజిత్ గుప్తాకు ఘనంగా నివాళులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు పొం దిన కమ్యూనిస్టుగా కేంద్ర హోంశాఖ మాజీ మంత్రి ఇంద్రజిత్ గుప్తా నిలిచారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కొనియాడారు. పార్టీ జాతీయ మాజీ ప్రధానకార్యదర్శి ఇంద్రజిత్ గుప్తా 24వ వర్ధంతి సందర్భంగా గురువారం రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కూనంనేని సాంబశివరావు ఇంద్రజిత్ గుప్తా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, ఎఐటియుసి జాతీయ ప్రధానకార్యదర్శిగా వివిధ రంగాల్లో పార్టీకి సేవలందించారని.. కేంద్ర హోంమంత్రిగా కూడా పనిచేశారని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీలో హోల్‌టైమర్‌గా చేరి.. పార్టీ కోసం చిత్తశుద్ధితో పని చేశారని గుర్తు చేశారు. ఉన్నతమైన విద్యాకుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి పార్టీలో ఉండలేరని, పార్టీ సభ్యత్వం ఇవ్వడంలో ఎన్ని పరీక్షలు పెట్టినా వాటిని అధిగమించి పార్టీలో నిలదొక్కుకొని ఉన్నారని కొనియాడారు.

# మోడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యాయులకు ఫ్యామిలీ పెన్షన్ వర్తింపచేయాలి

## ట్రెజరీ అండ్ అకౌంట్ అధికారికి సిపిఎస్ యూనియన్ విజ్ఞప్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మోడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యాయులకు ఫ్యామిలీ పెన్షన్ వర్తింపచేయాలి సీపీఎస్ యూని యన్ డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లోని డైరెక్టరేస్ ఆఫ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్ కార్యాలయంలో స్టేట్ సీపీఎస్ నోడల్ ఆఫీసర్, డీటీప డైరెక్టర్ రామచంద్రమూర్తికి తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్స్‌కి స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ కలిసి వినతి పత్రం సమర్పించారు. 2017లో జీవో నంబర్ 32 ద్వారా సీపీఎస్ విధానంలోనికి వచ్చినప్పటి నుండి ఫ్యామిలీ సౌకర్యాన్ని, ఇన్వాల్యుడేషన్ పెన్షన్ అమలు చేయలేద న్నారు. మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న 38 మంది ఉపాధ్యాయులు ఆకస్మిక మరణంతో .. ఆ కుటుంబాలు తీవ్రఅవస్థలు పడుతున్నాయని తెలి పారు. సమాజంలో బడుగు బలహీన వర్గాలకు గుణాత్మక విద్యను అందిం చడంలో మోడల్ స్కూల్స్‌తోపాటు గురుకులాలు ఎల్లప్పుడూ ముందుం టాయన్నారు. అవి రాష్ట్ర పురోభివృద్ధికి ఎంతో దోహదం చేస్తున్నాయని వారి సేవలను దృష్టిలో ఉంచుకొని.. మోడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యాయులు ఉద్యోగులకు ఫ్యామిలీ పెన్షన్ అమలు చేయాలని అభ్యర్థించారు.

# అశ్వాపురంలో ఎసిబి దాడులు

## రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన వ్యవసాయ అధికారి



**అశ్వాపురం, ప్రభాతవార్త, ఫిబ్రవరి 20:** అశ్వాపురం మండలకేంద్రం లో గురు వారం ఏసీబీ దాడులు నిర్వహించారు. ఈ దాడులలో వ్యవసాయ శాఖ అధికారి సాయి శాంతన్ కుమార్ ఒక రైతు వద్ద నుండి ముప్పై వేలు లంచం తీసుకుం టుండంగా రైడ్ చేసి పట్టుకున్నట్లు ఏసీబీ డిఎస్పి వై. రమేష్ మీడియా కు తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్పీ వివరాలు తెలుపుతూ గత వారం రోజుల క్రితం మండలానికి చెందిన ఒక రైతు ఏసీబీ కి ఫోన్ చేసి నా పత్తి అమ్ముటకు టిఆర్ ఇవ్వడానికి వ్యవసాయ అధికారి ముప్పై వేలు లంచం అడుగుతున్నారని ఫిర్యాదు చేశారని ఆ మేరకు వలపన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామన్నారు. ఫిర్యాదు దారుని వివరాలు మీడియావారు అడుగగా రైతుపేరు వెల్లడించలేమన్నారుఏఓ ని అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరు పరుస్తామన్నారు. ఎవరైనా ప్రభుత్వ అధికారులు లంచాలు అడిగితే బాధితులు టోల్ ఫ్రీ నెంబర్ 1064 తెలపాలని సూచించారు. ఈ రైడింగ్ లో డిఎస్పీ తో పాటు ఇన్స్పెక్టర్ లు శేఖర్, సట్ల రాజు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ అధ్యాపకులకు పిహెచ్‌డికి మరొక అవకాశం ఇవ్వాలి

## ఒయు విసికి టిజిసిటిఎ విజ్ఞప్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ లెక్చరర్లకు పీహెచ్‌డీ సమర్పణకు మరొక అవకాశం కల్పించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం (టీజీసీటీఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్‌కు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఇ బ్రిజేష్ గురువారం వినతిపత్రం సమర్పించారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్, చైర్‌పర్సన్ డాక్టర్ సౌందర్య జోసెఫ్ వీసీని కలిశారు. పలు సమస్యలను వీసీ దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథ సమర్పణకు మరొక అవకాశం కల్పించాలన్నారు. డిగ్రీ లెక్చరర్లకు ఉన్నటు వంటి పరిశోధన అభిరుచి మేరకు, వారి వృత్తి ప్రగతి కోసం విశ్వవిద్యా లయం ఇచ్చినటువంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ సెలవు దినాల్లో, కళాశాల పని వేళలు మినహా ఖాళీ సమయాల్లో తమ పరిశోధనను కొనసాగిస్తున్నారన్నారు. ప్రస్తుతం కొన సాగుతున్న సిబిసిఎస్ సెమిస్టర్ పద్ధతి వలన విద్యాసంవత్సరంలో పూర్తి సమయం కళాశాలకే అంకితం కావడం తమ పరిశోధనా ప్రగతికి ఒక అడ్డంకిగా మారిందన్నారు. జాతీయ స్థాయిలో విద్యాసంస్థలను నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) మూల్యాంకనంచేసి కళాశాలలకు గ్రేడులు అందిస్తుందన్నారు. అత్యంత ఉన్నత డిగ్రీ అయిన పీహెచ్‌డీ వలన బహుళ ప్రయోజనాలు ఉన్నందున.. యూనివర్సిటీ అధికారులు తమ పరిశోధనలను గుర్తించి తమ పని వేళలను అవరోధాలను దృష్టిలో ఉంచుకొని పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథ సమర్పణకు మరొకసారి అవకాశం కల్పించాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ కాలే జ్ లెక్చరర్లకు కేటగిరీ-3లో పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పించాలని కోరారు.

# జీవవైవిధ్య సదస్సులో అందరూ భాగస్వామ్యం కావాలి

## బయోడైవర్సిటీ సదస్సులో మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** దెబ్బ తింటోన్న జీవవైవిధ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. గురువారం రంగారెడ్డి జిల్లా కన్హ శాంతి వనంలో తెలంగాణ బయోడైవర్సిటీ బోర్డు ఏర్పాటు చేసిన నేషనల్ బయోడైవర్సిటీ కాన్ఫరెన్స్ 2025 పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...మన పర్యావరణం, నీరు, భూ పరిరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు.. జీవవైవిధ్య పరిరక్షణ దిశగా సంరక్షణ, పరిశోధన, అధ్యయన రంగాలకు ఉపయుక్తంగా ఈ జీవవైవిధ్య సదస్సు ఉపయోగపడుందని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యార్థులు, యువ సైంటిస్టులకు జీవ వైవిధ్యం కోసం పని చేయాలన్నారు. తెలంగాణ ఎన్నో విధాలైన సహజమై ప్రాంతాలకు నెలవు, అడవులు, పచ్చిక బయళ్ళు, తడి నేలలు, వృక్షాలు, జంతువులు మన ప్రాంతంలో ఉన్నాయని జీవవైవిధ్యం పర్యావరణ సమతుల్యతను సంరక్షించడం మన బాధ్యత అని అందుకోసం సమిష్టి కృషి జరగాలని ఆకాంక్షించారు.

పపంచవ్యాప్తంగా మానవ తప్పిదం వల్ల మొక్కలు, జంతువులు అంతరించిపోయే దశలో ఉన్నాయన్న ఆమె వాటి సంరక్షణ కోసం మానవులుగా మనమే కృషి చేయాలన్నారు. ఒక జాతి అంతరిస్తే దానిలోని జన్యుసంపద అంతరించినట్లే అన్న మంత్రి జీవ వైవిధ్యపు నిజ మైన విలువంతా జన్యువుల్లో నిక్షిప్తమై ఉంటుందన్నారు. మన దేశంలో రాష్ట్ర ప్రభుత్వాలు, చాలా సంస్థలు జీవవైవిధ్య సంరక్షణ లోనూ దాన్ని ప్రతిభావవంతంగా వినియోగించడం లోనూ నిమగ్నమై ఉన్నాయన్నారు.

### మన మన్యంకొండ విడియో ఆవిష్కరణ

మహబూబ్ నగర్ జిల్లాలో కొలువై ఉన్న మన్యం కొండ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి జాతర విశిష్టత, ప్రాశస్త్యత గురించి ప్రత్యేకంగా రూపకల్పన చేసిన వీడియోను తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గురువారం సచివాలయంలోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..సమాజం ఉత్తమ విలువలతో ముందుకు సాగాలంటే, ధార్మిక చింతన కలిగించే ఇటువంటి చిత్రాలు మరిన్ని రావాల్సి న అవసరం ఉందని ఆమె ఆకాంక్షించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా దేవాదాయ శాఖ మన తెలంగాణ ఆలయాల అభివృద్ధికి ఎన్నో చర్యలు చేపట్టిందని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. అందుకు ఆలయాల సందర్శనకు పెరుగుతున్న జన సందోహమే నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. మన తెలంగాణ రాష్ట్రంలో ఎన్నెన్నో అద్భుతమైన ఆలయాలు ఉన్నాయని, వాటి వైభవోపేతమైన చరిత్రను, స్థల పురాణాన్ని, ప్రజల విశ్వాసాలను అందరికీ చేరేలాగా ప్రచారం జరగాలని అందుకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. అనంతరం దర్శకుడు అల్లాణి శ్రీధర్ మాట్లాడుతూ.. ఎంతో బిజీగా ఉన్నా ఈ వీడియో ఆవిష్కరణకి సమయం ఇచ్చి ప్రోత్సహించినందుకు ఆయన మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. దేవాలయాలపై ఎంతో శ్రమకోర్చి వీడియో తీసిని శ్రీధర్ ను మంత్రి సురేఖ ప్రత్యేకంగా అభినందించి ఆయనను శాలువాతో సత్కరించారు.

# తెలంగాణలో హత్యారాజకీయాలకు తావు లేదు

## అవినీతిపై పోరాడే వారికి రక్షణ కల్పిస్తాం

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి




గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** తెలంగాణలో హత్య రాజకీయాలకు తావు లేదని, అవినీతి మీద పోరాడే వారికి రక్షణ కల్పిస్తాం అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాజలింగమూర్తి హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టిఆర్ఎస్ పదేండ్లలో హత్యా రాజకీయాన్ని పెంచి పోషించిందని, బిఆర్ఎస్ దోపిడీని ప్రశ్నించిన రాజలింగాన్ని హత్య చేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కెసిఆర్‌తో పాటు ఐదుగురుపై సామాజిక కార్యకర్త రాజలింగం కోర్టులో కేసు వేశాడన్నారు. ఈ నేపథ్యంలో గండ్ర వెంకట రమణారెడ్డి హత్య చే యించాడన్నారు. కాళేశ్వరంలో కెసిఆర్‌కు దోషిగా శిక్ష పడుతుందని కెసిఆర్, కెటిఆర్‌లు హత్య చేయించారని రాజ లింగమూర్తి కూతురు, భార్య చెప్తుందన్నారు. అడ్వకేట్ వామనరావు భార్యభర్తల హత్యకు ఎవరు కారణమో అందరికి తెలుసునన్నారు. వరంగల్‌లో ఎంపిడిఓను హత్య బిఆర్ఎస్ వాళ్ళు చేశారని అప్పటి సిపి రంగనాథ్ చెప్పారన్నారు. కొడంగల్‌లో సాక్షాత్తు జిల్లా కలెక్టర్‌పై కూడా సురేష్ అనే రౌడీ షీటర్ దాడి చేశారన్నారు. తెలంగాణలో అభివృద్ధి జరగొద్దు అనేది బిఆర్ఎస్ లక్ష్యం అన్నారు. కెసిఆర్ కాంగ్రెస్ గ్రాఫ్ తగ్గిందని అంటుండని, హత్య రాజకీయాలు చేయడమేనా మీ గ్రాఫ్ కెసిఆర్? కెసిఆర్ కిరాయి హత్యలు చేయించడమే తప్ప కెసిఆర్‌తో ఏమి కాదు అన్నారు. 15నెలల నుండి ఫాంహౌస్ నుండి ఎప్పుడైనా బయటకి వచ్చిండా? అన్నారు. రాజలింగమూర్తి హత్యను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని కోరుతున్నామన్నారు. హత్యలో కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావు, గండ్ర వెంకటరమణ రెడ్డి పాత్ర ఉందన్నారు. సిబిసిఐడి విచారణ చేసి 24 గంటల్లోనే నిందితులను అరెస్ట్ చేయాలన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ఏర్పాటు చేసి వెంటనే శిక్ష వేయాలన్నారు. హత్యను సిఎం రేవంత్‌రెడ్డి కూడా సీరియస్‌గా తీసుకుంటాడని అన్నారు. లగచర్లలో కూడా కలెక్టర్‌ను చంపాలని చూసిండని, తెలంగాణను దోచుకొని తిని ఎదురు తిరిగిన వాళ్ళను చంపేస్తారా? పాపం తగిలి పోతారన్నారు.

# విద్యార్థి పోరాటాలు మార్గదర్శకం కావాలి

## 50 యేళ్ల విప్లవ విద్యార్థి ఉద్యమం ప్రస్థానం సదస్సులో ప్రొ.హరగోపాల్




కార్యక్రమంలో పాల్గొన్న ప్రొ. హరగోపాల్, ప్రొ. జగన్ సింగ్ తదితరులు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ఒక అధ్యాపకుడిగా కొనసాగుతూనే రాడికల్స్ విద్యార్థుల నుంచి ఎంతో నేర్చుకున్నానని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ప్రస్తుత సంక్షోభ కాలంలో మనుషులు మిగలడమే ఒక సవాలుగా మారిందని ప్రొఫెసర్ హరగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం బాగ్ లింగం పల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పూర్వ విప్లవ విద్యార్థులు 50 ఏళ్ల విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానం పై రెండు రోజుల సదస్సు ప్రారంభమైంది. మొదటి రోజు సభలో పాల్గొన్న ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ రాడికల్స్ విద్యార్థులు తన విద్యార్థులని చెప్పేందుకు చాలా గర్వంగా ఉందన్నారు. అధ్యాపక జీవితంలో మధురమైన క్షణాలు ఉన్నాయంటే అవి విద్యార్థులు చేసిన పోరాటాలన్నారు. వాళ్ళంతా వివిధ అంశాలపట్ల కూడా అపరిమిత జ్ఞానాన్ని కలిగి ఉండేవారన్నారు. త్యాగాలు చేసేవాళ్ళు భవిష్యత్తు తరంకోసమే చేస్తారన్నారు. భగత్‌సింగ్ జ్ఞాపకాలను పదిలం చేస్తూ ఆయన మేనల్లుడు ప్రొఫెసర్ జగన్మో హన్‌సింగ్ గ్రంథా లయాన్ని ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో 70, 80ల కాలం నాటి విద్యార్థి పోరాటాలు సమాజానికి మార్గదర్శకం కావాలని అన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ జగన్ సింగ్ మాట్లాడుతూ నేడు దేశంలోని బి జె పి పాలనలో ప్రజలకు మేలు జరగడం లేదని, ఫలితంగా దోపిడీ హింస దౌర్జన్యాలు పెరుగుతున్నాయన్నారు. ఇవి నిర్మూలించాలంటే సమాజంలో విప్లవం రావాల్సి న అవసరంతో పాటు ఐక్య ఉద్యమాలు అవసరమన్నారు. 1920లో దేశంలో ఎటువంటి ఆర్థిక సంక్షోభం ఉండేదో ఇప్పుడు కూడా అదే పరిస్థితి నెలకొందని, నాడు భగత్ సింగ్ విప్లవోద్యమాలను నిర్మించి దేశాన్ని సమర్థం చేశారని, అలాగే రాడికల్ స్టూడెంట్స్ కూడా ఉద్యమాలు నిర్మించి ప్రజలను జాగృతం చేశారన్నారు. నాటి విద్యార్థి పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని నేడు వాటిని ముందుకు తీసుకుపోవాలని సూరపనేని జనార్ధన్ సోదరుడు మోహన్ రావు అన్నారు. ఆర్ఎస్‌యు విద్యార్థులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పడానికే నేను మార్క్సిజాన్ని చదువుకున్నానని ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే అన్నారు. 80వ దశకంలో తరగతి గదిలో విద్యార్థులకు ప్రొఫెసర్లకు మధ్య చర్చ జరిగేదని, ఇప్పుడు అలాంటి వాతావరణం లేదని అన్నారు. నాటి విద్యార్థులు విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించేందుకు నిరంతరం కృషి చేసేవారన్నారు. నేడు ఆ పరిస్థితి ఎక్కడ కనిపించడం లేదన్నారు. విలువలు మృగ్యమైన ప్రస్తుత సమాజంలో మానవీయ విలువలను నిలబెట్టడం ఎలా అనేది మన ముందున్న ప్రశ్న అని అన్నారు. అంతకు ముందు అమరవీరుల జెండాను పులి అంజయ్య మాతృమూర్తి సోమ నరసమ్మ, స్నూపాన్ని ఆజాద్ (చెరుకూరి రాజ్‌కుమార్) సహచరి పద్మ ఆవిష్కరించారు. సుందరయ్య విజ్ఞానకేంద్రం ఎదుట విద్యార్థి అమరులకు పూర్వ విద్యార్థులు, పలువురు ప్రజా సంఘాల నాయకులు నివాళులఉ అర్పించారు. విద్యార్థి అమరవీరుల ఆశయాలను కొన సాగిస్తాం, విప్లవ విద్యార్థి అమరులకు జోహార్లు, జోహార్ అంటూ విప్లవగేయాలు, నినాదాలతో సుందరయ్య విజ్ఞానకేంద్రం మారుమ్రోగింది.

# చేనేత కార్మికులకు కనీస వేతనాలు పెంచాలి

## మంత్రి తుమ్మలకు కార్మిక సంఘం విజ్ఞప్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని చేనేత కార్మికులకి కనీస వేతనాలను పెంచాలని చేనేత కార్మికం సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు చేనేత కార్మికం సంఘం నేతలు గురువారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి విజ్ఞప్తి చేశారు. చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు గురువారం సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చేనేత సమస్యల పరిష్కారం కోసం చేనేత కార్మిక సంఘం పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో కమిషనర్ శైలజా రామయ్యర్, టెస్కో ఎండీ అశోక్ పాల్గొనగా.. చేనేత కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు చెరుపల్లి సీతారాములు, అధ్యక్షులు వనం శాంతి కుమార్, ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా చేనేత కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని అధికారులను మంత్రి ఆదేశించారని సంఘం నాయకులు తెలిపారు. త్రిఫ్ట్ పథకంలో కార్మికుల వేతనాలపై 8 శాతం జమ చేయాలని కోరగా తప్పనిసరి అయితే చేస్తామన్నారని.. చేనేత కార్మికుల ఇతర ఋణాలు మార్చిలో రద్దు చేస్తామన్నారని తెలిపారు. చేనేత సహకార సంఘాలలో మగ్గం నేస్తున్న కార్మికులను సభ్యులుగా చేర్చుకోవాలన్నారు. మంచిగా నడిచే సహకార సంఘాలు 190 వరకు ఉండొచ్చని.. వాటికి ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి చెప్పారని అన్నారు. అలాగే 51 జీవో ఎంక్వైరీలో ఉన్న సంఘాలను ఏండ్ల కొద్దీ కాకుండా త్వరగా తెల్చాలని కోరామన్నారు. రాష్ట్రంలోని చేనేత కార్మికుల ఉపాధి సంక్షేమం కోసం హ్యాండ్లూమ్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి.. దానికి బడ్జెట్ కేటాయించాలని కోరగా పరిశీలించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారని సంఘం నాయకులు తెలిపారు.




ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ తెలంగాణ అధికార ప్రతినిధి జెవి.చలపతిరావు

# కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలుచేయాలి : సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ

**హైదరాబాద్ (ధర్నాచౌక్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను తక్షణమే అమలుచేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ తెలంగాణ అధికార ప్రతినిధి జే.వి.చలపతిరావు డిమాండ్ చేశారు. గురు వారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కు నుండి ఇందిరాపార్కు వరకు రేవంత్ సర్కార్ ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారంటీలను, ఏడవ గ్యారంటీ ప్రజాపాలనను అమలుచేయాలని కోరుతూ కవాతు నిర్వహించారు. అనంతరం ధర్నాచౌక్‌లో నిర్వహించిన మహాధర్నాను జేవీ చలపతిరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలుచేసి, ప్రజాస్వామిక హక్కులను, స్వేచ్ఛను కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రకమిటీ సభ్యులు సాధినేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 15నెలల కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయటంలో రేవంత్ సర్కార్ విఫలమయిందని ఆరోపించారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు ఆవునూరి మధు, కే.గోవర్ధన్, ఏఐకేఎంఎస్ నాయకులు వి.కోటేశ్వరరావు, పీఓడబ్ల్యూ నాయకులు ఝాన్సీ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే గోపీనాథ్‌కు అనారోగ్యం.. ఆస్పత్రిలో చేరిక

**హైదరాబాద్ (పంజగుట్ట), ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ బిఆర్ఎస్ ఎమ్మెల్యేమాగంటి గోపీనాథ్ ఆరోగ్యం బాగాలేకపోవడంతో కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారని సమాచారం. మాగంటి గోపీనాథ్ గతకొద్ది రోజులుగా కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్నారని ఆయన వర్గీయులు అంటు న్నారు. దీంతో గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రిలో చేరిన ఆయన చికిత్స తీసుకుం టున్నారని తెలిసింది. అయితే, గోపీనాథ్ ఆరోగ్య పరిస్థితి విషయంలో ఎలాంటి సమాచారం లేదు.. గత నాలుగు రోజుల నుంచి ఆయన ఆసుపత్రిలోనే ఉన్నా రని సమాచారం.. దీనిపై ఆయన కుటుంబ సభ్యుల నుండి కానీ పార్టీ వర్గాల నుంచి కానీ ఎలాంటి సమాచారం అందుబాటులోకి రాలేదు.

## కండరాల వ్యాధితో బాధపడుతున్న యువకుడికి ఉచితంగా వైద్యం అందించాలి

### చార్జింగ్ వాహనం కూడా..: సిఎం ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 20:** కండరాల వ్యాధితో బాధపడుతూ వైద్యం చేయించుకోలేకపోతున్న నిరుపేద యువకుడు రాకేష్ గురించి తెలుసుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చలించిపోయారు. తక్షణమే రాకేష్‌కు కావాల్సిన వైద్య సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఉచితంగా వైద్యం అందించడంతో పాటు రాకేష్ కోసం ఛార్జింగ్ వాహనాన్ని కూడా అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు రాకేష్ కుటుంబీకులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా ఆదుకుంటామని సీఎం తరఫున హామీ ఇచ్చారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్య పల్లి గ్రామానికి చెందిన గూళ్ల రాకేష్ చాలా కాలం నుండి మస్కులర్ డిస్ట్రోఫీ అనే కండరాల వ్యాధితో బాధపడుతున్నారు. ఇటీవల వ్యాధి తీవ్రత పెరగడంతో నడవలేని పరిస్థితికి వచ్చారు. అయితే రాకేష్‌కు ఆరోగ్యం మెరుగు కావాలంటే ఖరీదైన ఇంజక్షన్లను క్రమం తప్పకుండా ఇవ్వాలని వైద్యులు సూచించారు. పేదరికంలో ఉన్న రాకేష్ కుటుంబం ఖరీదైన వైద్యం చేయించలేకపోతుండగా, పత్రికలో వచ్చిన కథనాన్ని చూసి సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించారు. ములకనూరులోని ఓ ప్రైవేటు కాలేజీలో రాకేష్ ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. స్వగ్రామం నుంచి ములకనూరు వెళ్లి రావడానికి ఛార్జింగ్ వెహికల్‌ను కూడా ప్రభుత్వం అందించనున్నది. తమ బిడ్డను ఆదుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాకేష్ తల్లిదండ్రులు గూళ్ల సమ్మయ్య, లక్ష్మి ధన్యవాదాలు తెలిపారు.



## విద్య కేంద్రం గుత్తాధిపత్యం కాదు..

### కొత్త యుజిసి నిబంధనలు సమంజసం కాదన్న డి.సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 20:** మీరు బిల్లు చెల్లించాలి కానీ ఫుడ్ ఆర్డర్ చేయలేరు అన్న తరహాలో యుజిసి కొత్త నిబంధనలు ఉన్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గురువారం కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో స్థానిక రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జాతీయ ఉన్నత విద్య సమ్మేళనంలో ప్రసంగించారు. ఈ సమ్మేళనంలో యూజీసీ ముసాయిదా నిబంధనల ప్రభావం, రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి, తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగంలో చేపట్టిన కార్యక్రమాల గురించి ముందుగా ప్రసంగించి.. ఆ తర్వాత పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వైస్ ఛాన్సలర్ల నియామకాల నుంచి అడ్మిషన్ల వరకు కీలకమైన నిర్ణయాల్లో రాష్ట్ర ప్రభుత్వ పాత్రను కేంద్రం తొలగిస్తున్నదని, ఇది కొనసాగితే రాష్ట్రాలు భవనాలు ప్రారంభించే రిబ్బన్ కటింగ్ అధికారానికి మాత్రమే పరిమితమవుతాయని పేర్కొన్నారు. విద్య కేంద్రం గుత్తాధిపత్యం కాదు ఇది ఉమ్మడి జాబితాలోని అంశం, ఆయా రాష్ట్రాలు వారి ప్రజలకు, వ్యవస్థలకు సరిపోయే విద్యాసంస్థలను, వ్యవస్థలను నిర్మించుకుంటారని, ఒక రాష్ట్రానికి మరో రాష్ట్రానికి పోలిక ఉండదు అన్నారు. స్వయం ప్రతిపత్తి లేకుండా నాణ్యమైన విద్యను ఏ రాష్ట్రము అందించలేదన్నారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న అంశాన్ని చర్చలకు పరిమితం కాకుండా అంతా కలిసి నొక్కి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రాలు ఒక ఉమ్మడి లక్ష్యంతో ఐక్యమైనప్పుడు కేంద్రం తప్పక వినాలి అన్నారు. రాష్ట్రాలు కేవలం పరిపాలన విభాగాలుగా మాత్రమే కాదు అవి ఈ దేశ పురోగతికి జీవనాడి వంటివి అన్నారు. సమ్మేళనలో కేరళ సీఎం. పినరయి విజయన్, కేరళ ఉన్నత విద్య శాఖ మంత్రి ఆర్. బిందు, కర్ణాటక మంత్రి ఎం.సీ. సుధాకర్ అవారే, తమిళనాడు నుంచి తిరుగోవి చేజియాన్, పంజాబ్ నుండి సర్దార్ హారోజ్ సింగ్‌తోపాటు ప్రముఖ విద్యావేత్తలు పాల్గొన్నారు.

## వేములవాడలో భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడండి: మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో జరిగే మహాశివరాత్రి వేడుకలకు రావాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖని ఆహ్వానించారు. ఎండోన్‌మెంట్ ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, కమిషనర్ శ్రీధర్, అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రసాదం అందజేయగా, అర్చకులు వేదాశీర్వచనం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ... వేములవాడు రాజరాజేశ్వర స్వామివారి జాతరలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భక్తులకు అవసరమైన సౌలతులు కల్పించాలని సూచించారు. భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో ఎక్కడా రాజీ పడొద్దని సూచించారు.

## సింగరేణిలో ఈ యేడాది 4 బొగ్గు గనుల మూసివేత

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** సింగరేణి సంస్థలో బొగ్గు నిల్వలు క్రమంగా తరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే నిల్వలు నిండుకున్న గనులను మూసివేయాలని యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విధంగా రాబోయే 17 ఏళ్లలో సింగరేణి భూగర్భ గనుల సంఖ్య 19కు తగ్గిపోయే అవకాశం ఉన్నట్లు సంస్థ యాజమాన్యం అంచనా వేసింది. ఇక ఈ ఏడాది నుంచే సింగరేణి బొగ్గు గనుల మూసివేత కొనసాగుతుంది. బొగ్గు ఉత్పత్తిలో మేటిగా ఉన్న సింగరేణి సంస్థకు బొగ్గు నిక్షేపాలు తగ్గిపోవడం వల్ల భవిష్యత్తులో బొగ్గు గనులు దొరకడమే కష్టంగా మారిపోనుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

## అత్యాశతోనే కెసిఆర్ పార్టీ పేరు మార్చారు

### కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అత్యాశ తోనే పార్టీ పేరు మార్చాడని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రగతిభవన్ కట్టించి ఎవరిని లోపలికి రానివ్వలేదన్నారు. కానీ రేవంత్ ముఖ్యమంత్రి అయ్యాక దాన్ని ప్రజాభవన్ చేశారని అన్నారు. బిఆర్ఎస్ పార్టీలోనే కెసిఆర్ గ్రాఫ్ పడిపోయిందన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లకు నేడే శ్రీకారం

### నారాయణపేట జిల్లా అప్పక్‌పల్లిలో పథకానికి శంకుస్థాపన

### నేడు జిల్లాలో పర్యటించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న క్రిస్టినా, నరసింహారెడ్డి, హరీశ్, నారాయణపేట కలెక్టర్, ఎస్పీ

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ సర్కార్ మరో శుభవార్త తెలిపింది. ఈ గుడ్‌న్యూస్‌కు మరోమారు పాలమూరు వేదిక కానున్నది. హామీల్లో అత్యంత కీలకమైనది ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శుక్రవారం సీఎం శ్రీకారం చుట్టనున్నారు. ఇందిరమ్మ పథకానికి సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం సీఎం నారాయణపేట జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా నారాయణపేట మండలంలోని అప్పకపల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేసి.. రాష్ట్రంలో మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 72,045 ఇందిరమ్మ ఇండ్లు విడుదల కాగా.. అధికారికంగా శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్ల మంజూరు చేయాలని ప్రభుత్వ లక్ష్యం మేరకు లబ్ధిదారులు స్వంతంగా ఇల్లు కట్టుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల పూర్తి సబ్సిడీతో ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయనుంది.

**సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం నారాయణపేట మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలు చేసేందుకు వస్తున్న సందర్భంగా గురువారం రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ క్రిస్టినా, ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరసింహారెడ్డి, ఐఅండ్‌పిఆర్ కమిషనర్ హరీష్, నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్‌తో కలిసి కలెక్టర్ సిక్తా పట్నాయక్ సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. సింగారం చౌరస్తాలోని హెలిప్యాడ్ స్థలాన్ని, సమీపంలోనే నూతన పెట్రోల్ బంక్, వృత్తి నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని అధికారుల బృందం పరిశీలించారు. అనంతరం మండలంలోని అప్పక్ పల్లి వద్ద సీఎం భూమి పూజ చేసే ఇందిరమ్మ ఇంటి స్థలాన్ని పరిశీలించి ఆ తర్వాత మెడికల్ కళాశాలకు చేరుకొని అక్కడ సీఎం చేతుల మీదుగా జరిగే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల వివరాలను తెలుసుకున్న అధికారులు వాటికి సంబంధించిన ఏర్పాట్లు ఎంతవరకు వచ్చాయని అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**ముఖ్యమంత్రి షెడ్యూలు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం నారాయణపేట జిల్లాలో శుక్రవారం పర్యటించనున్నారు. ఉదయం 11:30 గంటలకు బేగంపేట నుంచి హెలికాప్టర్ లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గంలోని పోలేపల్లి ఎల్లమ్మను దర్శించుకుని పూజలు చేయనున్నారు. మధ్యాహ్నం 12 గంటల 25 నిమిషాలకు తిరిగి ఆయన హెలికాప్టర్ లోనే 12 గంటల 50 నిమిషాల వరకు నారాయణపేట జిల్లా కేంద్రం సింగారం గ్రామానికి చేరుకుంటారు. అక్కడ జిల్లా మహిళా సమాఖ్య ద్వారా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకును ,అప్పక్ పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట 30 నిమిషాల తరువాత ప్రభుత్వ ఆసుపత్రి భవన సముదాయాన్ని ప్రారంభించి, మెడికల్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులతో ముఖ్యమంత్రి ముఖాముఖి మాట్లాడుతారు. వీటితోపాటు మొత్తం 13 అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. అనంతరం నారాయణపేట జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం 2.10గంటలకు నిర్వహించే బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించనున్నారు.

## మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోన్న మోడీ సర్కారు

### ఢిల్లీ సిఎంగా రేఖాగుప్తా బాధ్యతల స్వీకరణ

### మహిళా మోర్చా ఆధ్వర్యంలో సంబురాలు

### హర్షం వ్యక్తం చేసిన రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** దేశంలో మహిళా సాధికారతకు మోడీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి అన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పా రెడ్డి, జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షులు, ఇతర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఢిల్లీ సిఎంగా రేఖాగుప్తా, ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా శిల్పారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. భారతీయ జనతా పార్టీ మహిళా సాధికారతకు కట్టుబడి ఉందనడానికి ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా బాధ్యతలు స్వీకరించడం గొప్ప ఉదాహరణ అని మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి అన్నారు. ఒక మహిళకు సిఎంగా అవకాశం కల్పించడం ద్వారా నరేంద్ర మోడీ పాలనలో మహిళా శక్తికి ప్రాధాన్యత మరోసారి నిరూపితమైందని అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో తెలంగాణలో కూడా బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ పాలనలో మహిళా సాధికారత దిశగా అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారని శిల్పారెడ్డి వెల్లడించారు. నారీశక్తి వందన్ అధినియమం ద్వారా లోక్‌సభ, అసెంబ్లీల్లో 33శాతం మహిళా రిజర్వేషన్లు కల్పించడం చరిత్రాత్మక నిర్ణయమని అన్నారు. 2025-26 కేంద్ర బడ్జెట్‌లో మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖకు రూ.35,000 కోట్లు కేటాయించడంతో పాటు ఉజ్వల యోజన 3.0 ద్వారా మరో 1 కోటి మహిళలకు ఉచిత ఎల్‌పిజి కనెక్షన్లు అందించేలా నిర్ణయం తీసుకోవడం గొప్ప విషయమని పేర్కొన్నారు. 1000 కొత్త మహిళా శక్తి కేంద్రాలు ఏర్పాటు చేసి ఉపాధి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయం అని శిల్పారెడ్డి తెలిపారు. మోడీ ప్రభుత్వంలో మహిళా నాయకత్వానికి విశేష ప్రాధాన్యత ఉందని శిల్పారెడ్డి గుర్తుచేశారు. కేంద్ర కేబినెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పౌర సరఫరాల సహాయ మంత్రి శోభా కరంద్లాజే లాంటి మహిళా లీడర్లు బాధ్యతలు నిర్వహించడం గొప్ప విషయంగా ఆమె పేర్కొన్నారు. తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తే మహిళల అభివృద్ధికి మరిన్ని ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని శిల్పా రెడ్డి స్పష్టం చేశారు. మహిళా సాధికారత, అభివృద్ధి, శక్తివంతమైన నాయకత్వానికి భారతీయ జనతా పార్టీ నిజమైన ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు.

## కరెంట్ షాక్‌తో ముగ్గురు మృతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 20:** కరెంట్ షాక్‌తో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందిన విషాద ఘటన నిజామాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. భూమాతను నమ్ముకుని సేద్యం చేసే ఓ రైతు కుటుంబం కరెంట్ షాక్ కు బలైంది. ఈ సంఘటన గురువారం ఉదయం నిజామాబాద్ జిల్లా పెగడాపల్లి గ్రామ శివారులోని పంట పొలాల్లో జరిగింది. రెంజల్ మండలం సాటాపూర్ గ్రామానికి చెందిన దంపతులు రైతు దంపతులు గంగారం (45), బాలమణి (40)లతో పాటు వారి కొడుకు కిషన్ (22) లు వారి పొలానికి నీరు పడుతుండగా బోరు మోటార్ వద్ద కరెంట్ షాక్ తగిలింది. మొదట గంగారాంకు షాక్ తగలడంతో పక్కనే ఉన్న భార్య బాలమణి భర్తను కాపాడ బోయి ఆమె కూడా కరెంట్ షాక్ కు గురయ్యింది. కొంచెం దూరంలో ఇది గమనించిన కొడుకు పరిగెత్తుకుంటూ వచ్చి తల్లిదండ్రులను కాపాడేందుకు ఇద్దరిని లాగబోయాడు. వెంటనే కొడుకు కూడా షాక్ కు గురికాగా ముగ్గురు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. ఘటనా స్థలాన్ని బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు, ఎస్ఐ మచ్చేందర్ సందర్శించి కేసు నమోదు చేరుకున్నారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఈ ఘటనతో సాటాపూర్ గ్రామంలో విషాదం నెలకొంది.

## వ్యవసాయంలో ఇజ్రాయెల్ టెక్నాలజీ

### వ్యవసాయ మంత్రి తుమ్మలతో ఇజ్రాయెల్ ప్రతినిధుల భేటీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రములో ఇజ్రాయెల్ టెక్నాలజీని ప్రవేశపెట్టడానికి సిద్ధంగా ఉన్నట్లు ఇజ్రాయెల్ కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావుతో గురువారం ఇజ్రాయెల్ కంపెనీ ప్రతినిధులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయరంగంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

ప్రధానంగా స్మార్ట్ అగ్రికల్చర్, ఏ.ఐ సెన్సార్ మరియు ఆటోమేషన్ పద్ధతులు, డిజిటల్ రెయిన్ హార్వెస్టింగ్, గ్రే వాటర్ ట్రీట్ మెంట్ వంటి పద్ధతులను గూర్చి తెలియచేశారు. ఇజ్రాయిల్ మరియు భారతదేశం మధ్య కుదిరిన ఒప్పందం అనుసరించి తెలంగాణలో పైలట్ పద్ధతిలో వ్యవసాయరంగములో వస్తున్న ఆధునిక టెక్నాలజీని మన దగ్గర రైతులకు శిక్షణ ఇచ్చేందుకు, సంస్థ సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా యూనివర్సిటీల మధ్య కూడా ఒప్పందాల ద్వారా ఇజ్రాయెల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలంగాణలో అమలు చేసేందుకు చర్యలు చేపడతామని వెల్లడించారు. దీనిపై స్పందిస్తూ, తాను ఇజ్రాయిల్ దేశంలో పర్యటించినపుడు అప్పటి ముఖ్యమంత్రి ప్రోత్సహాముతో ప్రవేశపెట్టిన డ్రిప్ ఇరిగేషన్ ప్రాచుర్యంలోకి రావడానికి దాదాపు 25 ఏళ్లు పట్టిందన్నారు, అదేవిధంగా కొత్త టెక్నాలజీని ఒడిసిపట్టి, అది రాష్ట్రంలో ప్రవేశపెట్టి రైతులకు సేద్యరంగములో తోడ్పడేందుకు తమ ప్రభుత్వము ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. దీనికి సంబంధించి త్వరలోనే సంబంధిత అధికారులతో పూర్తి స్థాయిలో సమావేశమై, ప్రాజెక్ట్ నివేదికను సమర్పించాల్సిందిగా ఆ ప్రతినిధులకు సూచించారు. ఈ భేటీలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా తదితరులు పాల్గొన్నారు.



## లక్ష దాటిన మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదు

### గాంధీభవన్‌లో సంబురాలు చేసుకున్న మహిళా నేతలు

### ఇది అందరి విజయం: మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ 100150 సభ్యత్వాలు నమోదు అయ్యాయి. దేశంలో అన్నికంటే ఎక్కువగా మహిళా సభ్యత్వాలలో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు, మహిళా నేతలు గురువారం గాంధీభవన్‌లో పెద్దఎత్తున టపాకులు కాల్చి. బ్యాండ్ మేళం మహిళలు ఆడి పాడారు. మహిళా సాధికారితకు పెద్దపీట వేసిన సునీతరావు మహిళలను చైతన్య పరుస్తూ ఏకతాటి వైపు తీసుకువచ్చి దేశంలోనే సభ్యత్వాలలో అగ్ర గ్రామీగా నిలిచిందని పలువురు నేతలు అన్నారు. ఈ సందర్భంగా సునీతారావు మాట్లాడుతూ ఇది తన విజయం కాదని, సభ్యత్వాలు చేసిన ప్రతి ఒక్క చెల్లెలు విజయం అన్నారు. సభ్యత్వ నమోదు వెనుక అందరి కష్టం ఉందన్నారు. ఈరోజు అన్ని రాష్ట్రాల కంటేపై స్థానంలో తెలంగాణ మహిళా కాంగ్రెస్ నిలబడిందన్నారు. మహిళా కాంగ్రెస్ ఈ రోజు రేసుగుర్రాలులాగా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్లు నీలం పద్మ ఆర్ లక్ష్మి, అనురాధ ఇందిర ఎం లక్ష్మి, పార్వతమ్మ సరళ ఉషశ్రీ కవిత. జ్యోతి కృష్ణవేణి అంజలి నిర్మల రెడ్డి లక్ష్మమ్మ కుమారి. పద్మ సుగుణ సుకన్య అపర్ణ రజిత కావ్య. రఫియా. రూప శ్రీలత జాను సుమలత ఆర్గనైజ్ సెక్రెటరీ జిల్లా కమిటీ మెంబర్లు మండల కమిటీ మెంబర్లు బ్లాక్ అధ్యక్షులు పట్టణ అధ్యక్షులు భానులు పాల్గొన్నారు.

## శాశ్వత పరిష్కారంగా ఎస్సీ వర్గీకరణ జరగాలి

### ఉప కులాలన్నీ కమిషన్‌ను కలిసి ఆకాంక్షలను తెలియజేయాలి

### ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ఎస్సీ రిజర్వేషన్ అంశం లోతుగా పరిశీలించేందుకు కమిషన్ గడువు పెంచిన నేపథ్యంలో అన్ని కులాలు అప్రమత్తంగా ఉండి మీకు న్యాయం జరగాల్సిన విషయంపై కమిషన్ ముందుకి తేవాలని 58 కులాల సంఘాల నాయకులకు ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు మందకృకృష్ణ మాదిగ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాశ్వత పరిష్కారంగా ఎసీవర్గీకరణ జరగాలని భవిష్యత్‌లో ఏకులంలో రిజర్వేషన్లు పొందలేదన్న అసంతృప్తి రావద్దన్నారు. ఎస్సీ వర్గీకరణ నివేదిక వచ్చాకనే అసెంబ్లీ సమావేశాలు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కమిషన్ నిత్యం ఎస్సీ కులాలకు అందుబాటులో ఉండి వారి ఆకాంక్షలు తెలుసుకోవాలని సూచించారు. 75 ఏళ్ల తర్వాత జరుగుతున్న ఈప్రక్రియలో ప్రతి కుల సంఘం బాధ్యత ఉందని ఆయా కులాల నాయకులు, మేధావులు అప్రమత్తంగా




ఉండాలన్నారు. 10 తేదీ వరకు గడవు ఉన్నందున ఆ సమయాన్ని సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. ఫలానా వారివల్ల మేము దోపిడీకి గురయ్యమనే పరిస్థితి భవిష్యత్‌లో రాకుండా చూసుకునే బాధ్యత ఆయా కుల సంఘాల నాయకులకు ఉందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీ బి వెంకటేష్ నేత.ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ , సీనియర్ జర్నలిస్ట్ సయ్యద్ ఇస్మాయిల్, మిత్ అయ్యాల్వార్ కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్తన్న , ఎం.ఎస్.పి రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటస్వామి, టీవి నరసింహ దప్పు మల్లికార్జున్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఖజానాకు రూ.1,83,437 కోట్ల రాబడి

### ఈ ఆర్థికంలో అదనంగా మరో రూ.1,474 కోట్ల రుణం

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** మరో నెలలో ముగియనున్న 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర ఖజానాకు జనవరి నాటికి రాబడుల కింద మొత్తం 1,83,437 కోట్ల రూపాయలు సమకూరాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్‌లో పేర్కొన్న రాబడులు 2,74,057 కోట్ల రూపాయలలో ఇది 66.57 శాతంగానే నమోదైంది. ఈసారి అంచనా వేసిన వ్యయం 2,54,431 కోట్ల రూపాయలలో సంక్షేమ పథకాలు, జీత భత్యాలు, వడ్డీ చెల్లింపులు, సబ్సిడీల కోసం జనవరి నాటికి 70.33 శాతం చొప్పున 1,78,947 కోట్ల రూపాయలు మేర వ్యయం చేసింది. ఈమేరకు రాష్ట్ర ఆదాయ, వ్యయాలకు సంబంధించి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) జనవరి నెల నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికలో వెల్లడించిన వివరాల ప్రకారం తెలంగాణ సర్కార్ ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో అదనంగా మరో 1,474 కోట్ల రూపాయల మేర బహిరంగ మార్కెట్ రుణం తీసుకుంది. ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను తనఖా పెట్టడం ద్వారా రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బహిరంగ మార్కెట్‌లో వేలం పద్ధతిన ఈ రుణాన్ని రాష్ట్ర ప్రభుత్వం సేకరించింది. ఈసారి రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) పెరుగుతుందంటూ కేంద్ర ప్రభుత్వానికి వివరించి, ఈ అదనపు రుణం తీసుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అంచనా వేసిన మార్కెట్ రుణాల కంటే అదనంగా రూ.1,474 కోట్లను అప్పుగా తీసుకున్నట్లు తేలింది. 202425 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం రూ.57,122 కోట్ల మార్కెట్ రుణాలు తీసుకుంటామని అంచనా వేసింది. ఇవి కాకుండా జీఎసటీ పరిహారం కింద మరో రూ.3,900 కోట్ల రుణాన్ని రాష్ట్రానికి ఇస్తామని కేంద్రం ప్రకటించింది. ఇతర రుణాల కింద రూ.1000 కోట్లను తీసుకుంటామని రాష్ట్రం బడ్జెట్‌లో తెలిపింది. ఇలా మొత్తం రూ.62,012 కోట్ల రుణాలు వస్తాయని తెలిపింది.

## హైదరాబాద్‌లో అద్దె కార్ల కుంభకోణం

### సాఫ్ట్‌చోరీలకు పాల్పడుతున్న బడాచోరులు

### అద్దె చెల్లింపులు ఎగ్గొట్టి పరారవుతున్న వైనం



మోసగాడిని అరెస్ట్ చేసి విచారిస్తున్న పోలీసులు

**హైదరాబాద్ (జగద్గిరిగుట్ట), ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** బడా దొంగలు సాఫ్ట్ చోరీలకు పాల్పడుతున్నారు. నయా మోసాలను ఎంచుకుంటూ మార్కెట్ లో జనాలకు నిద్దర లేకుండా చేస్తున్నారు. బాలానగర్ డీసీపీ కె. సురేష్ కుమార్ విలేకరులతో తెలిపిన వివరాల ప్రకారం సిఆర్. నం. 86/2025, యు/ఎస్ 318(4), 316(2), 351(2) బిఎన్ఎస్ ఆఫ్ పిఎస్ జగద్గిరిగుట్ట. సిఆర్. నం. 90/2025, యు/ఎస్ 318(4), 316(2), 351(2) బిఎన్ఎస్ ఆఫ్ పిఎస్ జగద్గిరిగుట్ట, సిఆర్. నం. 101/2025, యు/ఎస్ 318(4), 316(2) బిఎన్ఎస్ ఆఫ్ పిఎస్ జగద్గిరిగుట్ట. ఈ కేసు 27.01.2025 ముందు 19:20 గంటలకు జగద్గిరిగుట్టలోని దేవేందర్ నగర్‌లో జరిగిందని, అదే రోజున నివేదించబడిందని, ఫిర్యాదుదారుడు శశిధర్ తన కారును యజమాని విశ్వ ఫణీంద్ర ప్రాతినిధ్యం వహిస్తున్న వీవీవీ కార్ టూర్స్, ట్రావెల్స్‌కు 04.11.2024న అద్దెకు ఇచ్చానని, నెలకు రూ. 23,000/ అద్దె మొత్తంతో ఇచ్చానని పేర్కొన్నాడు. విశ్వ ఫణీంద్ర రెండు నెలలుగా చెల్లింపులు చేశాడు. కానీ జనవరి 2025కి చెల్లించడంలో విఫలమయ్యాడని, శశిధర్ తన డబ్బును లేదా తన వాహనాన్ని తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేసినప్పుడు, విశ్వ ఫణీంద్ర వాయిదా వేస్తూనే ఉన్నాడని, తరువాత, 23.01.2025న మధ్యాహ్నం 12:40 గంటలకు, శశిధర్ దేవేందర్ నగర్‌లోని నిందితుడి కార్యాలయాన్ని సందర్శించాడని, కానీ అది మూసివేయబడిందని కనుగొన్న శశిధర్ నిందితులు చెల్లింపులు చేయకుండా బహుళ వాహనాలతో పరారీలో ఉన్నారని, మోసపూరిత కార్యకలాపాలకు సంబంధించి విశ్వ ఫణీంద్రపై చట్టపరమైన చర్య తీసుకోవాలని ఫిర్యాదుదారుడు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. ఈ కేసులో ఏ1 అప్పరి విశ్వ ఫణీంద్ర, జగద్గిరిగుట్ట నివాసి, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం. ఏ2 చివకల రమణ బొంతల వెంకట రమణ (అజ్ఞాతవాసి). ఏ3 జక్కంశెట్టి సత్యనారాయణ (అజ్ఞాతవాసి). ఏ4: రెడ్డి వెంకటేష్ (అజ్ఞాతవాసి). దొంగతనాలకు పాల్పడే విధానం విశ్వ ఫణీంద్ర అనుమతి లేకుండా వీవీవీ కార్స్ టూర్స్ ట్రావెల్స్‌ను నిర్వహించాడు. నెలవారీ అద్దె చెల్లింపులను హామీ ఇచ్చి బాధితులతో వాహన లీజు ఒప్పందాలు కుదుర్చుకున్నాడు. ప్రారంభంలో, అతను రెండు నుండి మూడు నెలలు చెల్లించాడు కానీ తరువాత చెల్లింపులు ఆపివేసాడు. సహచరులతో కుమ్మక్కై, విశ్వ ఫణీంద్ర కొన్ని వాహనాలను తనఖా పెట్టి, మరికొన్నింటిని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ ధరలకు విక్రయించాడు. బాధితులు వారి వాహనాలు లేదా అద్దె చెల్లింపులను డిమాండ్ చేసినప్పుడు, అతను వాటిని తప్పించుకున్నాడని, చివరికి తన కార్యాలయాన్ని మూసివేసి పారిపోయాడని పోలీసులు తెలిపారు.

**దొంగిలించిన వాహనాల వివరాలు**

ఇన్నోవా క్రిస్టా, మారుతి ఎర్టిగా 3, మారుతి స్విఫ్ట్ డిజైర్ 13, మారుతి బ్రీజా 1, మారుతి బాలెనో 1, మారుతి సెలెరియో 1, హోండా 120-1, హోండా అమేజ్ 1, నిస్సాన్ మాగ్నైట్ 2, టాటా టిగోర్ 1, వ్యాగన్ ఆర్ 1, మొత్తం 26, మొత్తం విలువ రూ. 2.5 కోట్లు

**పోలీసులకు ప్రశంసలు**

బాలానగర్ జోన్ డీసీపీ కె. సురేష్ కుమార్ ఐపీఎస్, బాలానగర్ డివిజన్ ఏసీపీ జి. హనుమంత రావుల మార్గదర్శకత్వంలో ఈ కేసును ఎస్హెచ్ఓ కె. నర్సింహా, డిఐ ఎం. అంజయ్య, డిఐ, ఎస్ఐ కె. శంకర్, ఎఎస్ఐ ఎం.వి. రమణ, ఎఎస్ఐ, క్రైమ్ సిబ్బంది జగద్గిరిగుట్ట పిఎస్ కు చెందిన కె. అంజి బాబు (హెచ్ సి), కె. పురందాస్ (హెచ్ సి), కె. నరేష్ కుమార్ (పిసి), చిరంజీవి (పిసి), నరేష్ (పిసి) లతో కలిసి విజయవంతంగా ఛేదించారు. వారి ప్రశంసనీయమైన పనితీరును గుర్తించి తగిన విధంగా రివార్డులు అందిస్తారని డీసీపీ సురేష్ కుమార్ తెలిపారు.

# చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో మణిశర్మ రక్తదానం

తెలుగు చిత్ర పరిశ్రమలో ఎవరెస్ట్ శిఖరం మెగాస్టార్ చిరంజీవి. వెండితెరపై నటనతో పాటు డాన్సులతోనూ అలరించే ఆయన చిరంజీవి ఐ అండ్ బ్లడ్ బ్యాంక్‌ను స్థాపించి తన అభిమానుల సహకారంతో ఎనలేని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోన్న సంగతి తెలిసిందే. చిరంజీవి మానస పుత్రిక అయిన చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో అభిమానులు, సినీ సెలబ్రిటీలు ఎందరో రక్తదానం చేస్తుంటారు. తాజాగా ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ రక్తదానం చేసి చిరంజీవిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఇలా మణిశర్మ రక్తదానం చేయటం ఇది రెండోసారి కావటం విశేషం.



'రక్తదానం'తో లక్షలాది ఆపన్నుల ప్రాణాలు నిలపాలన్న చిరంజీవి ఆశయాన్ని తమ సంకల్పాన్ని భావించి రక్తదానం చేసిన అభిమానులెందరో.. వారిలో తన స్వరాలతో ప్రేక్షకుల్ని మైమరపించే స్వరబ్రహ్మ 'మణిశర్మ' ఒకరు. చిరంజీవి పిలుపును కర్తవ్యంగా భావించి నేడు ఈ మహత్కార్యంలో భాగమై రక్తదానం చేసిన మణిశర్మ మరెందరికో స్ఫూర్తిగా నిలిచారు. పాటలకు స్వరాలు కూర్చడమే కాదు.. మానవత్వానికి చిరునామాగా నిలవడమూ తెలుసునని నిరూపించారు మణిశర్మ. ఈ సందర్భంగా మెలోడీ బ్రహ్మ మణిశర్మ మాట్లాడుతూ "ఎప్పటి నుంచో రక్త దానం చేయాలని అనుకుంటున్నాను. నేను నా సంగీతాన్ని చిరంజీవి సినిమాలకు అందించటం ద్వారా అభిమానాన్ని చాటుకున్నాను. ఇప్పుడు రక్తదానంచేయటం అనేది సంతోషంగా ఉంది. నా వంతు కర్తవ్యంగా భావిస్తున్నాను. లక్షలాది మంది ఇందులో భాగమైయ్యారు. అందులో నేను ఒక బొట్టులాగా ఇప్పుడు చేరాను. ఇలాంటి మంచి కార్యక్రమంలో అందరూ భాగం కావాలి" అన్నారు.

# మహా కుంభమేళాలో 'ఓదెల 2' టీజర్ లాంచ్

తమన్నా భాటియా హైలీ యాంటిసిపేటెడ్ మూవీ ఓదెల 2, ఇది 2021లో హిట్ అయిన ఓదెల రైల్వే స్టేషన్‌కి సీక్వెల్. అశోక్ తేజ దర్శకత్వంలో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్ బ్యానర్స్ పై నిర్మాత డి మధు నిర్మిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. నాగ సాధు పాత్రలో తమన్నా పెరోషియస్, స్టన్నింగ్ పోస్టర్స్ క్యురియాసిటీని పెంచాయి. ఓదెల2 మేకర్స్ ఎక్సయిటింగ్ అప్డేట్‌తో వచ్చారు. ఈ సినిమా టీజర్ ఫిబ్రవరి 22న కాశీ మహా కుంభమేళాలో లాంచ్ చేయనున్నారు. కాశీ మహా కుంభమేళాలో లాంచ్ కానున్న మొట్టమొదటి టీజర్ ఓదెల 2 కావడం విశేషం. ఈ సందర్భంగా మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో కుంభమేళా బ్యాక్ డ్రాప్‌లో నాగసాధుగా కనిపించిన తమన్నా లుక్ డివైన్ వైబ్‌తో పవర్ ఫుల్‌గా వుంది. ఈ చిత్రం కోసం ప్రేక్షకులను అలరించే బ్రెత్ టేకింగ్ స్టంట్స్‌ని పెర్ఫామ్ చేయడానికి తమన్నా భాటియా ఇంటెన్స్ ట్రైనింగ్ తీసుకున్నారు. ఓదెల2 భారీ బడ్జెట్, హై క్యాలిటీ ప్రొడక్షన్ వాల్యూస్‌తో రూపొందిస్తున్నారు. ఈ సినిమా ఓ అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని ఇవ్వబోతోంది. ఎంగేజింగ్ కథనాలతో థ్రిల్లింగ్ యాక్షన్‌ను బ్లెండ్ చేయడంలో పాపులరైన సంపత్ నంది ఈ చిత్రాన్ని సూపర్ విజన్ చేస్తున్నారు. ఓదెల 2కి కాంతార ఫేం అజనీష్ లోక్‌నాథ్ మ్యూజిక్ అందిస్తున్నారు. ప్రముఖ డీవోపీ సౌందర్‌రాజన్ ఎస్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తారు. ఆర్ట్ డైరెక్షన్ రాజీవ్ నాయర్. డైనమిక్ టెక్నికల్ టీమ్‌తో ఓదెల 2 ఒక మరపురాని సినీ ప్రయాణంగా రూపొందుతోంది. తారాగణం: తమన్నా భాటియా, హెబ్బా పటేల్, వశిష్ట ఎన్ సింహా, యువ, నాగ మహేష్, వంశీ, గగన్ విహారి, సురేందర్ రెడ్డి, భూపాల్, పూజా రెడ్డి, సాంకేతిక సిబ్బంది: నిర్మాత: డి మధు, క్రియేటెడ్ బై: సంపత్ నంది.



బ్యానర్లు: మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్ దర్శకత్వం: అశోక్ తేజ, డీవోపీ: సౌందర్ రాజన్ ఎస్., సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, ఆర్ట్ డైరెక్టర్: రాజీవ్ నాయర్ పీఆర్వో: వంశీశేఖర్, మార్కెటింగ్: ఫస్ట్ షో.



# 'శివంగి' స్టన్నింగ్ ఫస్ట్ లుక్

ఆనంది, వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రధాన పాత్రలలో దేవరాజ్ భరణి ధరణ్ దర్శకత్వంలో ఫస్ట్ కాపీ మూవీస్ బ్యానర్‌పై నరేష్ బాబు పి. నిర్మించిన పవర్ ఫుల్ విమెన్ సెంట్రిక్ ఫిల్మ్ శివంగి. జాన్ విజయ్, డాక్టర్ కోయ కిషోర్ కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ని బ్లాక్ బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి లాంచ్ చేశారు. ఈ సినిమా ఎంత పవర్ ఫుల్, సెన్సేషనల్ కథతో వుండబోతోందో ఫస్ట్ లుక్ చూస్తే అర్థమౌతోంది. నల్లలుంగీ, చొక్కాతో కాళ్ళపై కళ్ళు వేసుకొని సోఫాలో డైనమిక్‌గా కూర్చున్న ఆనంది లుక్ స్టన్నింగ్ వుంది. విమెన్ సెంట్రిక్ సినిమాలలో శివంగి గ్రౌండ్ బ్రేకింగ్ కథ స్క్రీన్ ప్లేతో వుండబోతోంది. ఫస్ట్ లుక్ సినిమాపై చాలా క్యురియాసిటీని పెంచింది. ఈ చిత్రానికి ఎ.హెచ్ కాషిఫ్-ఎబినేజర్ పాల్ మ్యూజిక్ అందిస్తున్నారు. భరణి కె ధరన్ డివోపీ గా వర్క్ చేస్తున్నారు. రఘు కులకర్ణి ఆర్ట్ డైరెక్టర్. ఈసినిమా పోస్ట్‌ప్రొడక్షన్ చివరి దశకు చేరుకుంది. మార్చి 7న ఈ సినిమాని రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ తెలియజేశారు. నటీనటులు: ఆనంది, వరలక్ష్మి శరత్‌కుమార్, జాన్ విజయ్, డాక్టర్ కోయ కిషోర్, దర్శకత్వం: దేవరాజ్ భరణి ధరన్, నిర్మాత: నరేష్ బాబు పి, సంగీతం:ఎ.హెచ్ కాషిఫ్ - ఎబినేజర్ పాల్, డీవోపీ: భరణి కె.ధరన్.

# 'స్వప్నాల నావ'.. 'సిరివెన్నెల'కి గొప్ప ట్రిబ్యూట్

మనసంతా నువ్వే, నేనున్నాను వంటి బ్లాక్ బస్టర్ సినిమాలు అందించిన దర్శకులు డా.వి.ఎన్.ఆదిత్య లేటెస్ట్‌గా స్వప్నాల నావ అనే యూట్యూబ్ మ్యూజిక్ వీడియో రూపొందించారు. డల్లాస్‌కి చెందిన ప్రవాసాంధ్రుడు, ప్రముఖ సాఫ్ట్ వేర్ ఇంజినీర్ అయినటువంటి శ్రీ గోపీకృష్ణ కొటారు శ్రీ క్రియేటివ్ మ్యూజిక్ అండ్ ఎంటర్టైన్మెంట్ అనే నిర్మాణ సంస్థను స్థాపించి తొలి ప్రయత్నంగా స్వప్నాల నావ మ్యూజిక్ వీడియోని నిర్మించారు. నిర్మాత గోపికృష్ణ కుమార్తె శ్రీజ కొటారు ఈ పాటను ఆలపించడమే కాకుండా నటించడం కూడా విశేషం. ఇక ఈ స్వప్నాల నావ థీమ్ విషయానికి వస్తే, చదువులో ఒకసారి ఫెయిలయిన విద్యార్థినీ విద్యార్థులను మోటివేట్ చేసే పాట ఇది.. దివంగత స్టార్ లిరిసిస్ట్ అయినటువంటి శ్రీ సిరివెన్నెల సీతారామశాస్త్రి దివ్య స్మృతికి అంకితంగా దీనిని మలిచారు. ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు పార్థసారథి నేమాని సంగీత దర్శకత్వంలో యశ్వంత్ ఆలూరు ఈ పాటకి సాహిత్యం సమకూర్చారు. సిరివెన్నెల సీతారామశాస్త్రి అంటే దర్శకులు డా. వీ.ఎన్.ఆదిత్యకి, నిర్మాత గోపీకి, సంగీత దర్శకుడు పార్థసారథి నేమానికి, గీతరచయిత యశ్వంత్ ఆలూరుకి ఎంతో అభిమానం. వీ.ఎన్.ఆదిత్య సూపర్ హిట్ సినిమా మనసంతా నువ్వేలో కూడా సిరివెన్నెల సింగిల్ కార్డ్ పాటలు రాయడమేకాకుండా, ఈనాటికీ గుర్తుండిపోయే ఓ మంచి పాత్రని కూడా చేశారు. ఇప్పుడు స్వప్నాల నావతో సిరివెన్నెల గొప్పతనాన్ని, ఆయనపై ఉన్న అభిమానాన్ని గొప్పగా చాటి చెప్పారు ఈ టీమ్.



అందుకే ప్రేక్షకుల నుండి స్వప్నాల నావకి విశేషాదరణ లభిస్తోంది. తాజాగా శ్రీ క్రియేటివ్స్ యూ.ఎస్.ఏ.యూట్యూబ్ ఛానల్‌లో రిలీజైన ఈపాటకు 1 మిలియన్ వీక్షణలు (పది లక్షల వ్యూస్) నమోదయ్యాయి. దీంతోమేకర్స్ సంతోషం వ్యక్తంచేస్తూ వీక్షకులకి, మీడియా వారికి, కృతజ్ఞతలు తెలిపారు. ఇక స్వప్నాల నావని వీక్షించిన వాళ్లలో చాలా మంది ప్రేక్షకులు టాలీవుడ్ గర్వించదగ్గ దిగ్గజ రైటర్ కమ్ లిరిసిస్ట్ అయినటువంటి సిరివెన్నెలసీతారామశాస్త్రికి డా.వీ.ఎన్.ఆదిత్య గొప్పట్రిబ్యూట్ ఇచ్చారు అంటూ ఆయన్ని అభినందిస్తున్నారు. ఓ.ఎమ్.జీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ప్రముఖ సినీ నిర్మాత శ్రీమతి మీనాక్షి అనిపిండి దీనికి సమర్పకురాలుగా వ్యవహరించారు. మాస్టర్ టైలన్ అనే చైనా పిల్లవాడు కూడా నటించిన స్వప్నాల నావకు క్రూ: ఛాయా గ్రహణం: బుజ్జి.కె. సహకారం: యూనస్, సహ దర్శకత్వం: ఇర్షాద్, శ్రీహరిదత్త, రాహుల్ తేజ, ఎడిటింగ్: వికాస్, శేషు, స్టైలింగ్: శృతి, నైలో.

# 'శబ్దం' థ్రిల్లింగ్ స్పైన్-చిల్లింగ్ ట్రైలర్

'వైశాలి'తో సూపర్‌హిట్‌ని అందించిన హీరో ఆది పినిశెట్టి, దర్శకుడు అరివళగన్‌లు రెండోసారి మరో ఇంట్రస్టింగ్ సూపర్‌నేచురల్ క్రైమ్ థ్రిల్లర్ 'శబ్దం' కోసం చేతులు కలిపారు. 7జి ఫిల్మ్స్ శివ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. మేకర్స్ 'శబ్దం' ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. 'వెయ్యి గబ్బిలాలు చెవిలో అరుస్తున్నట్లు వుంటుంది డాక్టర్' అనే వాయిస్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం థ్రిల్లింగ్ స్పైన్‌చిల్లింగ్ ఎలిమెంట్స్‌తో కట్టిపడేసింది.

ట్రైలర్ ఆడియో హాలోజినేషన్ కాన్సెప్ట్‌తో ఆడియన్స్‌కి సరికొత్త అనుభూతిని ఇచ్చింది. మేకర్స్ సూపర్ నేచురల్ థ్రిల్లర్‌ని చాలా డిఫరెంట్ ప్రజెంట్ చేశారు. ట్రైలర్ సీట్ ఎడ్జ్ ఎక్స్ పీరియన్స్‌ని ఇచ్చింది. ఆది పినిశెట్టి పారానార్మల్ ఇన్వెస్టిగేటర్ క్యారెక్టర్‌లో తన ఇంటెన్స్ పెర్ఫామెన్స్‌తో ఆకట్టుకున్నారు. లక్ష్మీమీనన్ క్యారెక్టర్ చాలా ఇంట్రస్టింగ్‌గా వుంది. అరుణ్ బత్మ నాభన్ అందించిన విజువల్స్ సినిమాలో లీనమయ్యేలా చేశాయి. ఎస్ థమన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సస్పెన్స్‌ని మరింతగా పెంచుతుంది. జాతీయ అవార్డు గ్రహీత సాబు జోసెఫ్ ఎడిటింగ్ షార్ప్‌గా వుంది. మనోజ్ కుమార్ ఆర్ట్ డైరెక్టర్. 'శబ్దం' ఫిబ్రవరి 28న ఆంధ్రాలో ఎన్ సినిమాస్, నైజాంలో మైత్రి డిస్ట్రిబ్యూషన్ ద్వారా విడుదల కానుంది. టెర్రిఫిక్ ప్రిమైజ్, అద్భుతమైన పెర్ఫామెన్స్, హాంటింగ్ ట్రైలర్‌తో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి. నటీనటులు: ఆది పినిశెట్టి, సిమ్రాన్, లైలా, లక్ష్మీ మీనన్, రెడిన్ కింగ్స్లీ, ఎం.ఎస్.భాస్కర్, రాజీవ్ మీనన్.







# 'జాట్' డబ్బింగ్ ప్రారంభం

బాలీవుడ్ లెజెండ్ సన్నీ డియోల్, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని మోస్ట్ ఎవైటెడ్ మూవీ "జాట్" విడుదలకు సిద్ధమవుతోంది. ప్రతిష్టాత్మక మైత్రి మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్లపై డైనమిక్ ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 10, 2025న థియేటర్లలో విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా డబ్బింగ్‌ని ప్రారంభించారు మేకర్స్. ఇప్పటికే జాట్ టీజర్ అందరినీ ఆకట్టుకొని సినిమా మోస్ట్ బ్లాస్ట్ యాక్షన్ డ్రామాగా వుండబోతోందని హామీ ఇచ్చింది. ఈ చిత్రంలో రణదీప్ హుడా, వినీత్ కుమార్ సింగ్, సయామి ఖేర్, రెజీనా కాసాండ్రా కీలక పాత్రలు పోషిస్తున్నారు. "జాట్" చిత్రానికి సంగీతం థమన్ ఎస్, రిషి పంజాబీ సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్‌ను నిర్వహిస్తున్నారు. అనల్ అరసు, రామ్ లక్ష్మణ్, వెంకట్ కొరియోగ్రఫీ చేసిన యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయని హామీ ఇస్తున్నాయి. ఆడియన్స్ అడ్రినలిన్ రష్‌తో కూడిన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించే జాట్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తారాగణం: సన్నీ డియోల్, రణదీప్ హుడా, వినీత్



కుమార్ సింగ్, సయామి ఖేర్, రెజీనా కసాండ్రా, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: గోపీచంద్ మలినేని, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై రవిశంకర్, టిజి విశ్వ ప్రసాద్, బ్యానర్లు: మైత్రి మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, సంగీతం: థమన్ ఎస్, డిఒపి: రిషి పంజాబీ, ఎడిటర్: నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, సిఇఒ: చెర్రీ, ఎక్జిక్యూటివ్ నిర్మాతలు: బాబా సాయి కుమార్ మామిడిపల్లి, జయ ప్రకాష్ రావు (జేపీ), యాక్షన్ కొరియోగ్రాఫర్: పీటర్ హెయిన్, అన్ల్ అరసు, రామ్ లక్ష్మణ్, వెంకట్, డైలాగ్స్: సౌరభ్ గుప్తా, రైటింగ్ టీం: ఎం వివేక్ ఆనంద్, నిమ్మగడ్డ శ్రీకాంత్, శ్రీనివాస్ గవిరెడ్డి, మయూఖ్ ఆదిత్య కృష్ణ కాస్ట్యూమ్ డిజైనర్లు: భాస్కి (హీరో), రాజేష్ కమర్సు, పబ్లిసిటీ డిజైనర్: గోపి ప్రసన్న, విఎఫ్ఎక్స్: దక్కన్ డ్రీమ్స్, పిఆర్ఒ: వంశీశేఖర్, మార్కెటింగ్: ఫస్ట్ షో.

# ఇకపై మీకు నచ్చే సినిమాలే చేస్తా: విశ్వక్ సేన్

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ ఇటీవలే లైలా మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. రామ్ నారాయణ్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద పెద్దగా రాణించలేకపోయింది. ఈ మూవీలో విశ్వక్ సేన్ లేడీ గెటప్‌లో అభిమానులను అలరించాయి. అయితే ఈ చిత్రం రిలీజ్‌కు ముందే వివాదానికి దారి తీయడంతో కలెక్షన్లపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో బాక్సాఫీస్ వద్ద వసూళ్ల విషయంలో తీవ్రంగా నిరాశపర్చింది. ఈ నేపథ్యంలో హీరో విశ్వక్ సేన్ తాజాగా ఓ లేఖ విడుదల చేశారు. అభిమానులు ఆశించిన స్థాయిలో సినిమాలు చేయలేకపోయానని ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. విశ్వక్ సేన్ తన లేఖలో రాస్తూ, 'అందరికీ నమస్కారం..ఇటీవల నా సినిమాలు అందరూ కోరుకునే స్థాయికి చేరుకోలేకపోయాయి. నా చివరి సినిమాకు వచ్చిన నిర్మాణాత్మక విమర్శలను పూర్తిగా అంగీకరిస్తున్నాను. నన్ను నమ్మి, నా ప్రయాణానికి మద్దతునిచ్చిన నా అభిమానులకు, నాకు ఆశీర్వాదంగా నిలిచిన వారికి హృదయపూర్వక క్షమాపణలు. నా ప్రాధాన్యం ఎప్పుడూ కొత్తదనం తీసుకురావడమే, కానీ ఆ ప్రయత్నంలో మీ అభిప్రాయాలను నేను గౌరవిస్తున్నా. ఇకపై నా ప్రతి సినిమా క్లాస్, మాస్ ఏదైనా సరే అసభ్యత ఉండదు. నేను ఒక చెడు సినిమా తీస్తే, నన్ను విమర్శించే హక్కు మీరు ఉంది. ఎందుకంటే నా ప్రయాణంలో ఎవ్వరూ లేని సమయంలో నన్ను ప్రేమతో ముందుకు నడిపించింది మీరే' అని రాసుకొచ్చారు. అంతేకాకుండా నా కెరీర్ ప్రారంభం నుంచి నేను ఎంచుకున్న కథలను మీరు ఎంతగా ప్రేమించారో తెలుసు. ఇకపై కేవలం సినిమా మాత్రమే కాదు, నా ప్రతి సన్నివేశం కూడా మీ మనసుకు తగిలేలా ఉండాలని నిర్ణయించుకున్నా. అంతేకాకుండా, నా మీద విశ్వాసం ఉంచిన నిర్మాతలు, పంపిణీ దారులందరికీ నాకృతజ్ఞతలు తెలియ చేస్తున్నా. అలాగే నా కథానాయకులు, దర్శకులు, రచయితలు నాకు వెన్నెముకగా నిలిచి, నన్ను మలిచిన ప్రతి ఒక్కరికీ నా హృదయ పూర్వక ధన్యవాదాలు. మీ అందరి నిర్మాణాత్మక విమర్శలకు ధన్యవాదాలు. మీ అందరి నిర్మాణాత్మక విమర్శలకు ధన్యవాదాలు. త్వరలోనే మరో బలమైన కథతో ముందుకు వస్తా. నా మంచి, చెడు కాలాల్లో నన్ను నమ్మిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. మీ మద్దతు నాకు ఎంతో ప్రాముఖ్యం అని ఆ లేఖలో రాశారు.



# 'ఎన్‌టిఆర్ నీల్' షూటింగ్ షురూ

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్‌కు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కె.జి.యఫ్ సిరీస్, సలార్ వంటి చిత్రాలతో బ్లాక్ బస్టర్స్ సాధించిన సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ ఇప్పుడు ఎన్టీఆర్ వంటి మాస్ హీరోతో చేతులు కలిపిన సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ నీల్ పేరుతో గత ఏడాదిలో పూజా కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ మూవీపై అంచనాలు భారీ స్థాయిలో ఉన్నాయి. ఇద్దరు మాస్ ఇమేజ్ ఉన్న స్టార్స్ కాంబోలో రాబోతున్న ఈ మూవీ కోసం అందరూ ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ గురువారం నుంచి రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రారంభమైంది. అందరూ ఆశ్చర్య పోయేలా 3వేల మంది జూనియర్ ఆర్టిస్టులతో భారీ యాక్షన్ ఎపిసోడ్ చిత్రీకరణతో షూటింగ్ మొదలైంది. ఎన్టీఆర్ వచ్చే షెడ్యూల్ నుంచి షూటింగ్‌లో పాల్గొనబోతున్నారు. ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబో ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేస్తుందోనని అందరి కళ్లు ఇప్పుడు ఈ సినిమాపైనే ఉన్నాయి. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ భారీ పాన్ ఇండియా చిత్రం జనవరి 9, 2026లో ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ లెవల్లో విడుదలవుతుంది. ముందుగానే రిలీజ్ డేట్ అనౌన్స్ చేయటంతో అభిమానులతో పాటు సినీ ప్రేక్షకులు సైతం సినిమా షూటింగ్ ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని ఎదురు చూడసాగారు. ఆ సమయం రానే వచ్చేసింది. రానున్న సంక్రాంతి థియేటర్స్‌కు ఈ చిత్రం సరికొత్త పండుగను తీసుకొస్తుందనటంలో సందేహం లేదు. డైరెక్టర్ ప్రశాంత్ నీల్ అంటే బ్లాక్ బస్టర్ చిత్రాలకు కేరాఫ్.. ఆయన ఇప్పుడు ఎన్టీఆర్‌తో తెరకెక్కిస్తోన్న చిత్రాన్ని సరికొత్త మాస్ విజన్‌తో ఆవిష్కరించనున్నారు. ఇప్పటి వరకు తారక్‌ను చూడనటువంటి మాస్ అవతార్‌లో ప్రెజెంట్ చేయనున్నారు. దీంతో వీరిద్దరి క్రేజీ కాంబినేషన్ సరికొత్త బెంచ్ మార్క్‌ను క్రియేట్ చేస్తుందనటంలో సందేహం లేదు. ప్రెస్టీజియస్ బ్యానర్స్ మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ నిర్మాణంలో అన్‌కాంప్రమైజ్డ్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఆడియెన్స్‌కు సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కళ్యాణ్ రామ్, నవీన్ ఎర్నేని, రవి శంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భువన్ గౌడ సినిమాటోగ్రఫీ అందిస్తోన్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. చలపతి ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. ఈ ప్రెస్టీజియస్ మూవీలో ఇంకా టాప్ యాక్టర్స్, టెక్నీషియన్స్ అందరూ భాగమవుతున్నారు. నటీనటులు: మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, సాంకేతిక వర్గం: నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీ: మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్, రచన, దర్శకత్వం: ప్రశాంత్ నీల్, నిర్మాతలు: కళ్యాణ్ రామ్ నందమూరి, నవీన్ ఎర్నేని, రవి శంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు, ప్రొడక్షన్ డిజైన్: చలపతి, సినిమాటోగ్రఫీ: భువన్ గౌడ, సంగీతం: రవి బస్రూర్.



# ఒటిటిలు 'ఎథిక్స్ కోడ్' పాటించాలి




## స్వీయనియంత్రణ సంస్థలు అశ్లీలకంటెంట్ నిషేధించాలి

### కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖ ఆదేశాలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** ఇండియాస్ గాట్ లాటెంట్ కార్యక్రమంలో రణ్‌వీర్ అల్హాబాదియా చేసిన వ్యాఖ్యలు దేశంలో తీవ్ర దుమారంరేపాయి. ఈక్రమంలో ఐటి నిబందనల్లోని కోడ్ ఆఫ్ ఎథిక్స్‌ను ఒటిటిలు, సామాజిక మాద్యమాలు తప్పనిసరిగా పాటించాలనికేంద్రం హెచ్చరించింది. చిన్నారులకు 'ఎ'రేటెడ్ కంటెంట్ అందుబాటులో లేకుండాచూడాలని ఆదేశించింది. సమాచార ప్రసార మంత్రిత్వశాఖ గురువారం ఈ మార్గదర్శకాలు విడుదలచేసింది. ఓటిటి ప్లాట్‌ఫామ్‌లు, సోషల్ మీడియాలోని అశ్లీల అసభ్యకరమైన కంటెంట్‌లపై ఫిర్యాదులు వచ్చాయి. ఐటి నిబంధనల్లోని నైతిక నియమావళిని ఖచ్చితంగా అనుసరించాలని సూచించింది. లేనిపక్షంలో ఆంక్షలు విధించాల్సి ఉంటుందని కూడా ప్రకటించింది. ఆన్‌లైన్ క్యూరెటెడ్ కంటెంట్‌పై సోషల్‌మీడియా తప్పనిసరిగా కేంద్రం చట్టాలను అనుసరించాల్సిందేనని అన్నారు. వయసు ఆధారిత నిబంధనలు విధిగా పాటించాలన్నారు. చట్టంనిషేధించిన కంటెంట్‌ను ప్రసారంచేయ కూడదని నిర్దేశించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల కంటెంట్‌ను రెగ్యులేట్ చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు కేంద్రం స్పందించింది. స్వీయనియంత్రణ ఉన్న ఒటిటిలు నైతిక విలువలుపాటించాలన్నారు. ఐజిఎల్‌లో పాల్గొన్న ఒక వ్యక్తిని తల్లితండ్రుల గురించి శృంగారంపై ప్రశ్నించడంతో ప్రముఖ యూ ట్యూబర్ అల్హాబాదియాపై తీవ్రనిరసనలు వ్యక్తం అయ్యాయి. ఆతడి వ్యాఖ్యలపై పలువురు పార్ల మెంటు సభ్యులుకూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసారు.

సమయ్‌రైనాషోలో రణ్‌వీర్ ఈ వ్యాఖ్యలు చేసారు. దీనితో పలు రాష్ట్రాల్లో ఆతడిపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఇటీవల యూట్యూబర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదయిన ఎఫ్ఐఆర్‌లు అన్నింటినీ క్లబ్‌చేయాలని ఒక పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణలో భాగంగా సుప్రీంకోర్టు అల్హాబాదియా వ్యాఖ్యలపై అసహనం వ్యక్తంచేసింది. అశ్లీల కంటెంట్ నియంత్రించేందుకు చర్యలు తీసుకునే ఆలోచన ఉందా అని సుప్రీం కేంద్రాన్ని స్పందిం చింది. దీనిపై వివరణ ఇవ్వాలని నోటీసులుసైతం జారీచేసింది.



# భారత్‌లో టెస్లా తయారీ అన్యాయమే!

## మస్క్ పక్కన ఉండగానే ట్రంప్ వ్యాఖ్యలు

**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** అమెరికా దిగ్గజ విద్యుత్ కార్ల కంపెనీ టెస్లా భారత్‌మార్కెట్‌లోకి ఎంట్రీకి సిద్ధం అవుతోంది. ఇప్పటికే ఈ సంస్థ నియామకాలు, షోరూంల ఏర్పాటుకోసం ప్రయత్నాలు ప్రారంబించింది. అయితే ఈప్రక్రియ ఎంత మాత్రం ట్రంప్‌కు ఇష్టంలేదు. భారత్‌లో టెస్లా ఫ్యాక్టరీ ఏర్పాటుచేయాలనే టెస్లా అధినేత ఎలాన్‌మస్క్ ప్రణాళిక అమెరికాకు అన్యాయం చేయడమే అని అన్నారు. మస్క్ పక్కన ఉండగానే అమెరికా అధ్యక్షుడు ఈ వ్యాఖ్యలుచేసారు. ఇద్దరూకలిసి ఒక టివి ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. భారత్‌లోకి టెస్లా ఎంట్రీ ప్రణాళికలపై ట్రంప్ మాట్లాడారు. ప్రపంచంలోని ప్రతిదేశం అమెరికాను వాడుకోడానికి ప్రయత్నిస్తోందని, సుంకాలతో మానుంచి లబ్దిపొందాలని చూస్తున్నారని అందువల్లనే ఎలాన్‌మస్క్ తన కార్లను విక్రయించడం అసాధ్యం అవుతోందన్నారు. భారత్‌నే చూడండి ఆయన భారత్‌లో ఫ్యాక్టరీ ఏర్పాటుచేసేందుకు సిద్ధం అవుతున్నారు. ఆయన వరకూ అది మంచిదే కావచ్చు. కానీ అమెరికాపరంగా అది చాలా అన్యాయమైన నిర్ణయమని ట్రంప్ అన్నారు.

గతవారం ప్రధానిమోడీతో భేటీని ట్రంప్ గుర్తుచేసుకున్నారు. ఆ సమావేశంలో విద్యుత్ కార్లపై అధిక సుంకాల విషయాన్ని మోడీతో ప్రస్తావించినట్లు తెలిపారు. సుంకాలసమస్యను పరిష్కరించుకోవడంతోపాటు వీలయినంత సత్వరమే వాణిజ్య ఒప్పందంకోసం ఇరుదేశాలు కలిసి పనిచేసేలా నిర్ణయంచామని అన్నారు. ప్రధాని మోడీ అమెరికా పర్యటనలో టెస్లా అధినేతతో భేటీ అయ్యారు. తర్వాత కొన్నిరోజులకే ఈసంస్థ భారత్‌లో నియామకాలుచేపట్టింది. ఈ ఏడాది ఏప్రిల్‌నుంచే అమ్మకాలు ప్రారంభించనున్నది. అయితే కార్ల తయారీపై మాత్రం టెస్లా నిర్ణయాన్ని ప్రకటించలేదు. భారత ప్రభుత్వం నూతన ఈవీ పాలసీని ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. కార్లతయారీ సంస్థలుదేశంలో కనీసం 500 మిలియన్ డాలర్లుపెట్టుబడి పెట్టడంతో ఇక్కడ ఫ్యాక్టరీని ఏర్పాటుచేస్తే దిగుమతి సుంకాలను 15శాతానికి తగ్గించేవిధంగా కేంద్రం కొత్తవిధానం తెస్తోంది. దీనితో మస్క్ భారత్‌లో టెస్లా తయారీకి సిద్ధం అవుతున్నారు.



### ఒకప్పటి బహిష్కృతనేత

# ఇపుడు ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** దేశరాజధాని ఢిల్లీ అసెంబ్లీలో ఒకప్పుడు అసెంబ్లీ మార్షల్స్ బలవంతంగా ఎత్తుకుని బయటకు తీసుకెళ్లిన వ్యక్తి ఇపుడు అదే ఢిల్లీ అసెంబ్లీకి స్పీకర్ అయ్యారు. రోహిణి ఎమ్మెల్యే విజేందర్‌గుప్తాను పార్టీ స్పీకర్‌గా ఎంపికచేసింది. సుమారు పదేళ్లక్రితం అసెంబ్లీనుంచి ఆయన బహిష్కరణకు గురయ్యారు. ఇందుకు సంబంధించిన పాత వీడియోలు ఇపుడు వైరల్ అవుతున్నాయి. 2015లో ఢిల్లీ అసెంబ్లీలో ఆప్ ఎమ్మెల్యే అల్కాలాంబాపై మరో ఎమ్మెల్యే ఓపీ శర్మ వివాదాస్పద వ్యాఖ్యలుచేసారు. దీనితో సభలో ఒక్కసారిగా ఆందోళనలు చెలరేగాయి. ఇందులోపాల్గొన్న బిజెపి ఎమ్మెల్యే అయిన విజేందర్‌గుప్తాను అప్పటి స్పీకరు ఆరోజు సాయంత్రం నాలుగు గంటలవరకూ సభనుంచి బహిష్కరించారు. అయితే బయటకు వెళ్లేందుకు ఆయన నిరాకరించడంతో మార్షల్స్ గుప్తాను భుజాలపై ఎత్తుకుని అసెంబ్లీనుంచి బయటకు తీసుకెళ్లారు. ఇందుకు సంబంధించిన ఫోటోలను ఆయన అభిమానులు ఇపుడు వైరల్ చేస్తున్నారు. ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా తనను ఎంపికచేయడంపట్ల గుప్తా హర్షంప్రకటించారు. హైకమాండ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### 30 యేళ్ల క్రితం కేసులో

# మహారాష్ట్ర మంత్రికి రెండేళ్ల జైలు..

**ముంబయి, ఫిబ్రవరి 20:** దాదాపు 30 ఏళ్ల క్రితం మోసానికి పాల్పడిన కేసులో ఎన్సీపి నేత, మహారాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి మాణిక్‌రావ్ కొకతేకు కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. మంత్రితో పాటు అతని సోదరుడికి జైలు శిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ నాసిక్ కోర్టు తీర్పు వెలువరించింది. నకిలీ పత్రాలు సృష్టించి, అక్రమాలకు పాల్పడి ప్రభుత్వ కోటాలో ఫ్లాట్‌లు పొందారని మాజీ మంత్రి దివంగత టిఎస్ డిఘాలే అప్పట్లో చేసిన ఫిర్యాదుతో కోకటే సోదరులపై కేసు నమోదైంది. 1995 నాటి ఈ కేసులో మొత్తం 10 మంది సాక్షులను విచారించిన నాసిక్ జిల్లా సెషన్స్ కోర్టు కోకతే సోదరులిద్దరినీ దోషులుగా తేల్చి శిక్షలు విధిస్తూ తీర్పు ఇచ్చింది. మరోవైపు, కోర్టు విచారణకు హాజరైన మంత్రి మాణిక్‌రావ్ మాట్లాడుతూ ఈకేసులో తనకుబెయిల్ మంజూరైందని తెలిపారు. ఈతీర్పుపై అప్పీల్‌కు వెళతానని చెప్పారు.

### జడ్జిలను విచారించే అధికారం తమకు ఉందన్న లోక్‌పాల్‌కు

# సుప్రీం నోటీసులు!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** హైకోర్టు జడ్జిలను విచారించే అధికారం తమకు ఉందంటూ లోక్‌పాల్ జారీచేసిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఆ ఉత్తర్వులు ఆందోళనకర మంటూ ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం, లోక్‌పాల్ రిజిస్ట్రార్‌లకు నోటీసులు పంపింది. హైకోర్టు సిట్టింగ్ అదనపుజడ్జిపై దాఖ లైన రెండు ఫిర్యాదులను లోక్‌పాల్ విచారి స్తోంది. లోకాయుక్త చట్టం 2013 ప్రకారం హైకోర్టు జడ్జిలను విచారించే అధికారం తమకు ఉందంటూ జనవరి 27న ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సుమోటోగా తీసుకుని విచారణ చేపట్టి స్టే విధించింది.

### ముడా కేసులో 8వేల పేజీలతో

# లోకాయుక్త 'బి' రిపోర్టు!

**మైసూరు, ఫిబ్రవరి 20:** మైసూరు పట్టణాభివృద్ధి ప్రాధికారసంస్థ (ముడా) కుంభకోణంపై కర్ణాటక లోకాయుక్త ఎస్పీ టిజె ఉదేశ్ గురువారం ఎనిమిది పేజీల తాత్కాలిక బి రిపోర్టును కోర్టులో దాఖలుచేసారు. లోకాయుక్త అధికారుల బృందం ముడా దర్యాప్తునకు సంబంధించిన పత్రాలు నాలుగు బ్యాగ్‌ల్లో ప్రజాప్రతినిదుల కోర్టుకు తరలించారు. ఎస్పీ ఉదేశ్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం దర్యాప్తు జరుగుతోందన్నారు. కోర్టుకు సమర్పించిన పత్రాలు దర్యాప్తునకు సంబందించిన కీలకమూనవన్నారు. ముడా కుంభకోణం కేసులో సిఎం సిద్ధరామయ్యతోపాటు ఆయన భార్యకు లోకాయుక్త క్లీన్‌చిట్ ఇచ్చింది.

ఈ కుంభకోణంలో ఆరోపణలపై ఆధారాలు లేవని దాంతో కుంభకోణాన్ని నిరూపించలేమని పేర్కొంటూ లోకాయుక్త పోలీసులు సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణకు లేఖరాసారు. ఐపిసి, అవినీతి నిరోధక చట్టం, కర్ణాటక బూసేకరణ చట్టం వంటి అనేక నిబంధనలను లేఖలోప్రస్తావించారు. అక్రమా లకు పాల్పడినట్ల ఎదుర్కొంటున్న సిఎం సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతితోపాటు నలుగురికి వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేవని ఈకేసులో నలుగురు నిందితులపై వచ్చిన ఆరోపణలకు ఆధారాలులేక నిరూపితం కాలేదన్నారు. అభ్యంతరాలు తెలిపేందుకు స్నేహ మయికి వారంరోజులు గడువు ఇస్తున్నట్లు లేఖలో వెల్లడించారు.

కేసులో దర్యాప్తుసాగుతోందన్నారు. కేసులు నలుగురు నింది తులపై చట్టపరమైన చర్యలు సాధ్యంకాదని తుదినివేదికను కోర్టుకు అందించామని ఎస్పీ ఉదేశ్ అన్నారు. లోకా యుక్తపై సామాజిక కార్యకర్త ఫిర్యాదుదారుడు స్నేహ మయి కృష్ణ స్పందించారు. లోకాయుక్తపై ఆయన విమర్శలు కురిపించారు. రాజకీయ నేతలకు రక్షణ కల్పిస్తున్నారన్నారు. లోకా యుక్తపై తనకు సందేహాలునిజమని రుజువు చేసారన్నారు. లోకాయుక్త అధికారులు తమ



ఆత్మలను రాజకీయ నాయకులకు అమ్ముకున్నట్లు వ్యవహరించారని విమర్శించారు. తాను అవసరమైన అన్ని పత్రాలు ఇచ్చినప్పటికీ సిద్ధరామయ్య పార్వతి మల్లిఖార్జనస్వామి దేవరాజ్‌లపై ఎలాంటి ఆధారాలేలేవంటూ బీ రిపోర్టు నుదాఖలుచేయబోతున్నారని ఆరోపించారు.

# జెలెన్‌స్కీ ఒక సక్సెస్‌ఫుల్ కమెడియన్


## ఉక్రెయిన్ అద్యక్షుడిపై ట్రంప్ వ్యాఖ్యలు వైరల్



**వాషింగ్టన్,ఫిబ్రవరి 20:** ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఒక విజయవంతమైన కమెడియన్ అని వ్యాఖ్యానించారు. అంతకుముందే తప్పుడు సమాచారం ఉచ్చులో ట్రంప్ ఉంటున్నారని, తనకు రేటింగ్ తగ్గిందని, ఈసారి ఎన్నికలు లేకుండానే జెలెన్‌స్కీ అధ్యక్షుడు కావాలని కలలు కంటున్నారన్న ట్రూత్‌లో పోస్టుచేసారు. దీనిపై జెలెన్‌స్కీ స్పందిస్తూ రష్యా ఇచ్చిన తప్పుడు సమాచారమే వాస్తవమన్న భ్రమలో ట్రంప్ ఉన్నారని తనకు 57శాతం రేటింగ్ ఉందని ప్రైవేటు ఏజెన్సీలే చెప్పాయని ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ట్రంప్ తప్పుడు సమాచార బబుల్‌లో కొనసాగుతున్నారని చేసిన వ్యాఖ్యలపై అమెరికా అధ్యక్షుడికి కోపం వచ్చింది. ఆయనొక సక్సెస్‌ఫుల్ కమెడియన్ అనిపించుకున్నారని అలాగే కొనసాగుతారని భావిస్తున్నట్లు పోస్టుచేసారు. అంతేకాకుండా రష్యాతో మొదట ఉక్రెయిన్ వివాదాన్ని ప్రారంభించిందని ట్రంప్ చెప్పుకొచ్చారు. 350 బిలియన్ డాలర్లు అమెరికా ఖర్చుచేసినా యుద్ధంలో విజయం సాధించలేకపోతున్నారని ట్రంప్ వ్యాఖ్యా నించారు. అమెరికా లేకుండా రష్యాసేనలను ఢీకొనడం కష్టమేనని గతంలోనే జెలెన్‌స్కీ చెప్పిన సంగతి తెలిసిందే. అమెరికా లేకుండా ఉక్రెయిన్ ఈసమస్యను ఎప్పటికీ పరిష్కరించుకోలేదని ట్రంప్ అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌చేస్తున్న వ్యాఖ్యలు రష్యాకు మద్దతిచ్చేవిగా ఉన్నాయని, తనకు ఎన్నికల్లో రేటింగ్ నాలుగుశాతంగా ఉందని చేసిన వ్యాఖ్యలు రష్యా ఇచ్చిన తప్పుడు సమాచార మేనన్నారు. మొదట వివాదం తామే ప్రారంభించామని చెప్పడంకూడా విడ్డూరంగా ఉందని రష్యా ఉక్రెయిన్ యుద్ధంలోకి జెలెన్‌స్కీ అమెరికాను లాగుతున్నారని ట్రంప్‌చేసిన వ్యాఖ్యలను కూడా ఆయన ఖండించారు. యూరోప్‌కంటే అమెరికా 200 బిలియన్ డాలర్లు వ్యయంచేసిందని, యూరోప్ సొమ్ములకు గ్యారంటీ ఉందని, అమెరికా ఎప్పటికీ వెనక్కి తీసుకోలేదని అన్నారు. ఈ యుద్ధం అమెరికాకంటే యూరోప్‌కే ఎక్కువ ప్రయోజనకరమని వేర్పాటుకు మద్యలో ఒక పెద్ద సముద్రం ఉందన్నారు.

# కుంభమేళాలో స్నానంచేస్తున్న మహిళల విడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు

## కేసు నమోదు చేసిన యుపి పోలీసులు



**ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 20:** ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తూనే ఉన్నారు. ఇప్పటివరకు 55కోట్ల మందికి పైగా భక్తులు త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ క్రమంలో కుంభమేళాలో స్నానం చేస్తున్న మహిళా భక్తుల వీడియోలు విక్రయిస్తున్న రెండు సామాజిక ఖాతాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు యుపి పోలీసు అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మహిళల గోప్యత, గౌరవానికి భంగం కలిగించే ఇలాంటి వీడియోలను కొన్ని ప్లాట్‌ఫామ్‌లలో అప్‌లోడ్ చేస్తున్నాయి. సోషల్ మీడియా మానిటరింగ్ టీమ్ దీన్ని గుర్తించింది. దీనిపై కొత్వాల్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ వీడియోలు అప్‌లోడ్ చేసిన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను గుర్తించేందుకు మెటా నుంచి వివరాలు కోరినట్లు పోలీసులు వెల్లడించారు. మరోవైపు టెలిగ్రామ్ ఛానళ్లలో ఈ వీడియోలు విక్రయిస్తున్నట్లు మరో కేసు నమోదయింది. వీటిపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మహాకుంభమేళాకు సంబంధించి అభ్యంతకరమైన, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే సామాజిక మాధ్యమాలపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. జనవరి 13న మొదలైన మహా కుంభమేళా కార్యక్రమం ఫిబ్రవరి 26 వరకు కొనసాగనున్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి 26 నాటికి త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలుచేసే భక్తులసంఖ్య 60 కోట్లుదాటే అవకాశంఉందని అంచనా వేస్తు న్నారు. తొలుత దీనికి 45కోట్లమంది మాత్రమేవస్తారని అంచనావేయగా ఊహించనిరీతిలో భక్తులు పోటెత్తారు.

# శ్రీలంకలో రైలు ఢీకొని ఆరు ఏనుగులు మృతి

**కొలంబో, ఫిబ్రవరి 20:** శ్రీలంకలో రైలు ఢీకొని ఆరు ఏనుగులు మృతి చెందాయి. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. రైలులోని ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది కలగలేదు. అయితే ఏనుగుల గుంపును ఢీకొన్న రైలు పట్టాలు తప్పింది. కొలంబోకు తూర్పున ఉన్న హబరానాలోని వైల్డ్ లైఫ్ రిజర్వ్ ఫారెస్టులో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. గాయపడిన రెండు ఏనుగులకు చికిత్స అందిస్తున్నారు. శ్రీలంకలో గత యేడాది ఏనుగుల వల్ల 170 మంది మృతి చెందారు. అయితే వేర్వేరు ఘటనల్లో 500 ఏనుగులు కూడా ప్రాణాలు కోల్పోయాయి. లంకలో సగటున ప్రతి యేడాది సుమారు 20 ఏనుగులు రైలు ఢీకొనడం వల్ల మృతి చెందుతున్నట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అడవుల నరికివేత వల్ల జంతువులు మానవ ప్రదేశాల్లోకి వస్తున్నాయి. అటవీ ప్రాంతాల్లో రాత్రి పూట రైళ్లను నెమ్మది నడపాలని, హారన్లు ఇవ్వాలని డ్రైవర్లకు ఆదేశాలు ఉన్నట్లు అధికారులు చెప్పారు. శ్రీలంలో సుమారు ఏడువేల ఏనుగులు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. బౌద్ధ మతస్తులు ఆ జంతువుల్ని పవిత్రంగా భావిస్తారు. ఏనుగుల్ని చంపితే అక్కడ జైలు శిక్ష లేదా జరిమానా విధిస్తారు.

### ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్

# పదవీకాలం పొడిగింపు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** ముఖ్య ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ పదవీకాలాన్ని కేంద్ర ప్రభుత్వం మరో రెండేళ్లు పొడిగించింది. ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. దాంతో నాగేశ్వరన్ మార్చి 31, 2027 వరకు పదవిలో కొనసాగుతారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆయన 2022, జనవరి 28న సిఇఎగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన వివిధ ఆర్థిక విధానాలపై ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడంతో పాటు కేంద్ర బడ్జెట్‌కు ముందు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ఆర్థిక సర్వేను రూపొందించడం ఆయన కార్యాలయం బాధ్యత. మాజీ క్రెడిట్ సూయిస్ గ్రూప్ ఎజి, జూలియస్ బేర్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్, విద్యావేత్త అయిన నాగేశ్వరన్.. కెవి సుబ్రమణియన్ స్థానంలో ప్రధాన ఆర్థిక సలహాదారుగా నియామకయ్యారు.

ఆసియాలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలో మందగమన సంకేతాల మధ్య 2024-25 ఆర్థిక సర్వే రాబోయే ఆర్థిక సంవత్సరానికి 6.3-6.8 శాతం వృద్ధి రేటును అంచనా వేసిన కొద్దివారాల తర్వాత.. నాగేశ్వరన్ పదవీకాలాన్ని పొడిగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. కేంద్రం అంచనా ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక వ్యవస్థ 6.4 శాతం వృద్ధి చెందుతుందని అంచనా. నాగేశ్వరన్ సిఇఎగా బాధ్యతలు స్వీకరించడానికి ముందు.. 2019 నుంచి 2021 వరకు ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలిలో పార్ట్‌టైమ్ సభ్యుడిగా పని చేశారు. భారత్, సింగపూర్‌లో అనేక బిజినెస్ స్కూళ్లకు పని చేశారు. నాగేశ్వరన్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (ఎంబిఎ) డిగ్రీని పొందారు. 1994లో మసాచుసెట్స్ విశ్వవిద్యాలయం నుంచి ఫైనాన్స్‌లో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఆయన ఐఎఫ్ఎంఆర్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్, క్రియా విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్‌లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా ఉన్నారు.

# తూర్పు ఐరోపా నుంచి అమెరికా దళాలు వెనక్కి!



**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యాకు అనుకూలంగా మరో కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ మేరకు జర్మనీ పత్రిక బిల్డ్ కథనం ప్రచురించింది. దీని ప్రకారం.. 1990 తర్వాత నాటోలో చేరిన దేశాల్లో ఉన్న అమెరికా సేనలను వెనక్కి పిలిపించాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది. దీంతో అల్బానియా, బల్గేరియా, క్రొయేషియా, ఎస్తోనియా, ఫిన్‌లాండ్, హంగేరీ, లాత్వియా, లిథువేనియా, మాంటెనెగ్రో, నార్త్ మెసిడోనియా, పోలాండ్, రొమానియా, స్లొవేకియా, స్లొవేనియా, స్వీడన్‌ల నుంచి దళాలు వెనక్కి వచ్చే అవకాశాలున్నాయి. వీటితోపాటు ఇటలీ, కొసావో నుంచి అమెరికా దళాలు వైదొలిగే అవకాశాలున్నాయి.

ముఖ్యంగా బాల్టిక్ దేశాల నుంచి దళాలను వెనక్కి రప్పించడంపై ట్రంప్ సానుకూలంగా స్పందించొచ్చని అధికార వర్గాలు నమ్ముతున్నాయని ఫైనాన్షియల్ పత్రిక పేర్కొంది. దీనిపై లథువేనియా అధ్యక్షుడు స్పందిస్తూ.. అమెరికా-ఐరోపా సైనిక సహకారం భవిష్యత్తుపై చర్చలు జరుగుతున్నట్లు వెల్లడించారు. అమెరికా దళాలను వెనక్కి తీసుకొంటుందనే సంకేతాలు ఇప్పటివరకు లేవన్నారు.

తూర్పుఐరోపాలోని పోలాండ్‌లో అమెరికా దళాలు అత్యధికంగా ఉన్నాయి. వీరి సంఖ్య 10,000కు పైగా ఉండొచ్చు. రష్యా- ఉక్రెయిన్ యుద్ధాన్ని ఎట్టి పరిస్థితుల్లోను ముగించేలా ట్రంప్ హడావుడిగా చర్యలు చేపట్టారు. కాస్తభూమితో పోయేదాన్ని యుద్ధం వరకూ తీసుకొ చ్చారని జెల్‌న్‌స్కీనే ట్రంప్ నిందించారు. ఈ క్రమంలో తాజాగా తూర్పు ఐరోపా నుంచి సేనల విరమణ కూడా రష్యాకు సానుకూలంశం అవుతుంది.

**పెంటగాన్ రక్షణ బడ్జెట్‌ను తగ్గించుకోవాలని ఆదేశాలు**

పెంటగాన్‌న డిఫెన్స్ బడ్జెట్‌ను తగ్గించుకోవాలని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సే ఆదేశాలు జారీ చేశారు. యేటా 8 శాతం చొప్పున తగ్గించుకొంటూ రావాలని పేర్కొన్నారు. ఈ కోతలను ఫిబ్రవరి 24 నాటికి సిద్ధం చేయాలని వెల్లడించారు. బడ్జెట్ తగ్గింపుల నుంచి 17 విభాగాలకు మాత్రమే మినహాయింపు ఇచ్చారు. వీటిల్లో అణ్వాయుధాలు, అమెరికా దక్షిణ సరిహద్దుల్లో కార్యకలాపాలు, మిసైల్ డిఫెన్స్ ప్రోగ్రామ్‌లు వంటివి ఉన్నాయి. గతేడాది అమెరికా 850 బిలియన్ డాలర్లను రక్షణ కోసం వెచ్చించింది. 2023 నాటికి దీనిలో 300 బిలియన్ డాలర్లను తగ్గించాలని హెగ్సే లక్ష్యంగా పెట్టుకొన్నారు.

# చైనాతో అమెరికా ఒప్పందం!

## వాణిజ్య యుద్ధ భయాల వేళ ట్రంప్ పచ్చజెండా

**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** దూకుడు నిర్ణయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. చైనా విషయంలో మరో కీలక నిర్ణయం తీసుకునేందుకు సిద్ధం అవుతున్నారు. డ్రాగన్‌తో ట్రేడ్ వార్ డీల్ రూపుదాల్చే అవకాశం ఉందని తాజాగా వ్యాఖ్యలు చేశారు. 2020లోనే చైనాతో ఒక గొప్ప వాణిజ్య ఒప్పందం జరిగిందని మీడియాతో మాట్లాడుతూ గుర్తు చేశారు. రెండు దేశాల మధ్య ట్రేడ్‌వార్ జరుగుతుందన్న ఆందోళనల వేళ అగ్రరాజ్య అధ్యక్షుడి నుంచి ఈ వ్యాఖ్యలు రావడం గమనార్హం. ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆయన నోటిలో టారిఫ్ పదమే వినిపిస్తోంది. దానికి తగ్గట్టే మిత్రులు, శత్రువులు అనే తేడా లేకుండా అన్ని దేశాలపై పరస్పర సుంకాలు విధిస్తానని తేల్చి చెప్పారు. వాణిజ్య లోటును తగ్గించుకోవడం కోసమే ఆయన దూకుడుగా వ్యవహరిస్తున్నారు.

చైనా నుంచి అమెరికాకు దిగుమతి చేసుకునే వస్తువులపై 10 శాతం సుంకాలు విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దానికి చైనా కూడా కౌంటర్ ఇచ్చింది. అమెరికా నుంచి దిగుమతి అవుతున్న బొగ్గు, ద్రవీకృత సహజ వాయువుపై (ఎల్ఎన్‌జి) 15 శాతం సుంకం విధిస్తున్నట్లు చైనా ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించిన సంగతి తెలిసిందే.

ముడి చమురు, వ్యవసాయ పరికరాలు, పెద్ద ఇంజిన్ల కార్లపై 10 శాతం సుంకాన్ని వసూలు చేయనున్నట్లు తెలిపింది. ఇలా ఒకరిపై ఒకరు పరస్పర సుంకాలు విధించుకుంటున్న తరుణంలో ట్రంప్ నుంచి ఈ స్పందన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఐ-లీగ్ జాతీయ ఫుట్‌బాల్ టోర్నీలో..
# హైదరాబాద్ శ్రీనిధి డెక్కన్ విజయం
### 2-1 తేడాతో రాజస్థాన్ యునైటెడ్ ఓటమి



**ఢిల్లీ:** ఐ-లీగ్ జాతీయ ఫుట్బాల్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్బాల్ క్లబ్ (ఎఫ్సీ) జట్టు ఐదో విజయం నమోదు చేసింది. జైపూర్‌లో జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ ఎఫ్సీ 2-1 గోల్స్ తేడాతో రాజస్తాన్ యునైటెడ్ ఎఫ్సీ జట్టును ఓడించింది. 10 మ్యాచ్‌ల తర్వాత రాజస్తాన్ జట్టుకు ఇది తొలి ఓటమి కావడం గమనార్హం. శ్రీనిధి జట్టు తరఫున ఏంజెల్ ఒరెలియన్ (43వ నిమిషంలో), డేవిడ్ కాస్టనెడా మునోజ్ (73వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. రాజస్తాన్ యునైటెడ్ జట్టుకు మైకోల్ కబ్రెరా (75వ నిమిషంలో) ఏకైక గోల్ అందించాడు. ఈనెల 25న జరిగే తదుపరి మ్యాచ్‌లో డెంపో స్పోర్ట్స్ క్లబ్‌తో హైదరాబాద్ శ్రీనిధి డెక్కన్ ఎఫ్సీ జట్టు తలపడుతుంది. 12 జట్లు పోటీపడుతున్న ఈ ఐ-లీగ్‌లో 15 మ్యాచ్ పూర్తి చేసుకున్న శ్రీనిధి జట్టు 19 పాయింట్లతో ఎనిమిదోస్థానంలో ఉంది.

## జాతీయ పారా అథ్లెట్‌లో..
# తెలంగాణ అమ్మాయికి స్వర్ణం



**న్యూఢిల్లీ:** జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు స్వర్ణ పతకం లభించింది. చెన్నైలో జరుగుతున్న ఈ టోర్నీలో తెలంగాణ అమ్మాయి, అంతర్జాతీయ పారాథ్లెట్ జివాంజి దీప్తి 400 మీటర్ల విభాగంలో విజేతగా నిలిచింది.

దీప్తి అందరికంటే వేగంగా, అందరి కంటే ముందుగా 57.82 సెకన్లలో గమ్యానికి చేరి పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. హర్యానాకు చెందిన పూజా 1:08.21 సెకెన్లలో గమ్యాన్ని చేరుకుని రజతం సొంతం చేసుకోగా, హర్యానాకే చెందిన భువి అగర్వాల్ కాంస్యం దక్కించుకుంది.





## మహిళల ప్రీమియర్ లీగ్‌లో..
# ఢిల్లీ క్యాపిటల్స్ రెండో విక్టరీ
### 7 వికెట్ల తేడాతో యుపి వారియర్స్ ఓటమి

**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టీ20 టోర్నీలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు రెండో విజయం నమోదు చేసుకుంది. వడోదర వేదికగా జరిగిన పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ 7 వికెట్ల తేడాతో యూపీ వారియర్స్‌పై నెగ్గింది. అనాబెల్ సదర్లాండ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చడం వల్ల ఈ విజయం సాధ్యమైంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన యూపీ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. ఢిల్లీ ప్లేయర్లలో ఓపెనర్ కిరణ్ నవగిరె (27 బంతుల్లో 51; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) శుభారంభం అందివ్వగా, శ్వేత సెహ్రావత్ (37; 4 ఫోర్లు, 1 సిక్స్) హెన్రీ (15 బంతుల్లో 33 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్సులు) రాణించారు. ఢిల్లీ బౌలర్లలో అనాబెల్ 2 వికెట్లు తీసింది. అనంతరం లక్ష్యఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు 19.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 167 పరుగులు చేసింది. మెగ్ లానింగ్ (49 బంతుల్లో 69; 12 ఫోర్లు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా, ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అనాబెల్ (41 నాటౌట్; 4 ఫోర్లు), మరిజాన్ కాప్ (29 నాటౌట్; 4 ఫోర్లు), షఫాలీ వర్మ (26; 3 ఫోర్లు, 1 సిక్స్) కీలక పరుగులు చేశారు. యూపీ వారియర్స్ బౌలర్లలో సోఫియా, దీప్తి శర్మ, గ్రేస్ హ్యారిస్ తలా ఒక వికెట్ తీశారు.

## ఖతర్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో..
# బోపన్న జోడీ శుభారంభం



**న్యూఢిల్లీ:** ఖతర్ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న (భారత్)-నునో బోర్జెస్ (పోర్చుగల్) జోడీ సంచలన విజయంతో శుభారంభం చేసింది. దోహాలో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో బోపన్న-బోర్జెస్ ద్వయం 7-6 (7/2), 7-6 (7/4)తో రెండో సీడ్ సిమోన్ బొలెలీ-ఆండ్రియా వావాసోరి (ఇటలీ) జంటను బోల్తా కొట్టించింది. 89 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న ద్వయం ఏడు ఏస్లు సంధించింది. మ్యాచ్ మొత్తంలో రెండు జంటలు తమ సర్వీస్‌లను నిలబెట్టుకోవడంతో టైబ్రేక్‌లు అనివార్యమయ్యాయి. టైబ్రేక్స్‌లో బోపన్న-బోర్జెస్ పైచేయి సాధించి విజయాన్ని అందుకోవడంతో పాటు, క్వార్టర్ ఫైనల్ బెర్తును ఖరారు చేసుకున్నారు.

# ఛాంపియన్స్ ట్రోఫీలో డేంజరస్ టీమ్
### టీమిండియాకు టెర్రర్
### మూడో మ్యాచ్‌కు ఇబ్బందులు





**న్యూఢిల్లీ:** ఛాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టుకు ఇబ్బందులు మూడో మ్యాచ్ నుంచి ఎదురుకానున్నాయి. టోర్నీ మూడో మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టుతో తలపడేందుకు టీమిండియా సిద్ధమైంది. ఐసీసీ ఈవెంట్లలో భారత జట్టుకు కివీస్ పెద్ద తలనొప్పిలా మారింది. ఎల్లప్పుడూ టీమిండియాపై ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూనే ఉంది. ఈసారి భారత్, న్యూజిలాండ్ జట్లు ఒకే గ్రూప్‌లో ఉన్నాయి. ఈ నెల 23 ఆదివారం దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో రెండు జట్లు తలపడనున్నాయి. గత ఎడిషన్‌లో, భారత జట్టు తమ గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచి ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు చేరుకుంది. కానీ, చివరికి పాకిస్తాన్ చేతిలో ఓడిపోయింది. మరోవైపు, న్యూజిలాండ్ తమ గ్రూప్‌లో చివరి స్థానంలో నిలిచింది. మూడు మ్యాచ్‌ల్లో ఒక్కటి కూడా గెలవలేకపోయింది. అయితే, రాబోయే ఎడిషన్‌లో టోర్నమెంట్ గెలవడానికి భారత్, న్యూజిలాండ్ రెండూ ఫేవరెట్‌లలో ఉన్నాయి. 2025 ఛాంపియన్స్ ట్రోఫీకి భారతదేశం సిద్ధమవుతుండగా, న్యూజిలాండ్‌ను చూసి టీం ఇండియా కాస్తంత భయపడుతోంది. ఐసీసీ ఏ ఈవెంట్‌లోనైనా నాకౌట్ మ్యాచ్‌లలో న్యూజిలాండ్ ఎల్లప్పుడూ భారతదేశాన్ని ఇబ్బంది పెడుతుంది. 2000 సంవత్సరంలో, కివీస్ జట్టు ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్‌ను ఓడించింది. సెమీఫైనల్స్ లో 2019 ప్రపంచ కప్ నుంచి భారత జట్టును ఓడించింది. ఇటీవల పాకిస్థాన్‌లో జరిగిన ముక్కోణపు సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ 78 పరుగుల భారీ తేడాతో పాకిస్థాన్‌ను ఓడించింది. తదుపరి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై 305 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి 6 వికెట్ల తేడాతో సులభంగా ఓడించింది. చివరికి పాకిస్తాన్‌పై ఫైనల్ మ్యాచ్‌ను కూడా గెలుచుకుంది. ఇక ఛాంపియన్స్ ట్రోఫీకి ముందే న్యూజిలాండ్ బ్యాటింగ్ లైనప్ ఫామ్‌ను కనుగొంది. ట్రైసిరీస్‌లో, అనేక మంది కివీస్ బ్యాట్స్‌మెన్స్ ఫామ్‌ను కనుగొన్నారు. ఐసీసీ ఈవెంట్‌లోకి వెళ్లే ముందు పూర్తి విశ్వాసంతో బరిలోకి దిగనుంది. ఈ టోర్నమెంట్‌లో కేన్ విలియమ్సన్ మూడు ఇన్నింగ్స్‌లలో 112.50 సగటుతో 225 పరుగులు చేసి అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా నిలిచాడు. గ్లెన్ ఫిలిప్స్ (మూడు మ్యాచ్‌ల్లో 154 పరుగులు), డారిల్ మిచెల్ (మూడు మ్యాచ్‌ల్లో 148 పరుగులు), డెవాన్ కాన్వే (రెండు మ్యాచ్‌ల్లో 145 పరుగులు) వంటి బ్యాట్స్‌మెన్ కూడా పరుగుల స్కోరు చేసిన వారిలో ఉన్నారు.

ఆట





## హాకీ ప్రో లీగ్‌లో..
## భారత్ పురుషుల జట్టు
# సంచలనం
### వరల్డ్ ఛాంపియన్ జర్మనీపై 1-0తో గెలుపు
### స్పెయిన్ చేతిలో భారత్ మహిళల టీం ఓటమి

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ లీగ్‌లో భారత పురుషుల జట్టు సంచలనం సృష్టించింది. ప్రపంచ చాంపియన్ జర్మనీ జట్టుతో భువనేశ్వర్‌లో జరిగిన రెండో రౌండ్ రెండో మ్యాచ్‌లో టీమిండియా 1-0 గోల్ తేడాతో విజయం సాధించింది. ఆట నాలుగో నిమిషంలో గుర్జంత్ సింగ్ చేసిన గోల్‌తో భారత్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత చివరి వరకు ఈ ఆధిక్యాన్ని కాపాడుకుంటూ వచ్చిన భారత్ చివరకు విజయాన్ని ఖరారు చేసుకుంది.

అంతకు ముందు జర్మనీతో జరిగిన రెండో రౌండ్ తొలి మ్యాచ్‌లో భారత్ 1-4 గోల్స్ తేడాతో పరాజయం పాలైంది. మరోవైపు భారత మహిళల జట్టుకు మరో ఓటమి ఎదురైంది. స్పెయిన్ జట్టుతో జరిగిన రెండో రౌండ్ రెండో లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు 0-1తో ఓడిపోయింది.

స్పెయిన్ తరఫున సెగూ మార్టా (49వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించింది.

# పిఎన్‌బి వడ్డీరేట్ల తగ్గింపు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** దాదాపు ఐదేళ్ల తర్వాత రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఇటీవల రెపో రేటును తగ్గించింది. దానికి అనుగుణంగా ఇప్పుడు బ్యాంకులు కూడా రుణ రేట్లను సవరిస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా వడ్డీరేట్లను తగ్గించగా, ఇప్పుడు మరో ప్రభుత్వ రంగ పిఎన్‌జి కూడా అదే నిర్ణయం తీసుకుంది. రిటైల్ రుణాలపై 25 బేసిస్ పాయింట్ల వరకు వడ్డీ రేట్లను తగ్గిస్తున్నట్లు పంజాబ్ నేషనల్ బ్యాంకు గురువారం ప్రకటించింది. కొత్త వడ్డీ రేట్లు ఫిబ్రవరి 10 నుంచి అమల్లోకి తీసుకొచ్చినట్లు బ్యాంకు తాజా ప్రకటనలో వెల్లడించింది. గృహరుణాలతో పాటు, కారు ఎడ్యుకేషన్, పర్సనల్ లోన్లపై ఈ తగ్గింపు వర్తించనుంది. తాజా సరవణతో పిఎన్‌బిలో గృహరుణాల ప్రారంభ రేటు 8.15 శాతానికి దిగొచ్చింది. దీంతో రూ.లక్ష రుణానికి ఇఎంఐ రూ.744గా ఉంటుందని బ్యాంకు తెలిపింది. ఇక ఆటోమొబైల్ రుణాలపై వడ్డీ రేటు 8.50 శాతం నుంచి ప్రారంభం కానుంది. విద్యా రుణాలపై కనిష్ట వడ్డీని 7.85 శాతానికి తగ్గించినట్లు పిఎన్‌బి తెలిపింది. అటు వ్యక్తిగత రుణాలపై సవరించిన వడ్డీరేటు 11.25 శాతంగా ఉన్నట్లు పేర్కొంది. ఫిబ్రవరి 7న రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా రేపో రేటును 6.50శాతం నుంచి 25 బేసిస్ పాయింట్లు తగ్గింపు 6.25 శాతానికి తగ్గించిన విషయం విదితమే. దీంతో పలు బ్యాంకులు కూడా తమ రుణాలపై వడ్డీ రేట్లను సవరిస్తున్నాయి. గత వారం ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ ఆధారిత లెండింగ్ రేట్, రెపో లింక్డ్ లెండింగ్ రేట్లను ఎస్‌బిఐ 25బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది.



# చదువు మానేయాలన్న నిర్ణయం బాధించింది: బిల్ గేట్స్




వాణిజ్యం

**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాప కుడు బిల్ గేట్స్ (బిల్ గేట్స్) తన కాలేజీ జీవితం గురించి పలు ఆసక్తికర విష యాలు. హార్వ యూనివర్సిటీలో చదువు మానేయాలనే నిర్ణయం తీసుకున్నప్పుడు చాలా బాధపడినట్లు చెప్పా రు. సోర్స్ కోడ్ మై బిగినింగ్స్ పేరుతో తాను తీసుకొచ్చిన పుస్తకంలో ఆసక్తికర విషయా లన్నీ తాజాగా పాల్గొన్న ఓ కార్యక్రమంలో పంచుకున్నారు. కళాశాల రోజులు చాలా ఆహ్లాదకరంగా గడిచాయని, ఆనాటి రోజులను గుర్తుకు తెచ్చుకున్నారు. హార్వర్డ్‌లో బాగా ఎంజాయ్ చేశాను. మనస్తత్వ శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, చరిత్రకు సంబంధించిన తరగతులను ఆస్వాదించేవాడిని. తెలివైన వాళ్లతో సమయం గడపడం నాకు నచ్చేది. ఆసక్తికరమైన విషయాలపై రాత్రిళ్లు చర్చించేవాళ్లం అని గేట్స్ అన్నారు. 1975లో సాఫ్ట్‌వేర్ కంపెనీ తొలి సీఈవోగా బాధ్యతలు చేపట్టేందుకు హార్వర్డ్ యూని వర్సిటీలో చదువు మానేయాల్సి వచ్చిందని బిల్ గేట్స్ ఏర్పాటు చేసింది. ఆ నిర్ణయం తీసుకోవడం చాలా బాధను కలిగించింది. డిగ్రీ పూర్తిచేసేందుకు హార్వర్డ్‌కు తిరిగి వెళ్లాలనిపించింది. అయితే వచ్చిన అందిపుచ్చు కొనేందుకు తాను, తన స్నేహితుడు అయిన పాల్‌అలెన్ను, కళాశాలను విడిచిపెట్టాల్సి వచ్చిందని గేట్స్ చెప్పారు. ఆసమయంలో గేట్స్, అలెన్ ఇద్దరూ కంప్యూటర్ల కోసం ఒక సాఫ్ట్‌వేర్‌ను సృష్టించగలిగితే కొత్త పరిశ్రమలో ముందంజలో ఉండగలమని భావించారు. అలా రెండేళ్ల మైక్రోసాఫ్ట్‌ను నడుపుతూనే తన చదువును బ్యాలెన్స్ కోసం ప్రయత్నించారు. తన చదువు పూర్తి చేయడానికి మరో స్నేహితుడు. మైక్రోసాఫ్ట్ ప్రోగ్రామర్ అయిన రిక్ వీలాండ్ సాయం తీసుకోవాలనుకున్నారు. కానీ అది కుదరలేదు. ఇక చివరకు చదువు మానే యాల్సి వచ్చిందని చెప్పారు. ఇదిలా ఉంటే, సోర్స్ కోడ్ పుస్తకాన్ని మూడు భాగాలుగా తీసుకొస్తున్నారు. వాల్యూమ్ 1లో తన చిన్ననాటి సంగతులు, డ్రగ్స్‌తో ప్రయోగం లాంటి వివరాలను మాత్రమే గేట్స్ ప్రస్తావించారు. తన ఉద్యోగ జీవితం, మైక్రోసాఫ్ట్ ప్రయాణం, మెలిందా గేట్స్‌తో వివాహం, దాతృత్వ కార్యక్రమాలకు చోటు కల్పించలేదు. భవిష్యత్తులో విడు దల చేసే పుస్తకాల్లో వాటి గురించి వివరించే అవకాశం ఉంది. 2000 సంవత్సరం వరకు మైక్రోసాఫ్ట్ సిఇఒగా గేట్స్ విధులు నిర్వర్తించారు. తన పదవీకాలంలో కంప్యూటర్ పరిశ్రమలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చారు. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుల్లో ఒకరిగా నిలిచారు.




# గూగుల్ పేలోనూ ఇక ఛార్జీల మోత!

**ముంబై, ఫిబ్రవరి 20:** గూగుల్‌కు చెందిన పేమెంట్ యాప్ గూగుల్ పే (గూగుల్ పే) విద్యుత్, గ్యాస్ వంటి బిల్ పేమెంట్లపైనా ఛార్జీలు వసూలు చేస్తోంది. ఇప్పటివరకు ఈతరహా లావాదేవీలపై ఎలాంటి ఫీజూ విధించేది కాదు. ఇక నుంచి క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు ద్వారా లావాదేవీలపై కన్వీనియన్స్ ఫీజు రూపంలో స్వల్ప మొత్తంలో రుసుము వసూలుచేసేందుకు సిద్ధమైంది. యూపీఐ లావాదేవీలకు మాత్రం ఈ ఛార్జీలు వర్తించవు. ఇతర పేమెంట్ ప్లాట్‌ఫామైన పేటీఎం, ఫోన్‌పేలు ఇప్పటికే ఈ తరహా ఫీజును వసూలు చేస్తుండగా, ఇన్నాళ్లూ ఉచితంగా అందించిన గూగుల్ పే సైతం ఇకనుంచి వాటి బాటలోనే నడవనుంది. గూగుల్‌పే మొబైల్ రీఛార్జీలపై రూ.3 కన్వీనియన్స్ ఫీజు రూపంలో వసూలు చేస్తోంది. ఇకపై క్రెడిట్, డెబిట్ కార్డు చేసే విద్యుత్, గ్యాస్ బిల్ పేమెంట్లపై 0.5 శాతం నుంచి 1 శాతం వరకు ఛార్జీలు విధిస్తున్నట్లు సూచిస్తున్నాయి. గూగుల్‌పేలో ఇటీవల క్రెడిట్ కార్డ్ ద్వారా విద్యుత్ బిల్లు చెల్లించిన ఓ యూజర్‌కు ఈ అనుభవం ఎదురైనట్లు ఓ ఆంగ్లమీడియా సంస్థ ఉదాహరణను ఉటంకించింది. తాను చెల్లించిన కరెంట్ బిల్‌పై రూ.15 కన్నియన్స్ ఫీజు రూపంలో గూగుల్ పేమెంట్ వసూలు చేసినట్లు ఆ వ్యక్తి పేర్కొన్నాడు. ఈ పేమెంట్ ప్లాట్‌ఫామ్ ఇప్పటికే ఛార్జీల వసూలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. అయితే ఈ రుసుములు అందరికీ వర్తిస్తాయా? లేదా? అనే విషయం ఇంకా తెలియలేదు. భవిష్యత్‌లో అందరినుంచీ ఈ ఫీజు వసూలు చేసే అవకాశం ఉందని టెక్‌లు ఉన్నాయి. అయితే ఒప్పందం గూగుల్ పే ఎక్కడా అధికారికంగా వివరాలు వెల్లడించలేదు. పే గూగుల్ వెబ్‌సైట్ ప్రకారం.. కార్డ్ పేమెంట్ ప్రాసెసింగ్ ఖర్చుల్ని కవర్ చేయడానికి ఈ రుసుము సాయపడుతుందని, ఇప్పటికే అనేక ఫిన్టెక్, క్విక్కామర్స్, ఫుడ్ డెలివరీ సంస్థలు ప్లాట్‌ఫామ్ ఫీజు వసూలు చేయడం ప్రారంభించాయి. ఇదే ట్రెండ్‌ను ఇతర సంస్థలూ అనుసరించే అవకాశం ఉందని, తమ ఆదాయాలు పెంచుకోవడానికి ఈ మొత్తాలు ఉపయోగపడతాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.




# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, ఫిబ్రవరి 20:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం కూడా నష్టాల్లోనే ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతి కూల సంకేతాలతో ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు, రోజంతా అదే ఒరవడి కొనసాగించాయి. దీంతో వరుసగా మూడో రోజూ నష్టాల్లో ముగిసాయి. అమెరికా అనుసరిస్తున్న టారిఫ్ పాలసీలు, దానివల్ల ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న భయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. మన మార్కెట్‌లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు, ఐటిసి, మారుతి సుజుకి షేర్లలో అమ్మకాలు సూచీలను కిందకు లాగాయి. చివరికి సెన్సెక్స్ 203.22 పాయింట్లు క్షీణించి 75,735.96 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 19.75 పాయింట్లు నష్టపోయి 22,913.15 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.86.65గాఉంది. హెచ్‌డిఎఫ్‌సిబ్యాంకు, మారుతి సుజుకి, టెక్ మహీంద్రా, హెచ్‌సి ఎల్ టెక్నాలజీస్, ఐటిసి వంటి షేర్లు నష్టపోయాయి. ఎన్‌టిపిసి, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, టాటా మోటార్స్ వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 76.16 డాలర్ల వద్ద కొనసాగగా, బంగా రం ఔన్సు 2971 డాలర్ల వద్ద ట్రేడ యింది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.